
# లోకానికి నేనే వెలుగు

## దివ్యబలిపూజ - యేసుక్రీస్తు జ్ఞాపకార్థ అర్చన



"... దీనిని నా జ్ఞాపకార్థము చేయుడు" (లూకా 22:19)

సంపుటి - 40 ఏప్రిల్ - జూన్ 2017 సంచిక - 2

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

## ప్రచురణ

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.


## సంపాదక వర్గం

ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్
ఫాదర్ నందిపాము జోజప్ప
ఫాదర్ రెడ్డిమాసు పాపయ్య
ఫాదర్ కొమ్మారెడ్డి మర్రెడ్డి

## గురు విద్యార్థుల వర్గం

బ్రదర్ పాల బాలస్వామి
బ్రదర్ ప్రత్తిపాటి అమృత్
బ్రదర్ కుచ్చర్ల మార్టిన్
బ్రదర్ లింగతోటి రత్న కిషోర్
బ్రదర్ నల్ల సుధీర్ కుమార్
బ్రదర్ కత్తుల సునీల్ బాబు
బ్రదర్ అల్లం సాగర్ మనోజ్ కుమార్
బ్రదర్ మానూరి మార్కో
బ్రదర్ కల్లేపల్లి యేసు బాబు

## చందా వివరములు

సంవత్సరానికి మీ చందాను రూ. 100/- యం.ఓ., డి.డి..ల ద్వారా
St. John's Regional Seminary Society, Hyderabad
పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు
మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్ :


**St. John's Regional Seminary**
Ramanthapur, Hyderabad - 500 013
Ph : 040-27201427, 27200370, Fax : 27209505
e-mail : stjohnshyd2@gmail.com



Printed at : holycrossprinters 9848145417

# లోకానికి నేనే వెలుగు

సంపుటి-40 ఏప్రిల్ - జూన్ 2017 సంచిక-2

## దివ్యబలిపూజ
## యేసుక్రీస్తు జ్ఞాపకార్థ అర్చన

**ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్**
ప్రధాన సంపాదకులు

**ఫాదర్ నందిపాం జోజప్ప**
సంచిక సంపాదకులు

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ 040-27201427, 27200370
e-mail : stjohnshyd2@gmail.com
website : stjohnseminaryhyd.org

# విషయసూచిక


సంపాదకీయం

1. **కథోలిక దైవార్చన :**
**అర్థము, పుట్టుపూర్వోత్తరాలు, వివిధ అంశాలు, ప్రాముఖ్యత............ 8**
*– ఫాదర్ నందిపాం జోజప్ప*

2. **పూజా బలిపీఠం (Altar) : అర్థము, పరిశుద్ధ గ్రంథ నేపథ్యం,**
**అభిషేక క్రమము మరియు ప్రాముఖ్యత ................................ 16**
*– బ్రదర్ బండి కిరణ్ కుమార్*

3. **దైవ వాక్యార్చన పీఠం (Ambo) : అర్థము, సంక్షిప్త చరిత్ర, దైవార్చనలో**
**పీఠపాత్ర, వాక్యార్చన ప్రాధాన్యత మరియు తీసుకోవలసిన జాగ్రత్తలు 24**
*– బ్రదర్ బిరుదుగడ్డ రవికుమార్*

4. **దివ్యపూజా పఠనముల గ్రంథము(Lectionary) : అర్థము, చరిత్ర,**
**అమర్చబడిన క్రమము మరియు ప్రాముఖ్యత ......................... 30**
*– బ్రదర్ చొప్పర కిషోర్ బాబు*

5. **దివ్యపూజ గ్రంథము (Missal) : అర్థము, చరిత్ర, అమర్చబడిన**
**విధానము, వినియోగములో తీసుకోవలసిన జాగ్రత్తలు................. 39**
*– బ్రదర్ దారా షడ్రక్*

6. **దివ్యపూజలో చేయవలసినవి–చేయకూడనివి........................... 56**
*– బ్రదర్ అల్లం సాగర్, బ్రదర్ దారా షడ్రక్, బ్రదర్ మానూరి మార్క్*

# సంపాదకీయం



అది 2010వ సంవత్సరం, నేను బెంగళూరులోని క్రీస్తుజ్యోతి కాలేజీలో దైవశాస్త్రపు మాస్టర్ (M.Th.) చదువు కొనసాగిస్తున్నాను. అప్పుడు మాకు HOD గా దివంగత గురువులు Rev. Dr. Paul Puthanangady ఉండేవారు. ఆయన ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా మాకు బోధించేవారు. మేము అడిగే ప్రశ్నలకు వెలిబుచ్చే సందేహాలకు చక్కగా, ఎంతో ఓర్పుగా సమాధానాలు చెప్పేవారు. ఒకరోజు ఆయన మాకు దివ్యబలిపూజ గురించి చెపుతూ ఉండగా మా బ్యాచ్‌లో ఒకరైన సిస్టర్ సుగుణ గారు ఈ క్రింది ప్రశ్నను అడిగారు. "ఫాదర్, గడిచిన ఎండాకాలం సెలవులలో నేను మా పుట్టింటిలో ఉన్నాను. మరణించిన మా తాతగారి జ్ఞాపకార్థం (మరణ వార్షికోత్సవం) మా ఇంటిలో కుటుంబ ప్రార్థన జరిగింది. మా బంధువులు, స్నేహితులు, ఇరుగు పొరుగువారు చాలామంది ఆ ప్రార్థనలో పాల్గొన్నారు. నా ప్రశ్నేంటంటే - మా తాతగారి మరణ జ్ఞాపకార్థ ప్రార్థనకు యేసుక్రీస్తు మరణ జ్ఞాపకార్థం జరిగే దివ్యబలిపూజకు మధ్య ఉన్న తేడా ఏమిటి?"

అప్పుడు ఆ ఫాదర్ గారు ఈ విధంగా సమాధానం చెప్పారు. "మీరు మీ తాతగారి మరణ జ్ఞాపకార్థ ప్రార్థనలో తాతగారి ఫోటో పెట్టుకున్నట్లే పూజలో కూడా సిలువనాథుని స్వరూపం (Crucifix) ఉంటుంది; ఆ ప్రార్థనలో మీ తాతగారి జీవిత విశేషాలను జ్ఞాపకం చేసుకున్నట్లే పూజలో కూడా క్రీస్తు జీవిత విశేషాలను, సందేశాలను జ్ఞాపకం చేసుకుంటాము. మరి తేడా ఏమిటంటే తాతగారి మరణ జ్ఞాపకార్థ ప్రార్థనలో ఆయన జ్ఞాపకాలే ఉంటాయి కాని తాతగారు ఉండరు. దివ్యబలిపూజలో కేవలం క్రీస్తు జీవిత విశేషాలు మాత్రమే కాదు సాక్షాత్తు క్రీస్తుప్రభువే ఉంటారు. కనుకనే దివ్యబలిపూజను క్రీస్తు గుమికూడిన విశ్వాసుల సంఘం ద్వారా తండ్రిదేవునికి సమర్పించే నిత్యమైన, సత్యమైన శాశ్విత బలి అని; అది లోకరక్షణార్థం నిరంతరం, యుగయుగములు మరలా రెండవ రాకడలో క్రీస్తు వచ్చునంత వరకు నిర్విరామంగా జరిగే క్రీస్తుకార్యము" అని ముగించారు.

యేసుప్రభువు కడరారాత్రి భోజన సమయంలో దివ్యబలిపూజను స్థాపించినపుడు **"...దీనిని నా జ్ఞాపకార్థము చేయుడు"** (లూకా 22:19) అని అన్నారు. దీనినే పునీత పౌలుగారు కొరింతీయులకు వ్రాసిన లేఖలో స్పష్టము చేస్తారు. "ఇది మీ కొరకు ఇవ్వబడిన నా శరీరము. దీనిని నా జ్ఞాపకార్థము చేయుడు" అదే విధముగా భోజనము తరువాత పాత్రను తీసుకొని, "ఈ పాత్ర నా రక్తములోనైన నూతన నిబంధన. దీనిని మీరు పానము చేయునుపుడెల్లా, నా జ్ఞాపకార్థము చేయుడు" (1 కొరింతీ 11:24-25) అని పలికెను. కనుకనే **"దివ్యబలిపూజ యేసుక్రీస్తు జ్ఞాపకార్థ బలిపూజ"**. యేసుక్రీస్తు ఒసగిన ఈ ఆజ్ఞ కొనసాగింపు కొరకై శ్రీసభ మొదటి నుండి విశ్వాస పాత్రముగా ఉంది "వీరు (అనగా తొలిక్రైస్తవ సంఘము) అపోస్తులుల బోధనయందును, వారి సహవాసమునందును, రొట్టె విరుచుటయందును, ప్రార్థించుట యందును ఎడతెగక ఉండిరి" (అపో.కా. 2:42).

ఈనాడు శ్రీసభ అంతటా జరిగే ఈ దివ్యబలిపూజ క్రీస్తు జ్ఞాపకార్థబలి. అనగా క్రీస్తు "మరలా వచ్చేవరకు" ఆయన జ్ఞాపకార్థం, లోకరక్షణార్థం తండ్రిదేవుని మహిమార్థం జరిగే బలి. ఈ జ్ఞాపకార్థ బలిలో కేవలం క్రీస్తు జీవిత, శ్రమల మరణ పునరుత్థానాలను మాత్రమేగాక మొత్తం రక్షణ చరిత్ర మనకు పున:స్మరణ అవుతుంది. అటువంటి ఈ దివ్యబలిపూజకు బలివస్తువు మరియు బలియాజకుడు రెండూ క్రీస్తువే. సాక్షాత్తు క్రీస్తుప్రభువే వివిధ రూపాలలో తన ప్రత్యక్షతను కనబరుస్తూ పూజను నెరవేరుస్తారు.

సాధారణంగా దివ్యబలిపూజలో క్రీస్తు 5 విధాలుగా తన ప్రత్యక్షతను కనబరుస్తారు. 1. గుమికూడిన జ్ఞానస్నానం పొందిన విశ్వాసుల రూపములో క్రీస్తు ఉంటారు. "ఎక్కడైతే ఇద్దరు లేక ముగ్గురు నా నామములో కూడి ఉంటారో వారి మధ్యలో నేను ఉన్నాను" (మత్తయి 18:20). 2. అభిషేకము పొందిన గురువు రూపములో క్రీస్తు ఉంటారు. 3. వాక్యార్చనలో చదవబడే దైవవాక్‌రూపములో ఉంటారు. "ఆదిలో వాక్కు ఉండెను, ఆ వాక్కు దేవుని వద్ద ఉండెను. ఆ వాక్కు దేవుడై ఉండెను (యోహాను 1:1). 4. అభిషేకించబడిన దివ్యపూజాబలిపీఠము రూపములో ఉంటారు. 5. క్రీస్తు శరీరరక్తాలుగా మారిన పవిత్ర రొట్టె, పవిత్ర ద్రాక్షారసరూపములో ఉంటారు. ఈ విధముగా క్రీస్తు వివిధ రూపాలలో ప్రత్యక్షమై పూజ ఆరంభము నుండి అంతము వరకు పూజను

కొనసాగిస్తూ, నెరవేరుస్తూ తనను తాను మనకు భోజ్యముగాను, ఆత్మల రక్షణ ఔషముగాను ప్రసాదిస్తున్నారు. అయితే దీనిని ప్రత్యక్షముగా నెరవేర్చే బాధ్యత జ్ఞానస్నానం పొందిన విశ్వాసుల సంఘానికి ఇవ్వబడింది. క్రీస్తు తన వారసులకు ఈ బాధ్యతను ఇస్తూ ఉన్నప్పుడు **"నా జ్ఞాపకార్థం చేయండి"** అనే ఆజ్ఞను జారీ చేశారు. కాబట్టి ఈ బలిపూజ క్రీస్తు జ్ఞాపకార్థం జరిగే అర్చన. అందుకే దివ్యపూజను గూర్చి తెలియజేసే ఈ సంచికకు **"దివ్యబలిపూజ – క్రీస్తు జ్ఞాపకార్థ అర్చన"** అనే నామకరణం చేయడం జరిగింది.

ఈ సంచికలో పూజాబలిని ముఖ్య అంశముగా తీసుకొని వాక్యార్చన, కృతజ్ఞతార్చన అనే రెండు ముఖ్యమైన కోణాల నుండి పరిశీలించి; ఈ రెండు భాగాలను ఎక్కడ జరపాలి? ఎలా జరపాలి? ఎవరు జరపాలి అనే విషయాలను వివరించడం జరిగింది. అట్లు వివరించే ప్రయత్నములో చారిత్రాత్మక పుట్టు పూర్వోత్తరాలను సంక్షిప్తముగా పొందుపరచడం జరిగింది. అలాగే వాటి ప్రాధాన్యతను, వినియోగించే విషయములో తీసుకోవలసిన జాగ్రత్తలు, అనుసరించవలసిన విధానాలు కూడా పేర్చడం జరిగింది. చివరగా భారత శ్రీసభ మేత్రాణులంతా కలిసి ఫిబ్రవరి నెల 3వ తారీకు నుండి 8వ తేదీ వరకు 2015 సం॥రములో జరిపిన 27 సంపూర్ణ సభ ద్వారా వెలువరించిన "జీవితములో దైవార్చన" అను అధికార పత్రములోని దివ్యబలి నియమాలను "దివ్యపూజలో చేయవలసినవి – చేయకూడనివి" అనే సంపుటితో ఈ సంచికను ముగించడం జరిగింది.

ఇందు పొందుపరచిన విషయాలు కేవలం సాధారణ కతోలిక విశ్వాసులకే గాక ఉపదేశులకు, మఠవాసులకు చివరకు దివ్యబలిపూజను సమర్పించు యాజకులకు కూడా మార్గదర్శకముగాను, మేలుకరముగాను ఉంటాయని ఆశిస్తున్నాను. తద్వారా దివ్యపూజలో పాల్గొనేవారు, పూజను నెరవేర్చేవారు కూడా అర్థవంతముగా అర్చనను నెరవేర్చుతూ రక్షణ ఫలాలను సక్రమంగా, సంపూర్ణముగా అనుభవించాలనే ఉద్దేశముతో ఈ సంచిక ద్వారా చిన్న ప్రయత్నం చేస్తున్నాము.

ఇట్లు ప్రభు సేవలో...
**ఫాదర్ నందిపాం జోజప్ప**
సంచిక సంపాదకులు

# 1. కథోలిక దైవార్చన: అర్థము, పుట్టుపూర్వోత్తరాలు, వివిధ అంశాలు, ప్రాముఖ్యత

– ఫాదర్ నందిపాం జోజప్ప



## 1. ఉపోద్ఘాతము

"మానవులు అందరును రక్షింపబడవలయుననియు, సత్యమును తెలిసికొనవలెననియు" దేవుడు అభిలషిస్తున్నారు 1 తిమోతి 2:4). ఇదే దేవుని చిత్తము. దేవుడు తన చిత్తాన్ని ఒక ప్రణాళికా బద్ధముగా నెరవేర్చారు. గతమున ఆయన "పెక్కుమార్లు పెక్కు విధములుగ ప్రవక్తల ద్వారా మన పూర్వీకులతో మాట్లాడెను (హెబ్రీ 1:1). వారి ద్వారా తన రక్షణ ప్రణాళికను ఈ లోకమునకు తెలియజేసెను. కాని కాలము పరిపూర్ణమైనప్పుడు సాక్షాత్తూ తన కుమారుణ్ణే ఈ లోకానికి పంపారు (గలతీ 4:4) ఆయనే యేసుక్రీస్తు. ఆదిలో వాక్కు అయిన ఈ దేవుని కుమారుడు పవిత్రాత్మ దేవుని సర్వోన్నత శక్తి వలన కన్యమరియ గర్భాన శిశువుగా ఈ లోకములో జన్మించారు (లూకా 1:35). తన బహిరంగ సువార్తా ప్రచార జీవితంలో చాలాసార్లు తాను ఈ లోకమునకు ఎందుకు వచ్చారో ఆ ఉద్దేశాన్ని స్పష్టం చేశారు. "నేను పరలోకము నుండి దిగి వచ్చినది నన్ను పంపినవాని చిత్తమును నెరవేర్చుటకేగాని, నా ఇష్టానుసారము చేయుటకు కాదు" (యోహాను 6:38).

"మానవుల రక్షణము" అను దేవుని చిత్తము నెరవేరాలంటే "పాప ప్రక్షాళన" జరగాలి. "రక్త ప్రోక్షణ" వలననే "పాప ప్రక్షాళన" జరుగుతుంది; కారణం రక్తమునకు పాపమును శుద్ధిచేయు గుణము కలదు (హెబ్రీ 9:22). అయతే పాత నిబంధనలో నెరవేర్చిన ఎద్దుల యొక్కయు, మేకల యొక్కయు

మరే ఇతర ప్రాణుల యొక్క రక్తము ఏనాటికి లోకముయొక్క పాపములను శాశ్వితముగా తొలగింపలేవు. కారణం ఆ ప్రాణులన్నియు పాపములో జన్మించినవి మరియు వాటి రక్తము పాప భూయిష్టము. పాపముతో ఉన్న రక్తము ఏనాటికి లోకపాపములను తొలగించలేదు (హెబ్రీ 10:3-4). కనుకనే దేవుని కుమారుడు పాపరహితుడైన క్రీస్తు లోకపాపములను పరిహరించుటకై దేవుని పవిత్ర గొఱ్ఱెపిల్లగా జన్మించారు (యోహాను 1:29). ఈ విధముగా దేవుడు పాత బలులన్నింటినీ తొలగించి వాటి స్థానమున క్రీస్తుబలిని నియమించారు (హెబ్రీ 10:9). ఈ విషయాన్ని కూడా క్రీస్తు తన భూలోక జీవిత యాత్రలో సుస్పష్టం చేశారు. "మోషే ఎడారిలో ఎట్లు సర్పమును ఎత్తెనో ఆయనను విశ్వసించు ప్రతివాడును నిత్యజీవమును పొందుటకు అట్లే మనుష్యకుమారుడును ఎత్తబడవలయును (యోహాను 3:14-15). యేసుక్రీస్తు, తండ్రిదేవుడు తనను కోరినట్లుగా తన శరీరబలి అర్పణ చేసి మనలందరిని పాపముల నుండి శుద్ధిచేసి శాశ్వితముగా పవిత్రులను చేసియున్నారు (హెబ్రీ 10:9). దేవునికీ మానవులకు మధ్య సంపూర్ణ సఖ్యత కొరకు క్రీస్తు తానే ఒక బలివస్తువు (Offering) గాను, బలినిచ్చే యాజకునిగాను (Offerer)గా మారిపోయారు (యోహాను 10:18). ఈ విధముగా తండ్రిదేవుడు తాను ఉద్దేశించిన రక్షణప్రణాళికను క్రీస్తుద్వారా పరిపూర్తి చేశారు (ఎఫెసీ 1:9).

తాను నెరవేర్చిన ఈ "లోకరక్షణ కార్యం" భూదిగంతముల వరకూ వ్యాపించి, సకలజాతి జనులకు అందాలని; ఈ ప్రక్రియ లోకాంత్యము వరకూ కొనసాగాలని క్రీస్తు "శ్రీసభ"ను స్థాపించారు; దానికి పాలకునిగా పునీత పేతురును, అతని సహచరులుగా మిగతా అపోస్తులను ఎన్నుకున్నారు (మత్తయి 16:18-19; 10:2-4). క్రీస్తు ఇచ్చిన "రక్షణ వ్యాప బాధ్యతను" సువార్తా బోధనం ద్వారా, 7 దివ్య సంస్కారాల నిర్వహణ ద్వారా, ఎడతెగని ప్రార్థన మరియు సహవాసము ద్వారా అపోస్తలులు కొనసాగించారు (అపో.కా. 2:41-47). దీనినే "అర్చన" (Liturgy) గా, "దైవార్చన" (Divine Liturgy) గా "పవిత్ర అర్చన" (Sacred Liturgy) గా ఆనాటి నుండి ఈనాటి వరకు తల్లిశ్రీసభ కొనియాడుతుంది మరియు కొనసాగిస్తుంది.

## 2. అర్థము

"అర్చన" అనగా "ఆరాధన" అని అర్థం. "అర్చన" అను తెలుగుపదం "లిటర్జి" (Liturgy) అనే ఆంగ్ల పదము నుండి వచ్చింది. "లిటర్జి" అనే ఈ ఆంగ్ల పదము "లైతుర్గియా" అనే గ్రీకు పదము నుండి పుట్టింది. "లైతుర్గియా" అనగా "బహిరంగపనని" (Public Work) అని, "ప్రజల పని" (Peoples' Work) అని అర్థము. గ్రీకు సామ్రాజ్యములోని ప్రజలు దేశం తరుపున అధికారికంగా నిర్వహించే పనులకు ఈ పదాన్ని వాడేవారు. ఉదాహరణకు ప్రకృతి విపత్కర సమయాలలో, వ్యాధులు, యుద్ధాలు వచ్చిన సమయంలో ప్రజలందరు ఏకమై దేశం తరపున పనిచేసే దానికి "లైతుర్గియా" అనే మాటను వాడేవారు. ఆ తర్వాత కాలములో, "శ్రీసభలోని ప్రజలు" అనగా జ్ఞానస్నానం పొందినవారు కలిసికట్టుగా చేసే పనైన "ఆరాధన"కు లేదా "అర్చనకు" ఈ పదాన్ని స్వీకరించి వాడటం జరిగింది.

కాబట్టి అర్చన అనగా "జ్ఞానస్నానం పొందిన శ్రీసభ సభ్యులందరూ శ్రీసభ తరపున అటు దేవుని మహిమ కొరకు (Glorification of God) ఇటు మానవుల రక్షణ కొనసాగింపు కొరకు (Sanctification of People) బహిరంగముగా నిర్వహించు అధికారిక ఆరాధన" (Official Worship) అని అర్థము." ఇది దేవుని మహిమ కొరకు జరిగే ఆరాధన కాబట్టి "దైవార్చన" (Divine Liturgy) అని, ప్రజలకు పవిత్రతను చేకూర్చే ఆరాధన కాబట్టి "పవిత్ర అర్చన" (Sacred Liturgy) అని, శ్రీసభ అధికారికంగా నిర్వహించే ఆరాధన కాబట్టి "శ్రీసభ అర్చన" (Official Worship of the Church) అనే సర్వనామాలు ఉన్నాయి.

## 3. పుట్టుపూర్వోత్తరాలు

అర్చనకు మూలం (Source) మరియు గమ్యం (End) తండ్రిదేవుడే. తండ్రి దేవుడు తన రక్షణ ప్రణాళికను యేసుక్రీస్తు సిలువ మరణ, పునరుత్థాన మోక్షారోహణము ద్వారా పరిపూర్తి చేశాడు (ఎఫెసీ 1:9). కాబట్టి అర్చన క్రీస్తుకార్యం. రక్షణ చరిత్రలో ఆది నుండి పవిత్రాత్మ దేవుడు ఎలా పనిచేశాడో అలాగే క్రీస్తు పరమ పాస్కా రహస్య (Paschal Mystery) ప్రతిరూపమైన అర్చన కొనసాగింపులో కూడాను అదేవిధంగా పనిచేస్తున్నాడు. కనుక అర్చన పవిత్రాత్మ

దేవుని కార్యము. ఇది శ్రీసభలో, శ్రీసభ సభ్యులు (Baptized People) ద్వారా జరుగుతుంది. కాబట్టి అర్చన శ్రీసభ కార్యం కూడాను.

విపులంగా వివరించాలంటే అర్చనకు మూలం, గమ్యం తండ్రిదేవుడు. అర్చనకు బలివస్తువు మరియు బలియాజకుడు యేసుక్రీస్తు. నిత్యయాజకుడు అయిన క్రీస్తు, తన దేహమైన శ్రీసభ ద్వారా అర్చనను కొనసాగిస్తున్నాడు. అనగా జ్ఞానస్నానం స్వీకరించిన సభ్యుల ద్వారా, వారికి అర్థమయ్యే భాష (Language) మాటల (Words) మరియు వివిధ రకాల సంజ్ఞలు (Symbols), బంగిమలు (Gestures) ద్వారా; జ్ఞానస్నానము స్వీకరించిన సాధారణ యాజకవర్గము (General Priesthood) నుండే కొందరిని అభిషేక సేవకులుగా (Ordained Ministers) మరియు అభిషేకించబడని లేదా స్థాపించబడిన సేవకులుగా (Non-ordained or Instituted Ministers) ఉపయోగించుకుంటూ అర్చనను కొనసాగిస్తున్నాడు. శ్రీసభ మధ్యవర్తిత్వం (Mediatory role) ద్వారా క్రీస్తు కొనసాగిస్తున్న ఈ “రక్షణ అర్చన క్రియను” (Salvific Liturgical Act) పాస్కా పరమ రహస్యము (Paschal Mystery) గా మార్చునది మాత్రం పవిత్రాత్మయే (యోహాను 14:26). ఈ విధముగా రక్షణ కార్యమునకు ప్రతిరూపమైన అర్చన పుట్టింది తండ్రిదేవుని చిత్తములోనే; నెరవేరింది క్రీస్తు పాస్కాపరమ రహస్యము ద్వారా, కొనసాగుతున్నది పవిత్రాత్మశక్తి వలన (1 కొరింతీ 12:3), లబ్ధి పొందుతున్నది శ్రీసభ సభ్యులు. ఈ అర్చన కొనసాగింపు జరుగుతున్నది శ్రీసభలో మరియు శ్రీసభ సభ్యుల ద్వారా అనగా అర్చన కొనసాగింపు విషయంలో తల్లి శ్రీసభ ఒక పనిముట్టు (Instrumental)గా ఉన్నది. (C.C.C. 1077, 1071, 1091 మరియు 1070).

యేసుక్రీస్తు మరణానంతరం దాదాపు 300 సం॥రాల కాలంపాటు దైవార్చన అనేక మార్పులకు గురిఅవుతూ వచ్చింది. ఆ సమయంలో దైవార్చనకు సరైన అధికారిక విధానముగాని, ఖచ్చితమైన సాంగ్యములుగాని, ప్రత్యేకించబడిన ఆరాధనా ప్రదేశములు గాని లేవు. తొలిక్రైస్తవులు తమ స్వంత ఇండ్లలోను, సమాధుల స్థలముల యందును గుమికూడి రహస్యముగా అర్చనను నెరవేర్చుకొనేవారు (అపొ.కా. 2:41-47). చరిత్రపరంగా కాన్‌స్టాంటైన్ చక్రవర్తి క్రీ.శ. 313 సం॥లో క్రైస్తవులకు స్వాతంత్ర్యము ప్రకటించిన తరువాత నుండి

దైవార్చన సరైన విధముగా అభివృద్ధి పదముతో నడువసాగింది. రోమీయ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రేరేపితమైన తొలినాటి శ్రీసభ దైవార్చనా విషయములో కూడా వారి భాషా, సాంప్రదాయ, సాంస్కృతిక విషయాలను స్వీకరించడం జరిగింది. ఆ విధముగా లతీను భాష శ్రీసభ "అధికార అర్చనా భాష" (Official Liturgical language) గా మారింది. అర్చనలోని మాటలు (Sollemnis), ఉపయోగించబడే సంజ్ఞలు (Symbols), వస్త్రాలు (Vestments), పాత్రలు (Vessels), అర్చనా ప్రదేశము (Sacred Space), పవిత్ర కళలు (Sacred Arts), అలంకరణలు (Decorations), స్వరూపాలు (Images) అన్నీ కూడాను రోమీయమైపోయాయి. గ్రెగోరియన్ సంగీతం అధికార దైవార్చనా సంగీతము (Official Liturgical Music) గా స్వీకరించబడింది.

పశ్చిమములో రోమీయ లేదా లాటీను సంస్కృతి యొక్క ఆధిపత్యం కతోలిక దైవార్చనలో స్పష్టముగా ఉన్నా అదే సమయములో తూర్పు ప్రాంతములో ముఖ్యముగా యెరూషలేము, అంతియోకు మరియు అలెగ్జాంద్రియాలో వాటి స్థాపకులను బట్టి, ఆ ప్రాంత ప్రజల భాషా, సంస్కృతి మరియు విశ్వాస సాంప్రదాయాల అనుగుణముగా కతోలిక అర్చన అభివృద్ధి చెందుతూ వచ్చింది. ఈ విధంగా ప్రస్తుతం శ్రీసభలో ఉన్న 24 ఆరాధనా విధానాలు "పశ్చిమ అర్చన" (Western Liturgy or Latin Liturgy) గా గాను, "తూర్పు అర్చన" (Eastern Liturgy or Greek Liturgy) గా గాను విభజింపబడి ఉన్నాయి.

**4. వివిధ అంశాలు**

శ్రీసభ చేసే ప్రతి పనీ "దైవార్చన" కాలేదు. ఏదైతే త్రిత్వైక దేవుని పరమ రహస్యాన్ని వెల్లడి చేస్తుందో, ఏదైతే తండ్రిదేవుని రక్షణ ప్రణాళికను విపులీకరిస్తుందో, ఏదైతే దేవుని కుమారుడు యేసుక్రీస్తు జీవితమును, ముఖ్యముగా ఆయన పాస్కా పరమరహస్యాన్ని ప్రకటిస్తుందో, ఏదైతే పవిత్రాత్మ దేవుని శక్తిని తెలియజేస్తూ, క్రీస్తురక్షణ కార్యాన్ని, ఆయన రెండవ రాకడ వరకూ కొనసాగిస్తుందో అదే దైవార్చన. దానినే శ్రీసభ నిరంతరం నిర్వహిస్తుంది మరియు అర్చనలో పాల్గొన్న విశ్వాసులు పైచెప్పబడిన పరమ రహస్యాలను దైనందిన జీవితంలో ఆచరించమని, ఆ విధముగా ప్రపంచమునకు ఒక మాదిరిగా (Model, Exemplary) ఉండమని ప్రబోధిస్తుంది (C.C.C.1066-68).

అధికారపూర్వకంగా దైవార్చనలో ఈ క్రింది అంశాలు ఉన్నాయి. అవి

1. దేవుని వాక్యము (Word of God or Sacred Scripture)
2. దివ్య సంస్కారాలు (7 Sacraments)
3. శ్రీసభ దైవార్చనా గడియలు (Liturgy of the Hours)
4. దైవార్చనా సంవత్సరము (Liturgical Year)

**5. దైవార్చనకు ప్రశస్త భక్తి ఆచరణలకు గల బేధాలు**

**దైవార్చన (Liturgy)**

1. దైవార్చన అనేది తిరుసభ అధికారిక ఆరాధనా విధానము
2. దైవార్చనా స్థాపకుడు సాక్షాత్తు యేసుక్రీస్తు ప్రభువే
3. దీని క్రమము, ఆరాధనా విధానము ప్రపంచమంతటా ఒకే విధంగా ఉంటుంది.
4. దైవార్చనలో ముఖ్యముగా దివ్యసంస్కారాల అమలులో నిర్ణయించబడిన వస్తువు (Matter) రూపము (Form) మరియు అర్హుడైన నిర్వాకుడు (Minister) తప్పనిసరి.
5. ఇందులో సృజనాత్మక (Creativity) ఉండదు.
6. దైవార్చన అనేది ప్రశస్త భక్తి ఆచరణలను మూలం మరియు గమ్యంగాను ఉంది.
7. ఆత్మల రక్షణకు దైవార్చన తప్పనిసరి

**ప్రశస్త భక్తి ఆచరణలు (Popular Devotions)**

1. ప్రశస్త భక్తి ఆచరణలు అన్నీ తిరుసభ యొక్క అధికారిక ఆరాధనా విధానాలు కావు.
2. ప్రశస్త భక్తి ఆచరణలు విశ్వాసుల వ్యక్తిగత భక్తిజీవితము నుండి పుట్టినవి.
3. దీని క్రమము ఒకే విధముగా ఉండదు.
4. ప్రశస్త భక్తి ఆచరణలలో భక్తులు, వారి కోరికలు, ప్రార్థనలు, దీక్షలు మొ॥ మాత్రమే ఉంటాయి.

5. ఇందులో సృజనాత్మకత మరియు అశ్లేషపూరితం (Spontaneity) ఉంటాయి.

6. ప్రశస్త భక్తి ఆచరణలు దైవార్చనలో భక్తిగా పాల్గొనడానికి తోడ్పడతాయోగాని అవి దైవార్చనకు ఏనాటికి సమానం కాలేవు.

7. ఆత్మల రక్షణకు ప్రశస్త భక్తి ఆచరణలు తప్పనిసరి కాదు.

**6. ప్రాముఖ్యత**

పవిత్ర దైవార్చనం ద్వారానే ముఖ్యముగా దివ్యబలిపూజ సమర్పణం ద్వారానే మనకు ప్రసాదింపబడిన రక్షణము సంపూర్ణముగా లభిస్తుంది. ఈ దైవార్చనం ద్వారానే క్రైస్తవ విశ్వాసులు క్రీస్తుప్రభు యొక్క నిగూఢతత్వాన్ని, శ్రీసభ యదార్ధ స్వభావాన్ని, ఉనికిని, ఉద్దేశ్యాన్ని తెలుసుకోగలుగుతారు మరియు ఇతరులకు చాటి చెప్పగలుగుతారు. ఈ దైవార్చన విశ్వాసులకు దైవజ్ఞానాన్ని ప్రసాదిస్తుంది మరియు దైవభయాన్ని పెంపొందిస్తుంది. ఇది విశ్వాసులను నిత్యము వారి పాపముల నుండి శుద్ధీకరిస్తుంది. ఆత్మాహారాన్ని అందిస్తుంది. పవిత్రాత్మ దేవుని జ్ఞానవరాలను, అనుగ్రహాలను ప్రసాదిస్తుంది. శరీరక, మానసిక, ఆధ్యాత్మిక బలాన్ని ప్రసాదిస్తుంది. అనుదినము భక్తివిశ్వాసాలను పెంపొందిస్తుంది. తోటి మానవుల యెడల చూపవలెనన్న సోదరప్రేమను రగిలిస్తుంది. నీతి, న్యాయాలతో విశ్వాసులను నింపి, జాలి, దయ, ఉదారత్వముతో క్రీస్తును పోలి జీవించుటకు ఉపకరిస్తుంది. మామూలు మనుషులను మహనీయులుగా, పునీతులుగా మార్చుతుంది. అంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ దైవార్చన శ్రీసభ నిర్వహించే అన్ని సేవాకార్యముల కంటే శ్రేష్టమైనది, పవిత్రమైనది. మానవ రక్షణ సాధనలో దైవార్చన ద్వారా కలిగే ప్రయోజనాలకుగాని, దాని ప్రభావానికి గాని – శ్రీసభ ఆధ్వర్యంలో సాగే మరే ఇతర సేవా కార్యాలు సరితూగలేవు, సాటిరావు (SC.7).

**7. ముగింపు**

దైవార్చన వ్యక్తిగత ఆరాధన కాదు. ఇది శ్రీసభ సామూహికంగా, సమిష్టిగా నిర్వహించే భగవథారాధన, పీఠాధిపతుల నేతృత్వంలో, గురువుల సహకారముతో దేవుని పవిత్ర జన సంఘము జరుపుకునే ఏకతా ఆరాధన. ఇది సామూహిక ఆరాధన అయినప్పటికీ వ్యక్తిగతంగా ఆధ్యాత్మిక లబ్ధి చేకూరుతుంది (SC.28).

కాబట్టి దైవార్చన నిర్వహణలో గురువులుగాని, నిర్వాహణాధికారం గల వ్యక్తులుగాని ఆయా సాంగ్యాల స్వభావాన్ని బట్టి, దైవార్చనా నియమాలను బట్టి శ్రద్ధ వహించాల్సి ఉంటుంది (SC.29) . అర్చనా ఫలాలు దక్కాలంటే అందుకు విశ్వాసులు తమను తాము తగు రీతిలో సిద్ధపరచుకోవాలి. ఏకాగ్ర చిత్తముతో, భక్తి శ్రద్ధలతో దైవార్చనలో పాల్గొనాలి. వారు వల్లించే ప్రార్థనలు, గానం చేసే భక్తి గీతాలు వారి హృదయాంతరంగముల నుండి వెలువడాలి. పాటించవలసిన ప్రత్యేక దేహభంగిమలు, హస్త సంజ్ఞలు మొదలైనవి ఆరాధనా పూర్వకంగా చేయాలి. నిర్దేశించిన సమయాలలో దైవార్చనా మౌనాన్ని (Liturgical Silence or Sacred Silence) పాటించాలి (SC.11).

❊ ❊ ❊ ❊

# ౨. పూజా బలిపీఠం (Altar) : అర్థము, పరిశుద్ధ గ్రంథ నేపథ్యం, అభిషేక క్రమము మరియు ప్రాముఖ్యత

– బ్రదర్ బండి కిరణ్ కుమార్

## 1. ఉపోద్ఘాతము



దివ్యబలిపూజ కథోలిక విశ్వాస జీవితానికి మూలము. దివ్యబలి పూజార్చనలో ముఖ్యముగా రెండవ భాగమైన కృతజ్ఞతార్చన (Liturgy of the Eucharist) కు బలిపీఠం కీలకమైన వేదిక. క్రీస్తు పాస్కా పరమ రహస్యాన్ని ప్రతినిత్యం కొనియాడే స్థలం బలిపీఠం. క్రీస్తు శరీర రక్తాలను స్వీకరించేది ఈ పూజాబలి పీఠము నుండియే. అందుకనే దీనిని "ప్రభుభోజన బల్ల" (Table of the Lord) అని, "సిలువ యాగపు బలిపీఠము" (Sacrificial Table of the Cross) అని, కలువరి కొండ (Calvary) అని వివిధ నామాలతో పిలుస్తారు. సజీవ శిలయగు క్రీస్తువలె (1 పేతురు 2:4) ఈ బలిపీఠము కూడా దైవార్చనలో ప్రముఖమైన, పవిత్రమైన స్థలములో శాశ్వతముగా నిర్మించాలని, దీనిని కేవలం దైవారాధనకు మాత్రమే ఉపయోగించాలని శ్రీసభ మనకు బోధిస్తుంది (GIRM 297)

## 2. అర్థం

"బలిపీఠం" అనే తెలుగు పదం "ఆల్టర్" (Altar) అనే ఆంగ్లపదము నుండి వచ్చింది. "ఆల్టర్" అనే ఆంగ్ల పదం "ఆల్తారే" అనే లాటీను పదము నుండి పుట్టింది. "ఆల్తారే" అనగా "ఎత్తైనది" అని అర్థం. "ఆల్తారే" అనే లాటీను పదం "బోమోస్" (Bomos) అనే గ్రీకు పదము నుండి వచ్చింది.

"బోమెస్" అనుపదం "మిజ్‌బియా" (Mizbeah) అనే హీబ్రూ పదం నుండి పుట్టింది. "మిజ్‌బియా" (Mizbeah) అనగా "వధించు స్థలము" అని అర్థము. కాబట్టి బలిపీఠము అనగా "బలినిచ్చుటకై ఏర్పాటు చేయబడిన ఎత్తైన వేదిక" అని అర్థం. పవిత్ర దివ్యబలిపూజలో అర్పణ వస్తువు (Offering), అర్పణ చేసే యాజకుడు (Offerer) క్రీస్తు ఒక్కడే కాబట్టి ఈ బలిపీఠం క్రీస్తుప్రభువుకు ప్రతిరూపము (Representation of Christ) గా ఉందని శ్రీసభ మనకు అర్థవివరణ కావిస్తుంది (GIRM 296 & 298).

## 3. పరిశుద్ధ గ్రంథ నేపథ్యం

బలిపీఠము నూతనముగా ఈ ఆధునిక కాలములో కనుగొన్నది కాదు. ఇది పాత నిబంధనాకాలము నుండే వస్తుంది. అన్యుల యొక్క బలిపీఠమునకు క్రైస్తవుల యొక్క బలిపీఠమునకు చాలా వ్యత్యాసం ఉంది. ఈ వ్యత్యాసం మనకు పూర్తిగా అర్థం కావాలంటే పరిశుద్ధ గ్రంథ ఆధారంగా ఇస్రాయేలీయుల చారిత్రక, విశ్వాస సాంప్రదాయాలను తెలుసుకోవలసి ఉంది.

## 3.1. పూర్వనిబంధన నేపథ్యం

పూర్వ లేదా పాత నిబంధనలో మొట్టమొదటిసారిగా పీఠమును నిర్మించినది నోవా. జలప్రళయము ముగిసిన తరువాత ఓడ నుండి వెలుపలికి వచ్చిన నోవా చేసిన మొదటి పని దేవునకు పూజా పీఠమును నిర్మించి దానిపై దేవునకు దహన బలులను సమర్పించడమే (ఆది 8:20). ఆ తర్వాత మన పితామహుడైన అబ్రహాము తనకు దేవుడు ప్రత్యక్షమైన "షెకేము పుణ్యక్షేత్రము"లోని 'యోరే' వద్ద దేవునకు పూజాపీఠమును నిర్మించాడని (ఆది 12:7) ఆ తర్వాత బేతేలునకు తూర్పుగా ఉన్న "హాయికిని" నడుమ మరో పూజాబలిపీఠమును నిర్మించి దేవున్ని ఆరాధించాడని తెలుస్తుంది (ఆది 12:8). లోతు నుండి వేరుపడిన పిదప కానాను ప్రాంతమున ప్రవేశించిన అబ్రహాము "హెబ్రోను" మండలమున "మమ్రే" వద్ద మరో పూజాబలిపీఠమును నిర్మించాడు (ఆది 13:12,18). తన కుమారుడైన ఇస్సాకును బలినిచ్చే సమయంలో కూడా అబ్రహాము "బలివేదిక" నిర్మించాడు (ఆది 22:9-10). అటు తర్వాత అబ్రహాము కుమారుడు ఇస్సాకు కూడా "బేర్షెబా" వద్ద (ఆది 26:25), "షెకేము" వద్ద (ఆది 33:20), "బేతేలు"

వద్ద (ఆది 35:1,14) పూజా పీఠమును నిర్మించి భగవంతున్ని ఆరాధించాడు. అటు తర్వాత మోషే అమాలేకీయులతో యుద్ధం జరిగిన "రెఫదీము" దగ్గర పూజాపీఠమును నిర్మించాడు (నిర్గమ 17:15). ఆ తర్వాత సౌలు మహారాజు (1 సమూ 14:35), సొలొమోను మహారాజు (2 రాజుల దిన.4:1) కూడా దేవునకు బలిపీఠము నిర్మించారని తెలుస్తుంది. దేవుడు ప్రత్యక్షమయినపుడు లేదా దేవుని మహిమ ప్రత్యక్షమయినపుడు, దేవుని నిబంధనకు గుర్తుగా, దేవుని దీవెనకు కృతజ్ఞతగా అర్పించే బలుల కోసం, అన్నిరకాల దైవారాధనకు పవిత్ర స్థలముగా ఈ బలిపీఠములను నిర్మించి వాడటం జరిగింది.

ఇస్రాయేలీయుల మత ఆచార సాంప్రదాయములో ధాన్యబలి, పాపపరిహార బలి, దోషపరిహారబలి, సమాధానబలి, కృతజ్ఞతాబలి, దహనబలి, సంపూర్ణబలి అని రకరకాల బలులు ఉండేవి (లేవీ 6 మరియు 7 అధ్యాయాలు). వీటన్నిటిని నిర్వహించడానికై సరియగు బలిపీఠాలను నిర్మించేవారు.

బలిపీఠ నిర్మాణమునకు మొదట్లో పెద్ద బండను సహజ స్థితిలో ఉపయోగించేవారు. ఆ తర్వాత మట్టి, ఇటుక లేదా రాళ్లతో బలిపీఠాన్ని నిర్మించేవారు. ఆ తరువాత యాజకుల ఆదేశాల మేరకు తుమ్మ కొయ్యను నరికి, నాలుగు మూలలు చెక్కి పీఠమును నిర్మించేవారు. అట్లు తయారు చేసిన పీఠమునకు ఇత్తడి రేకులను తొడిగేవారు (నిర్గమ 27:1-3, 38:1-2). ఆ తర్వాత సొలొమోను మహారాజు కంచుతోను (2 రాజులు దిన.4:1) మరియు బంగారముతో కూడా బలిపీఠమును నిర్మించాడని తెలుస్తుంది (2 రాజు 4:19).

### 3.2. నూతన నిబంధన నేపథ్యం

నూతన నిబంధనలో బలిపీఠం క్రీస్తు రక్షణకార్యాన్ని సూచిస్తుంది. యేసుక్రీస్తు ఈ భూలోకమున శరీరధారుడైనపుడు తండ్రిచిత్తమును నెరవేర్చుటకై బలిని అర్పించుటకుగాను పాత నిబంధన సాంప్రదాయం ప్రకారం మేకల యొక్కయు, దూడల యొక్కయు రక్తమునుగాక తన రక్తమునే తీసుకొనిపోయి "గొల్గొతా" అను స్థలమున సిలువపై బల్యర్పణము చేసెను (హెబ్రీ 9:12; యోహాను 19:17-18). ఈ బలి అర్పణము చేత మనమందరము పాపము నుండి శాశ్వితముగా పవిత్రులుగ చేయబడితిమి (హెబ్రీ 10:10). అనగా తండ్రిదేవుని

చిత్తమైన లోకరక్షణ కార్యము సంపూర్ణమాయెను (హెబ్రీ 10:12,14). ఈ బలియాగ ఫలము భూదిగంతముల వరకు వ్యాపించి, సకల జాతిజనులకు లభించాలని, ఈ రక్షణ కార్యం లోకాంత్యము వరకు కొనసాగాలని కడరాత్రి భోజన సమయాన **"భోజన బల్ల"**పై ఉన్న రొట్టెను అందుకొని, ఆశీర్వదించి త్రుంచి తన శిష్యులకు ఇస్తూ "దీనిని మీరు తీసుకొని భుజింపుడు. ఇది నా శరీరము" అనెను. తరువాత ఆయన ద్రాక్షారసముతో నిండిన పాత్రను అందుకొని, కృతజ్ఞతా స్తోత్రములు చెల్లించి, వారికి ఇచ్చి "దీనిలోనిది మీరు అందరు త్రాగుడు. ఇది అనేకుల పాపపరిహారార్ధమై చిందబడనున్న నిబంధన యొక్క నా రక్తము" (మత్తయి 26:26-28) అని తన జ్ఞాపకార్దము దానిని చేయుమని తన శిష్యులకు ఒక నూతన నిబంధనను ఇచ్చెను (లూకా 22:19-20). అప్పటి నుండి క్రైస్తవ విశ్వాసులందరు అపోస్తులుల బోధనయందును, వారి సహవాసముయందును, రొట్టె విరుచుట యందును, ప్రార్థించుట యందును ఎడతెగక ఉండిరి (అపో.కా. 2:42, 1 కొరింతీ 10:16). రొట్టెను త్రుంచి క్రీస్తు శరీరముగా స్వీకరించుటకు, ద్రాక్షారసము క్రీస్తు రక్తముగా, ఆయన జ్ఞాపకార్థము జీవాహారముగా స్వీకరించుటకు ఆనాటి నుండి ఉపయోగించుచున్న స్థలమునే "పీఠము" (Altar) అని, బలిపీఠము (Sacrificial Altar) అని, పూజాపీఠము (Eucharistic Table) అని, పవిత్రపీఠము (Holy Altar) అని వివిధ నామాలతో పిలువబడుతూ ఉంది.

ఆదిమ క్రైస్తవులు బలిపీఠాన్ని ప్రభుభోజనబల్ల (Table of the Lord) గా పరిగణించినప్పటికీ తరువాత కాలములో అది పవిత్ర స్థలమని, దాని చుట్టూ దేవదూతలు ఉంటారని (దర్శన 9:13), క్రీస్తు సన్నిధానానికి (Christ's presence), ఆరాధనకు చిహ్నమని గ్రహించారు (దర్శన 8:3-5). చివరకు యేసుక్రీస్తే బలిపీఠమని విశ్వసించారు (దర్శన 21:2) దానినే నేటికి శ్రీసభ బోధిస్తుంది (GIRM 296).

## 4. దివ్యపూజాపీఠమును అభిషేకించు క్రమము

దేవాలయములో స్థిరబలిపీఠమును గోడకు ఆనుకొని కాకుండా, చుట్టూ ధూపంతో ప్రదక్షిణ చేయుటకు అనువుగా ఖాళీ స్థలమును ఉంచి, అతి పవిత్ర స్థలము (Sanctuary) లో నిర్మించి మేత్రాణుల చేత అభిషేకం చేయించాలి. మేత్రాణులు సమర్పించు దివ్యపూజలోని మొదటి భాగమైన వాక్యార్చన ముగియగానే బలిపీఠ అభిషేకక్రమము ప్రారంభం అవుతుంది.

## 4.1. తీర్థముతో అభిషేకము

ఈ దివ్యపూజలో పశ్చాత్తాప సాంగ్యమునకు బదులుగా తీర్థమును ఆశీర్వదించి ఆ తీర్థాన్ని ఈ సమయములో మొదటిగా పీఠము మీద తదుపరి ప్రజల మీద చిలకరించడం అనునది ఒక ప్రత్యేకమైన ఆచారము. దీనికి ఒక ప్రార్థనాక్రమము ఉంది. మొదటిగా ప్రార్థనకై ఆహ్వానము, సకల పునీతుల సంక్షిప్త ప్రార్థన, అటు తరువాత పునీతుల శేషాలను (Saint's Relics) పీఠము మధ్య భాగములో అమర్చడం, పీఠపు అంకిత ప్రార్థన (Prayer of Dedication) ఉంటుంది. ఆ తరువాతే పీఠాధిపతులు జ్ఞానస్నాన తీర్థ జలముతో పీఠమును, తర్వాత ప్రజలను ఆశీర్వదిస్తారు. ఇది క్రీస్తుప్రభుని జ్ఞానస్నానాన్ని మరియు ప్రజలందరి జ్ఞానస్నానానికి కారణమైన పాస్కాపరమ రహస్యమైన క్రీస్తు మరణ, పునరుత్థానమును సూచిస్తుంది. దీని ద్వారా క్రీస్తు మరణ పునరుత్థానాలను కొనియాడు వేదికగా ఆ పీఠము మారుతుంది. ఆ తరువాత మేత్రాణులు ఆలయంలో తిరుగుచూ ఆలయములో మరియు ప్రజలపై తీర్థమును చిలకరిస్తారు. దీనిద్వారా పీఠము చుట్టూ చేరిన విశ్వాసులందరూ ఒకే పవిత్ర ఆలయముగ, క్రీస్తు శరీరముగా మారతారని భావము. చివరగా మేత్రాణులు బలిపీఠము చుట్టూ తిరుగుతూ తీర్థమును చల్లడం ద్వారా ఈ సాంగ్యము ముగుస్తుంది.

## 4.2. పవిత్రీకృత (క్రిస్మా) తైలముతో అభ్యంగనము

రెండవదిగా మేత్రాణులు క్రిస్మా తైలములో బలిపీఠం నాలుగు మూలల యందును, మధ్యలోను అభిషేకం చేస్తారు.  ఈ తైలమునకు "క్రిస్మా" అను ఈ పేరు క్రీస్తు నుండి వచ్చినది. క్రీస్తు అనగా "అభిషేకించబడినాడు" అని అర్థం మేత్రాణులు సంవత్సరానికి ఒకమారు "పవిత్ర తైలాల పూజ"లో దీనిని అభిషేకిస్తారు. క్రొత్తగా జ్ఞానస్నానము పొందు వ్యక్తులను ఈ తైలముతో నుదుటిపై అభిషేకిస్తారు. ఆ విధంగా వారు క్రైస్తవులుగా, క్రీస్తుకు సొంతమవుతారు. అలాగే పీఠమును కూడా తైలములో అభిషేకం చేయడం ద్వారా, పీఠము క్రీస్తుకు సొంతము అవుతుంది. పీఠమునకు ఐదు స్థానాలలో అభిషేకించడం అనేది క్రీస్తుకు కలిగిన పంచగాయాలను సూచిస్తుంది. అటు తరువాత పవిత్రాత్మ దేవున్ని పీఠముపైకి, జ్ఞానస్నానం పొందిన ప్రజలందరిపైకి వేంచేసి రావాలని జరిగే ప్రార్థనతో ఈ సాంగ్యము ముగుస్తుంది.

## 4.3 ధూపముతో ఆశీర్వాదము

బలిపీఠమును తీర్థముతో మరియు క్రిస్మా తైలముతో అభిషేకము చేసిన తరువాత మేత్రాణులు ధూపము వేస్తారు. ధూపద్రవ్యమనేది సువాసనకు గుర్తుగా ఉంది. అది నిప్పులో కలియుట ద్వారా పైకి వెళ్లే స్వభావాన్ని కలిగి ఉంది. పాత నిబంధన ప్రకారం బలి అర్పణలు, ప్రజల ప్రార్థనలు ధూపం వలె దేవుని యొద్దకు చేరుతాయన్నది ఇస్రాయేలీయుల ప్రగాఢ విశ్వాసం. "నా ప్రార్థన సాంబ్రాణి పొగవలెను, పైకెత్తిన నా చేతులు సాయంకాలపు బలివలెను. నీ సన్నిధి చేరును గాక (కీర్తన 141:2). దేవునికి అర్పించే దహన బలికి సూచనగా, బలిని అర్పించే పీఠమునకు చిహ్నముగా ఒక పాత్రలో వత్తిని ఉంచి పీఠముపై ఉంచుతారు. మేత్రాణులు దానిని వెలుగిస్తారు మరియు దానిలో ధూపం వేస్తారు. ఈ విధముగా చేయడం ద్వారా క్రీస్తు తాను బలిని అర్పించిన కల్వరి బలిపీఠాన్ని మనము జ్ఞాపకపరచుకుంటాము. అటు తరువాత మేత్రాణులు ధూపమును పీఠముపై, పీఠము చుట్టూ వేస్తారు. ఈ సాంగ్యము, పీఠము చుట్టూ గ్రుమ్మి కూడి ప్రార్థించే ప్రజల మనవులు, పీఠముపై అర్పించే బలులు, ధూపమువలే సింహాసనాసీనుడైన దేవాది దేవుని సన్నిధానానికి చేరుతాయన్నది శ్రీసభ విశ్వాసం.

## 4.4 తెలుపు వస్త్రముతో అలంకరించుట

ప్రజలందరు పీఠము మీద ఉంచిన పాత్రలో ధూపపు సాంబ్రాణి వేయడం పూర్తి అయిన తరువాత ఆ పాత్రను అక్కడ నుండి తొలగిస్తారు. తరువాత పీఠమును శుభ్రపరచి, దానిపై తెలుపు రంగు వస్త్రమును పరుస్తారు. ఇది జ్ఞానస్నానం పొందిన తరువాత ధరించే నూతన వస్త్రానికి సూచనగా ఉంది. పునీత పౌలుగారు చెప్పిన విధముగా ఇది క్రీస్తును ధరించుటకు గురుతుగా ఉంటుంది. ఇక్కడ అభిషేకించబడిన బలిపీఠము క్రొత్త సృష్టిగా మారి క్రీస్తుని ధరించుచున్నదన్న మాట. తద్వారా బలిపీఠము దేవుని సాన్నిధ్యానికి చిహ్నంగా మరియు క్రీస్తు శరీర రక్తాలుగా అర్పించిన కలువరి పీఠమునకు మారుగా మారుతుంది.

## 4.5 పీఠము మీద వెలుగుచున్న క్రొవ్వొత్తులను అమర్చుట

పీఠమును తెలుపు వస్త్రముతో అలంకరించిన తరువాత చివరగా పీఠము మీద వెలుగుతున్న క్రొవ్వొత్తులను ఉంచుతారు. ఇది పునరుత్థానుడైన క్రీస్తు నుండి

వచ్చిన కాంతిని సూచిస్తుంది. ఈ కాంతిని పొందిన ప్రజలందరు తమ హృదయములో విశ్వాసమనే కాంతి జ్వాలను వెలిగించుకుని క్రీస్తు కాంతికి ప్రతీకగా జీవించాలని సూచిస్తుంది. ముఖ్యముగా క్రీస్తే జగతికి జ్యోతియని ఆయనను అనుసరించువారు అంధకారమున నడువక నిత్యజీవపు వెలుగులో నడుస్తారని భావం (యోహాను 8:12). దీనితో బలిపీఠము యొక్క అభిషేక, ప్రతిష్ఠక్రమము పూర్తి అవుతుంది.

## 5. దైవార్చనలో పీఠము యొక్క ప్రాముఖ్యత

బలిపీఠము దైవార్చనలో చాలా ప్రాముఖ్యతను కలిగి ఉంది. దైవజనులందరూ ఒకచోట గుమికూడి ప్రార్థించుటకు, వాక్యమును ఆలకించుటకు, దివ్యసంస్కారాలలో పాలుపంచుకొనుటకును, క్రీస్తు శరీర రక్తాలను స్వీకరించుటకును, ప్రభు శరీరమును ఆరాధించుటకు బలిపీఠము దోహదపడుతుంది. పీఠము చుట్టూ కూడిన ప్రజల విశ్వాసమును పెంపొందించుటలోను, తిరుసభ సభ్యులను ఐక్యపరచుటలోను, విశ్వాసుల ఆత్మరక్షణ కార్యము అక్కడి నుండే ప్రారంభం అగుటలోను బలిపీఠం కీలకపాత్రను పోషిస్తుంది.

## 5.1 దివ్యపూజాబలి సమర్పణ

బలిపీఠమును నిర్మించుటకు ముఖ్య కారణం దివ్యపూజాబలి సమర్పణ కొరకే. దివ్య పూజాబలిలో వాక్యార్చణ అనంతరం విశ్వాసులు తెచ్చిన అప్పద్రాక్షరసములు బలిపీఠముపై ఉంచుతారు. గురువు ప్రత్యేకమైన ప్రార్థనలు సల్పిన తరువాత పవిత్రాత్మ వాటిపైకి వచ్చి వాటిని పరిశుద్ధపరుస్తుంది (Epiclesis). అటు తరువాత కడరారాత్రి సమయాన క్రీస్తు పలికిన పలుకులను గురువు భక్తితో ప్రార్థించుట ద్వారా (Words of Institution) అవి క్రీస్తు శరీరరక్తాలుగా మారుతాయి. అటు తరువాత గురువు వాటిని పీఠము నుండి ముందుగా తాను స్వీకరించి అటు తరువాత విశ్వాసులందరికీ పంచిపెడుతారు. ఈ విధంగా అందరు క్రీస్తుని స్వీకరించుటకు బలిపీఠం దోహదపడుతుంది.

## 5.2 ప్రతి క్రైస్తవుడు ఒక బలిపీఠమే

క్రీస్తునకు, క్రీస్తు ప్రత్యక్షతకును చిహ్నముగా మారిన పీఠము ప్రతి క్రైస్తవుడు కూడాను ఒక పీఠముగా మారాలన్న సత్యాన్ని వ్యక్తం చేస్తుంది. ప్రతి క్రైస్తవుడు క్రీస్తువలే తనను తాను రిక్తుని చేసుకొని, తన పాపములకు పరిహారముగా క్రీస్తుతో పాటు పూజాబలిలో తనను తాను సరైన రీతిలో అర్పించుకొనుట ద్వారా ఒక ఆధ్యాత్మిక బలిపీఠముగా మారుతాడన్నది విశ్వాస సత్యం. పునీత గ్రెగోరి గారు "మంచి జీవితం జీవించిన ప్రతి క్రైస్తవుడు కూడా మంచి బలిపీఠము" అని అన్నారు.

## 6. ముగింపు

బలిపీఠము కతోలిక దేవాలయములో మరియు దైవార్చనలో ప్రముఖ స్థానాన్ని కలిగి ఉండి ప్రత్యేకమైన పాత్రను పోషిస్తుంది. ఇది కతోలికుల ఐక్యతకు క్రీస్తు సాన్నిధ్యానికి ప్రతీకగా ఉంది. దేవునికి ఆరాధన, కృతజ్ఞతలు చెల్లించుటకు పాపపరిహారం క్రీస్తు బలిని నెరవేర్చుటకును, దేవునితో సఖ్యపడుటకును, క్రీస్తు శరీరరక్తాల స్వీకరణ ద్వారా దేవుని రక్షణమును పొందుటకు ఈ బలిపీఠం అనువుగా ఉంది. జ్ఞానస్నానం పొందిన ప్రతి వ్యక్తి కూడా పవిత్రాత్మను తనలో నింపుకొని, క్రీస్తు జీవితానికి సాక్షులుగా ఈ లోకములో జీవిస్తూ ఒక్కొక్కరు జీవించుచున్న ఓ బలిపీఠముగా మారాలని ఈ బలిపీఠం మనకు ప్రబోధం చేస్తుంది.

❋ ❋ ❋ ❋

# 3. "దైవ వాక్యార్చన పీఠము" (Ambo) : అర్ధము, సంక్లుప్త చరిత్ర, దైవార్చనలో వాక్యార్చన పీఠపాత్ర, ప్రాధాన్యత మరియు తీసుకోవలసిన జాగ్రత్తలు

- బ్రదర్ బిరుదుగడ్డ రవికుమార్



## 1. ఉపోద్ఘాతము

"దేవుడు మానవజాతిని సృజించెను. తనను పోలినట్లు మానవుని సృజించెను" (ఆది 1:27) అని పవిత్ర గ్రంథము మనకు బోధిస్తుంది. ఈ విధముగా సృష్టింపబడిన మానవులు ఈ లోకములో తనను తెలుసుకొని, ప్రేమించి, సేవించి తన మార్గములో జీవించి మరణానంతరం తనతో శాశ్వితముగా పరలోకములో జీవించాలని దేవుడు కోరుతున్నాడు (CCC.7). తనలో ఉన్న ఈ కోరికను పవిత్ర గ్రంథము (Holy Bible) ద్వారా తెలియజేశారు. "కారణమేమనగా పవిత్ర గ్రంథమంతయు దైవప్రేరణ వలనే కలిగి సత్యమును బోధించుటకును, దోషములను ఖండించుటకును, తప్పులను సరిదిద్దుటకును, నీతియందు నడిపించుటకును ఉపయోగపడును" (2 తిమోతి 3:16). కథోలిక దైవార్చనలో పవిత్ర గ్రంథ పఠనము (Bible Reading), పవిత్ర గ్రంథ ప్రభోదనము (Proclamation of the Word) మరియు దాని ధ్యానము (Meditation over the Readings) అనునవి ప్రముఖమైన అంశాలు. వీటిని నిర్వహించుటకు పవిత్ర గర్భగుడి (Holy Sanctuary)లో ఒక ప్రత్యేకమైన స్థలము దానిపై పీఠము కేటాయించబడ్డాయి. దానినే "దైవవాక్యార్చన పీఠము"

(Ambo) అని పిలుస్తారు. దైవార్చనలో కృతజ్ఞతార్చన (Liturgy of the Eucharist)కు ఉపయోగించే బలిపీఠము (Altar) ఎంత ప్రాధాన్యతను సంతరించుకొని ఉందో అంతే ప్రాధాన్యతను ఈ వాక్యార్చన పీఠము (Ambo) కూడా కలిగి ఉంది. దైవార్చనలోని వాక్యార్చన (Liturgy of the Word)కు ఈ పీఠమును మాత్రమే ఉపయోగించవలెను (GIRM 309).

## 2. అర్థవివరణ

"దైవవాక్యార్చన పీఠము" అను ఈ తెలుగు పదము "యాంబో" (Ambo) అను ఆంగ్లపదము నుండి వచ్చింది. "యాంబో" (Ambo) అను ఆంగ్ల పదము "యామ్‌బెవ్" (AmBwv) అనే గ్రీకు భాషాపదము నుండి పుట్టింది. యామ్‌బెవ్ అను ఈ గ్రీకు పదం "బీమా" (Bimah) అనే హీబ్రూ భాషా పదము నుండి ఉద్భవించింది. బీమా అనగా "ఎత్తైన ప్రదేశము" (Elevated place) అని అర్థము. యూదుల ప్రార్థనా మందిరములలో దైవగ్రంథమును పఠనము చేసి ప్రజలకు వినిపించుటకు దీనిని వాడేవారు. ఇది చెక్కతోగాని, రాతితోగాని నిర్మించబడి ఒక ఎత్తైన ప్రదేశములో ప్రతిష్ఠించి ఉంచబడుట చేత దానిని "బీమ" (ఎత్తైన ప్రదేశము) అని పిలిచేవారు. ప్రస్తుతం దీనికి "వేదిక" (Pulpit), "వాలుబల్ల" (Lectern) అని, మరియు "డెస్క్" (Desk) అని సర్వనామాలు ఉన్నాయి.

## 3. సంక్షిప్త చరిత్ర

క్రీస్తుపూర్వం దాదాపు 5వ శతాబ్ధములో ఎజ్రా ఒక "కొయ్య వేదిక" పైకి ఎక్కి మోషే ద్వారా దేవుడు ప్రసాదించిన ధర్మశాస్త్రమును ఇస్రాయేలు ప్రజలకు చదివి వినిపించెను అని మనము పవిత్ర గ్రంథములో చూస్తూ ఉన్నాము". "ఆ సమావేశమునకుగాను ప్రత్యేకముగా నిర్మించిన కొయ్య వేదికపైకెక్కి ఎజ్రా ధర్మశాస్త్రమును చదివెను" (నెహెమ్యా 8:4). నూతన నిబంధనలో యేసుప్రభువు ప్రజలకు బోధించుటకై ఒక ఎత్తైన ప్రదేశమును ఎన్నుకొనినట్లు చూస్తాము. "యేసు ఆ జనసమూహములను చూచి పర్వతమును ఎక్కి కూర్చుండెను. శిష్యులు ఆయన చుట్టూ చేరిరి. యేసు ఈ రీతిగా ఉపదేశింప నారంభించెను" (మత్తయి 5:1-2). అటు తరువాత యేసు ప్రార్థనా మందిరము (Synagogue)నకు వెళ్లినప్పుడు లేచి నిలువబడి (అనగా అందరకు కనిపించే ప్రదేశము లేదా కేటాయించబడిన

ఎత్తైన ప్రదేశము) యెషయా గ్రంథము నుండి పవిత్ర వాక్కులను చదివినట్లు లూకా సువార్త 4:16,17 లలో చూస్తున్నాము. దీనిని బట్టి ప్రజలకు దేవుని సందేశాన్ని చదివి వినిపించడానికి యూదులు ప్రత్యేకించబడిన ఒక ఎత్తైన ప్రదేశాన్ని వాడినట్లు తెలుస్తుంది.

అయితే క్రీస్తు మరణానంతరం అనగా దాదాపు 300 సం॥ల వరకు ఈ వాక్యార్చన పీఠం క్రైస్తవ వాడుకలో లేదు. క్రీ.శ.313 సం॥లో రోమీయ చక్రవర్తి కాన్‌స్టెన్‌టీన్ క్రైస్తవులకు స్వాతంత్ర్యము ఇచ్చి, క్రైస్తవ ఆరాధనలకు అతిపెద్ద గుడులను (Basilicas) ఏర్పాటు చేశాడో ఆనాటి నుండి క్రైస్తవులు ఈ వాక్యార్చన పీఠమును గూర్చి ఆలోచించడం మొదలిడినారు. తిరుసభ చరిత్ర ఆధారముగా పరిశీలిస్తే క్రీ.శ. 6వ శతాబ్ధం నుండి ఖచ్చితముగా ఇవి వాడుకలో ఉన్నట్లు మరియు వాటిని చెక్కతో చేసి వాడినట్లు తెలుస్తుంది. అప్పట్లో ఈ పీఠమును మూడు అంతస్తులుగా నిర్మించేవారు. మొదటి అంతస్తును పాత నిబంధన పఠనాలను చదువుటకును, రెండవ అంతస్తును వేదసాక్షుల యొక్క మరణముల గురించి, పాపుగారి లేఖలను చదువుటకు, పునీతుల పండుగల గురించి, నూతన నిబంధనలోని లేఖలను మరియు సువార్తా పఠనాన్ని చదువుటకు ఉపయోగించేవారు. ఈ పనిని సాధారణముగా డీకను (Deacon) చేసేవారు. చివరి అంతస్తును వాక్యవివరణ (ప్రసంగము) గావించుటకు గురువు (Priest) లేదా మేత్రాణులు (Bishops) వాడినట్లు తెలుస్తుంది. క్రీస్తుశకం 11,12,13,14 శతాబ్దాలలో ఈ వాక్యార్చనా పీఠాలు రష్యా, గ్రీకు ఆర్థోడాక్స్ మరియు రోమన్ కతోలిక విశ్వాసుల వారి ప్రాంతీయ సాంప్రదాయాలను బట్టి వివిధ రూపాలుగా నిర్మించడం జరిగింది. కొన్నిచోట్ల చెక్కతోను, మరికొన్ని చోట్ల రాతితోను, ఇంకా కొన్ని ప్రాంతాలలో విలువైన లోహాల పూతతోను మరియు వివిధ రకాల విలువైన ఆభరణాల అలంకరణతోను నిర్మించడం జరిగింది. కాలక్రమేణ మూడు నుండి రెండు అంతస్థుల వాక్యార్చన పీఠాలను నిర్మించడం ప్రారంభమైంది. ఒకటి గాయక బృందానికి మరొకటి దైవ వాక్ పఠనాలను చదవడానికి, సువార్త పఠనాన్ని చదివి ప్రసంగించడానికి వాడేవారు. రోము నగరంలోని సెయింట్ క్లెమెంట్ దేవాలయము లోను మిలాను నగరంలోని పునీత ఆంబ్రోసియన్ దేవాలయములోను, వెన్నీస్‌లోని పునీత మార్కు గారి దేవాలయంలోను ఇలాంటి వాక్యార్చన పీఠాలను చూడవచ్చు. అత్యంత ప్రసిద్ధిచెందిన వాక్యార్చన పీఠమును కాన్‌స్టాంటీన్ నోపుల్ వద్ద ఉన్న

పునీత సోఫియా దేవాలయములో జస్టీనియన్ చక్రవర్తి నిర్మించాడు. ఇది విలువైన లోహముతో నిర్మితమై, వెండి పూతతో పూయబడి సువార్తకు సంబంధించిన 4 గుర్తులతో అలంకరింపబడి ఉంది. క్రీ.శ.1604 సం॥లో తిరుసభ ప్రామాణిక చట్టం (Canon Law) లోని 83వ చట్టం (Canon 83) లోను అటుతరువాత 1962లో జరిగిన ద్వితీయ వాటికన్ మహాసభ అధికార పత్రమైన "పవిత్ర దైవార్చనా రాజ్యాంగం" (Constitution on Sacred Liturgy)నకు అనుబంధముగా ప్రచురితమైన "దివ్యపూజా గ్రంథం యొక్క సాధారణ నియమావళి, సూచనల గ్రంథం" (GIRM 309) నందును మరియు "క్రొత్త వాక్యార్చన పీఠమును ప్రతిష్టించు విధానము" (Order for the blessing of a New Ambo) నెంబర్లు 900–918 నందును దీని నిర్మాణమునకు, ప్రతిష్టించుట కొరకును మరియు ఆశీర్వదించుట కొరకు తీసుకోవాల్సిన లేదా పాటించవలసిన జాగ్రత్తలను ప్రచురించడం జరిగింది.

## 4. దైవార్చనలో వాక్యార్చనపీఠ పాత్ర, ప్రాధాన్యత మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

దివ్యబలి పూజలో, దైవ వాక్యార్చన, కృతజ్ఞతార్చన (Liturgy of the Word and Liturgy of the Eucharist) అను రెండు భాగాలు ఉన్నాయి. సంపూర్ణ దివ్యపూజాబలి సమర్పణకు ఈ రెండూను సమానముగా అవసరమై ఉన్నాయి. నిజానికి ఈ రెండూ ఒకదానితో ఒకటి సమ్మేళనమై ఒకే దివ్యబలి పూజను రూపొందించును. మొదటి భాగమైన దైవవాక్యర్చనను "వాక్యార్చనా పీఠము" (Ambo) నుండి, రెండవ భాగమైన కృతజ్ఞతార్చనను "బలిపీఠము" (Altar) నుండే నెరవేర్చవలయును. పూజాబలిలోని మిగతా విషయాలైన ప్రారంభ సాంగ్యాలు (Introductory Rites) మరియు ముగింపు సాంగ్యాలు (Concluding Rites) ను "అధ్యక్ష కుర్చీ" (Presidential Chair) నుండే నెరవేర్చవలసి ఉంది. దివ్యబలిపూజలో క్రీస్తు "వాక్కు" రూపములోను, తన శరీర రక్తాలైన "దివ్యసత్ప్రసాద" రూపములోను విశ్వాసులకు తనను తాను సమర్పించుకొని, వారి ఆత్మశరీరములకు ఔషదముగాను, ఆహారముగా మరియు రక్షణగాను ఉపయోగపడుతున్నారు (GIRM 28).

"దివ్యపూజాబలి గ్రంథ సాధారణ సూచనల నియమావళి" (GIRM) మరియు "క్రొత్త వాక్యార్చనా పీఠ ప్రతిష్ట ఆశీర్వాద విధానము" (Order for the blessing of a new Ambo) ప్రకారము వాక్యార్చనాపీఠమును పవిత్ర గర్భగుడి (Holy Sanctuary)లో బలిపీఠము (Altar) నకు కుడి భాగములో నిర్మించాలి. దీనిని చెక్కతోగాని, రాతితోగాని మరే ఇతర లోహముతోనైననూ నిర్మించవచ్చు. దీనిని తరచుగా కదల్చుటకు వీలులేకుండా (Non movable lectern) ఒకే చోట శాశ్వితంగా (Permanent) నిర్మించాలి. దీనిపై పవిత్రగ్రంథము యొక్క రూపము (Symbol of the Holy Bible) గాని, నాలుగు సువార్తలకు చెందిన నాలుగు గుర్తులనుగాని అలంకరణగా అమర్చవచ్చు. కాని బలిపీఠానికి (Altar) చెందిన "పానపాత్రను" (Chalice), రొట్టె (Bread), ద్రాక్షారస (Wine Grapes) గుర్తులను గాని ఉంచరాదు. దీనిని వినియోగించువారు (Ministers) సమావేశమైన విశ్వాసులందరికి సక్రమముగా కనిపించునట్లు సరైన మరియు సరిపడు (Not too high not too low) ఎత్తులో నిర్మించాలి. దీనిని క్రొత్తగా నిర్మించినపుడు ప్రతిష్టా ఆశీర్వాదము (Order of blessing) నకు మేత్రాణులను ఆహ్వానించాలి. సాధారణముగా మేత్రాణులచేతనే దివ్యపూజాబలిలో ఈ క్రమమును నిర్వహించాలి.

దీనిని కేవలం పూజలోని మొదటి పఠనం, ప్రత్యుత్తర గీతం, రెండవ పఠనము, సువిశేష పఠనము, ప్రసంగము (Homily), విశ్వాస సంగ్రహము (Creed), విశ్వాసుల ప్రార్థనలు (Prayer of the faithful) మరియు పునరుత్థాన పండుగ నాటి గీతము (Exsultet)నకు మాత్రమే వాడాలి. అలాగే పూజబలికి మాత్రమే కాకుండా మిగతా దివ్యసంస్కారాల నిర్వహణలో దివ్యగ్రంథ పఠనాల కొరకు, ప్రసంగం కొరకు, విశ్వాసుల ప్రార్థనల కొరకు ఈ పీఠాన్ని వినియోగించవచ్చు. వాక్యార్చన పీఠమును దివ్యబలిపూజను సమర్పించుటకు వచ్చిన అభిషిక్తులను (మేత్రాణులు, గురువులు మరి ఇతర వ్యక్తులు) ఆహ్వానించడానికి (To welcome) ఆహ్వాన పలుకుల (Welcoming words) కోసం గాని, లేదా పూజలో గురువులు గాక వేరే వ్యక్తులు పూజకు ఉపోద్ఘాతము (Introduction)ను ఇవ్వడానికిగాని, పశ్చాత్తాప సాంగ్యక్రమము (Penitential Rite)ను నిర్వహించుటకుగాని, సత్ప్రసాద స్వీకరణానంతరం ప్రజలకు కొన్ని

విషయాల సమాచారము (Announcements)లను తెలియజేయుటకుగాని, పూజను సమర్పించిన అభిషిక్తులకు వందన సమర్పణ (Vote of thanks) చేయడానికి గాని, లేదా వారిని సన్మానించుక్రమము (Felicitation) కొరకు గాని వాడకూడదు. ఇప్పుడు చెప్పబడిన వాటికన్నింటికి వేరే పరికరము (A movable, temporary announcement stand)ను ఏర్పాటు చేసుకొని వాడుకోవాలి. వాక్యార్చన పీఠము యొక్క ముఖ్య ఉద్దేశము దివ్యగ్రంథ పఠనము (Holy Scriptural Readings)ల కొరకు, ప్రసంగం (Homily) కొరకు మరియు ప్రార్థన (Prayer of the faithful) నిర్వహణ కొరకు. ఇది పాత నిబంధనలో ప్రవక్తలు ప్రబోధించిన ప్రవచనాలను, నూతన నిబంధన క్రీస్తు శిష్యులు బోధించిన విషయాలను తెలుపుటకు, నాలుగు సువార్త గ్రంథ పఠనాల ప్రబోధము ద్వారా యేసుక్రీస్తు బహిరంగ సువార్తా జీవితాన్ని (Public life of Christ) ప్రకటించుటకు తోడ్పడుతుంది.

## 5. ముగింపు

గతమున దేవుడు పెక్కుమార్లు పెక్కు విధములుగా మన పూర్వీకులతో తన ప్రవక్తల ద్వారా మాట్లాడెను. కాలము పరిపూర్ణమైనపుడు తన కుమారుని ద్వారా మాట్లాడాడు అని హెబ్రీయులకు వ్రాసిన లేఖ 1:1లో మనము చదువుచున్నాము. అనగా దేవుడు మనతో మాట్లాడాలని ఇష్టపడుతున్నాడు. తన చిత్తాన్ని తెలపాలని పవిత్ర గ్రంథాన్ని (Holy Bible) అనుగ్రహించాడు. దేవుని వాక్కులను ఆలకించుటకు విశ్వాసులు కూడా ఎంతో ఆశతో ఉన్నారు. భక్తిశ్రద్ధలతో దేవాలయానికి, దివ్యబలిపూజకు, ప్రార్థనలకు హాజరవుతున్నారు. దైవజ్ఞానాన్ని, పాప మన్నింపును సత్ప్రవర్తనా గుణములను, నీతిమార్గాన్ని చూపించే ఆ దేవుని వాక్యాన్ని సక్రమంగా ప్రజలకు అందించడం శ్రీసభ బాధ్యత. అందుకే ఎత్తైన ఒక ప్రత్యేకస్థానం అందు వాక్యార్చన పీఠ స్థాపన, అభిషేక ఆశీర్వాదం, దానిని ఉపయోగించుటలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. దేవుని వాక్కును ఆ పీఠముపై నుండే బోధించాలి. ఆ విధమైన మర్యాదలను వాక్యార్చన పీఠముపై చూపిస్తూ వాక్ అయ్యి ఉన్న యేసుక్రీస్తు ప్రభువును ప్రజలందరికి చాటిచెప్పాలి.

❀ ❀ ❀ ❀

# 4. దివ్యపూజా పఠనముల గ్రంథము (Lectionary) : అర్ధము, చరిత్ర, అమర్చబడిన క్రమము మరియు ప్రాముఖ్యత

- బ్రదర్ చొప్పర కిషోర్ బాబు

## 1. ఉపోద్ఘాతము



"ఆదిలో వాక్కు ఉండెను. ఆ వాక్కు దేవుని యొద్ద ఉండెను. ఆ వాక్కు దేవుడై ఉండెను" (యోహాను 1:1). "ఆ వాక్కు మానవుడై మన మధ్య నివసించెను" (యోహాను 1:14). ఆయనే యేసుక్రీస్తు ప్రభువు. "యేసు (తన జీవితములో) చేసిన కార్యములు ఎన్నియో కలవు అని, వానిలో ప్రతీ దానిని వివరించి వ్రాసినచో అట్టి గ్రంథములకు ఈ ప్రపంచమే చాలదని పునీత యోహానుగారు (21:25)లో చెపుతూ వానిలో కొన్ని మాత్రమే అనగా యేసు దేవుని కుమారుడని, ఆయన లోకరక్షకుడైన క్రీస్తు అని, ఆయన ద్వారానే మనకు నిత్యజీవము లభిస్తుంది అన్న దైవజ్ఞానాన్ని (యోహాను 20:30-31) తెలుపుతున్నారు. అటువంటి పవిత్ర గ్రంథము (Holy Bible) గూర్చి తెలియని వానికి క్రీస్తుని గూర్చి కూడ తెలియదు (The ignorance of the Scripture is the ignorance of Christ) అని పునీత జెరోము గారు చెప్పియున్నారు. కాబట్టి ఆత్మల రక్షణ కార్యములో పవిత్రగ్రంథ పఠనము, ధ్యానము బోధన మరియు ఆచరణ అనునవి తప్పనిసరి. "నేను వచ్చువరకు ఈ పవిత్ర గ్రంథమును పఠించి, ఆలకించి, గ్రంథ విషయాలను పాటించువారు ధన్యులు" (దర్శన 1:3).

కథోలిక శ్రీసభ, క్రీస్తుప్రభువు స్థాపించిన "దైవార్చన" (Liturgy) ద్వారా మానవుల రక్షణ కార్యాన్ని ఈ లోకంలో కొనసాగిస్తుంది (SC.2) . అటువంటి

ఆ దైవార్చనకు దివ్యపూజాబలి (Holy Mass) ఆరంభముగాను – అంతిమ గమ్యము (Source and Summit) గానూ ఉన్నది. దివ్యపూజలో ప్రధాన రెండు భాగాలలో ఒకటి అయిన "దైవ వాక్యార్చన" (Liturgy of the Word) ను అర్థవంతముగా నిర్వహించుటకు ఉపయోగిచబడే గ్రంథమే ఈ "దివ్యపూజా పఠనముల గ్రంథము (Lectionary). రక్షణ చరిత్ర (Salvation History) ను దానిని సంపూర్ణముగా నెరవేర్చిన యేసుక్రీస్తు జీవితము (Life of Christ) ను దానిని అపోస్తులులు పవిత్రాత్మ దేవుని శక్తి వలన మొదట్లో ఎలా కొనసాగించారో (Apostolic writings and Letters) వాటన్నింటినీ కూడా "దైవార్చనా సంవత్సరం (Liturgical Year) ప్రకారము అమర్చి మనకు సంపూర్ణ పవిత్రగ్రంథాన్ని (Holy Bible) అందించేదే ఈ "దివ్యపూజా పఠనముల గ్రంథము".

## 2. అర్ధము

"పూజా పఠనముల గ్రంథము" అను ఈ తెలుగు పదము "లెక్షనరీ" (Lectionary) అను ఆంగ్లపదము నుండి వచ్చింది. "లెక్షనరీ" అను ఆంగ్లపదము "లెక్షనారియుమ్" (Lectionarium) అను లాటిను బాషాపదము నుండి పుట్టింది. "లెక్షనారియుమ్" అనగా "పాటముల సమూహము" (Collections of Lessons) అని అర్ధము. "పవిత్ర బైబిల్ గ్రంథములో ఉన్న పుస్తకాలను పాఠాలుగా అమర్చి, దైవార్చనా సంవత్సరము (Liturgical year)నకు అనుకూలముగా ఒక క్రమపద్ధతిలో, దైవ వాక్యార్చనలో వినియోగించుటకు ఏర్పాటు చేయబడిన గ్రంథమే పూజాపఠనముల గ్రంథము". ఈ పఠనాలను (Lessions) దివ్యపూజలోనే ఉపయోగించాలి. కనుకనే దీనిని "పూజాపఠనముల గ్రంథము" అని పిలుస్తారు.

ఎందుకు పవిత్ర గ్రంథము (Holy Bible) లోని పుస్తకాలను పాఠాలు (Lessons) గా విభజించి దానిని గ్రంథముగా రూపొందించారు? అనే సందేహానికి సమాధానము ఏమిటంటే "పవిత్ర గ్రంథమంతయు దైవ ప్రేరణ (Divine Inspiration) చేత వ్రాయబడిన రక్షణ చరిత్ర (Salvation History) అయినప్పటికీ దాని పరిపూర్ణత (Fulfilment) క్రీస్తు జీవితం ద్వారానే మనకు అర్ధమవుతుంది. అనగా పవిత్ర గ్రంథములోని 73 పుస్తకాలు కూడా యేసుక్రీస్తు కొరకు వ్రాయబడి, యేసుక్రీస్తు జీవితము ద్వారానే వాటి ఉనికిని, రచనా ఉద్దేశ్యాన్ని సంపూర్తిగా

కనుగొంటాయి. అంటే బైబిల్ పఠనము చేయువారు యేసుక్రీస్తు జీవితపు వెలుగు (Under the light of Christ's life) లోనే చదవాల్సి ఉంది. యేసుక్రీస్తు జీవితం మనకు సంపూర్ణముగా తెలియజేసేదే "దైవార్చనా సంవత్సరము" (Liturgical Year). కాబట్టి తల్లియైన శ్రీసభ బైబిల్‌నందు ఉన్న పుస్తకాలను పాఠాలుగా విభజించి, వాటిని "క్రీస్తు జీవిత ప్రకటన" (Proclamation of Christ's life) గా విశ్వాసులకు సంవత్సరం పొడవునా లభించే విధంగా రూపొందించిన గ్రంథమే ఈ పూజాపఠనముల గ్రంథం.

ఉద్దేశమేమిటంటే, విశ్వాసులు "రక్షణ చరిత్ర"ను సరైన రీతిలో సంవత్సరం పొడవునా ధ్యానించాలని, దానిని క్రీస్తు జీవితం ద్వారానే తెలుసుకోవాలని ఆ విధంగా తెలుసుకున్నప్పుడు దైవజ్ఞానం (Divine Knowledge) పెరిగి, విశ్వాసం దృఢపడి (Faith is strengthened), ప్రజలు ఆధ్యాత్మికంగా పురోగతిని (Spiritual progress)ని, ఆత్మల రక్షణ (Salvation of Souls) ను వాక్ అయిన క్రీస్తు ద్వారా అనుదిన దివ్యబలిపూజలో పొందాలన్నది ప్రముఖ ఉద్దేశము. దీనికి చక్కని ఉదాహరణను మనము అపోస్తులుల కార్యములు 8వ అధ్యాయము 26 నుండి 40 వచనాలలో చదువుతున్నాము. నపుంసకుడు, ఇతియోపియా రాణి కాందసి యొక్క ఉద్యోగి (కోశాధికారి)కి మరియు ఫిలిప్పునకు మధ్య జరిగిన సంభాషణలో ఆ ఇతియోపియా ఉద్యోగి తాను చదువుతున్న యెషయా ప్రవక్త గ్రంథములో ప్రవక్త తనను గూర్చి లేక మరియొకని గూర్చి చెప్పుచున్నాడో తెలియక వేరే ఎవరైన (అనగా తెలిసినవారు) వివరింపని యెడల ఎలా అర్ధము చేసుకోగలను(31)? అడుగుచున్న విధానము, అప్పుడు ఫిలిప్పు వివరించిన విధానము (35), అటుతరువాత ఉద్యోగి జ్ఞానస్నానము పొందిన రీతి (37-38) మనకు కనిపిస్తుంది. దివ్యపూజలో పఠనాలను అమర్చిన రీతి, వాటిని మనకు ప్రతిదినము అందిస్తున్న విధానము పైన చెప్పబడిన సంఘటనను పోలి ఉన్నాయి. ఆ ఉద్దేశాన్ని నెరవేర్చే గ్రంథమే "దివ్యపూజా పఠనముల గ్రంథము".

### 3. చరిత్ర

పూర్వ నిబంధనలో దేవుడు మోషే ద్వారా ధర్మశాస్త్రమును ఇస్రాయేలీయులకు ప్రసాదించాడు (యోహాను 1:17). అటుతరువాత దానిని

ఎలా పాటించాలి, ధర్మశాస్త్రమును అధిగమిస్తే వచ్చే పర్యావసానాలేంటి? దేవుడు తన అభిషిక్తుడు (Messiah) ద్వారా ప్రజలను ఎలా రక్షించబోతున్నాడు అన్న విషయాలను ప్రవక్తల ద్వారా ప్రబోధించాడు. అందుకనే యూదుల విశ్వాసానికి ధర్మశాస్త్రము (The Law) మరియు ప్రవక్తల ప్రభోదము (The Prophets) అనునవి రెండు కళ్లుగా చెప్పుకోవచ్చు. క్రీస్తు వచ్చునాటికే ఈ రెండూ కూడా తాళ్లపత్రాల రూపములోను, జంతుచర్మాల మీద వ్రాయబడిన అక్షర రూపములో అందుబాటులో ఉన్నాయని, వీటిని ప్రార్థనా మందిరములలోను, దేవాలయములోను, ప్రజలు బహిరంగముగా సమావేశమైన ముఖ్య సందర్భాలలో చదివి వినిపించేవారని పవిత్రగ్రంథ మరియు చరిత్ర ఆధారాలు స్పష్టముగా చేస్తున్నాయి (నెహెమ్యా 8:4 మరియు లూకా 4:18). క్రీస్తు మరణానంతరం ఆయన శిష్యులు సువార్తీకులు (Evangelists) గాను, చరిత్రకారులు (లూకా అపోస్తులకార్యములు) గాను కతోలిక రచనాకారులుగాను (Catholic writers) మిగతా ముఖ్య రచయిత (పునీత పౌలు)లుగాను నూతన నిబంధన రచించడం జరిగింది. అయితే హీబ్రూ, గ్రీకు భాషలలో ఉన్న పాత మరియు క్రొత్త నిబంధనలోని మొత్తం పుస్తకాలను లాటీను భాషలోకి (Vulgate) పునీత జెరోముగారు క్రీ.శ. 405 సం॥లో పరిపూర్తిగా తర్జుమా (Translation) చేశారు. అప్పటి వరకూ క్రైస్తవులు తాము సమావేశమైన ప్రార్థనా మరియు దైవార్చన సందర్భాలలో పవిత్ర గ్రంథాన్ని "వరుసగా" చదివేవారు. దానిని Lectio Continua అని పిలిచేవారు. అయితే ఆ "వరుస చదువుడు" మూడు విభాగాలుగా ఉండేవి. మొదటిది ధర్మశాస్త్ర పఠనము (Reading from Torah) , రెండవది ప్రవక్తల గ్రంథము (Reading from Nabi) లేదా కీర్తనల గ్రంథము (Psalms) మూడవదిగా సువార్తా గ్రంథము (Evangelical Books). అపోస్తుల రచనలు అందుబాటులోకి వచ్చిన తరువాత వాటి స్థానములో అపోస్తులులో బోధనా రచనలు చదవడం ప్రారంభించారు. (Ref. Justin the Martyr's Apology AD.166). నిజానికి తొలినాటి క్రైస్తవులు యూదా సాంప్రదాయములో ఉన్న (ఉదా: ప్రార్థనా సమయాలలో, విశ్రాంతి దినము (Sabbato) లందు మరియు ముఖ్య పండుగలైన పాస్కా, పెంతెకోస్తు, గుడారాల పండుగ (Ref. Talmud, Magilah 32a) దైవగ్రంథ పఠనాలను, ధర్మశాస్త్రం, ప్రవక్తల గ్రంథములు (Torah, Nabi) ఇంకా చరిత్ర గ్రంథాలు (Eg. Judges, Kings etc.) నుండి దేవుని వాక్కులను చదవడం

మొ॥). ఆచారాలనే అవలంభించారని చెప్పవచ్చు. యూదులకు "ఒక సంవత్సరపు పఠనాల గ్రంధం" (The One year Jewish Lectionary) మరియు "మూడు సంవత్సరాల పఠనాల గ్రంథము" (The Three year Jewish Lectionary) అను రెండు దివ్యగ్రంథ పఠనాలు ఉండేవి. వీటి విధానాన్నే తర్వాత కాలంలో క్రైస్తవులు స్వీకరించడం జరిగింది.

క్రీ.శ. 422వ సంవత్సరంలో "మార్సెలియస్" (Marseilles)కు మేత్రాణులుగా ఉన్న "వెనెరియుస్" (Venerius) అనే పీఠాధిపతి ఆజ్ఞ మేరకు తొలి క్రైస్తవ "పూజాపఠనముల గ్రంధం" తయారు చేయబడినట్లు చరిత్రలో చూస్తున్నాము (Ref. the earliest documentary by Gannadius of Massilia) . కాని "యురిక్ పాలజో" (Palazz Eric) అనే చరిత్రకారుడు మాత్రం తాను వ్రాసిన పుస్తకం "(A History of Liturgical Books from the beginning to the 13th century p.91.1998)" లో క్రీ.శ. 3వ శతాబ్దంలోనే పూజాగ్రంథ పఠనాలు చదువుటకు "పఠనాకారులు" (Readers) ఉండేవారని చెప్తున్నారు. దీనిని బట్టి దివ్యబలిపూజకు బైబిల్ గ్రంథ పఠనాలను ఒక పద్ధతిలో, పాఠాలుగా సందర్భమునకనుసరించి (ఉదా: ఆదివారము పూజ, పునీతుల పూజ, దేవమాత పూజ, మృతుల పూజ, వేదసాక్షుల పూజ, పండుగల పూజ మొ॥) చదివేవారని తెలుస్తుంది. కాని "వెనెరియుస్" పీఠాధిపతుల (Who died in 452 AD) కృషి వలనే తొలి సంపూర్ణ పూజాపఠనముల గ్రంథము యొక్క కూర్పు జరిగినది అని చెప్పవచ్చు. అయితే, అన్ని పీఠాలలో ఈ గ్రంథమనే వాడారనడానికి వీలులేదు. వారి ప్రాంతం, భాష, సాంప్రదాయాలను బట్టి చాలా రకాల పూజాపఠనముల గ్రంథాలు తయారు చేయబడ్డాయి. వీటిని "తూర్పు ప్రాంత పూజాపఠనములు" (Eastern Lectionaries) మరియు "పశ్చిమ ప్రాంత పూజాపఠనములు" (Western Lectionaries) గాను విభజింపవచ్చు.

క్రీ.శ. 1549 సం॥లో పూజాపఠనముల గ్రంథము గురించి న్యాయచట్టం ఏర్పాటు చేయబడింది. 1867లో ఒక కమిటీ ఏర్పాటు జరిగి "ఉల్‌ఫోర్స్" నేతృత్వంలో సమావేశాలు జరిగి, 1872 జనవరి 1వ తారీకున ఒక క్రొత్త పూజాపఠనాల గ్రంథాన్ని ఆవిష్కరించడం జరిగింది. శ్రీసభలోని ముఖ్యముగా పశ్చిమ ప్రాంత పీఠాలు" (Western Churches) ఈ పూజాపఠన గ్రంథాన్నే

వాడేవారు. దీనిని (Lectionary of Wesley) అని పిలిచేవారు. దీని ప్రకారం బైబిల్ గ్రంథాన్ని వివిధ పఠనాలుగా విభజించి వాటికి **ఎ,బి,సి** గా నామకరణం చేసి అవి మూడు సం॥రాలకు సరిపోవు విధముగా అమర్చారు. ఇందులో 34 ఆదివార పూజా పఠనాలు, ప్రత్యేక కాల (ఆగమన, క్రిస్మస్, తపస్సు, మరియు పునరుత్థాన కాలాలు) పఠనాలు, మరియమాత పూజ, పునీతుల, మృతుల దేవాలయ పండుట పూజా పఠనాలుగా రూపొందించడం జరిగింది.

రెండవ వాటికన్ మహాసభ (1962–65) తరువాత శ్రీసభ "ఆర్‌దో" (Ordo) అనగా The order for Liturgical readings ని ప్రచురించడం జరిగింది. దీనిని లతీను భాషలో Ordo Lectionarium Missae అని పలిచేవారు. దీని ప్రకారం మొత్తం పూజాపఠనాల గ్రంథానికి మార్పులు, కూర్పులు చేయడం జరిగింది. దీని ప్రకారం (The official Lectionary of Roman Rite or Roman Mass) "రెండు సంవత్సరాల దైవార్చన పట్టిక" (Two year cycle) "వార పూజాపఠనముల" కొరకు, "మూడు సం॥రాల దైవార్చన పట్టిక" (Three year cycle) "ఆదివార పూజాపఠనములకు" కేటాయించడం జరిగింది. దీనిని ఆంగ్లములో Cycle I, II అని A,B,C cycle అని పిలుస్తారు.

"వార పూజాపఠనముల" (Weekly Readings) కు మూడు పాఠములు కేటాయించడం జరిగింది (Including Psalms as Response). ఆదివార మరియు ఉత్సవాలకు నాలుగు పాఠములు కేటాయించడం జరిగింది (Including Psalms). ఆ విధముగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న "పూజాపఠనముల గ్రంథం" ప్రచురణ చేయబడింది.

## 4. పూజాపఠనముల గ్రంథం అమర్చబడిన క్రమము

ఈ గ్రంథము యొక్క ముఖ్య ఉద్దేశము, దైవార్చనలో పవిత్రగ్రంథ (Holy Bible) పారాయణం, ధ్యానము మరియు దాని వివరణను తెలుసుకొనడం. దీని ద్వారా విశ్వాసులకు పవిత్రగ్రంథము ప్రతిదినము ఒక క్రమములో అందించబడుతుంది. దాని వలన క్రైస్తవులకు దైవవాక్య పరిజ్ఞానముతో పాటు, దేవుని చిత్తము అది యేసుక్రీస్తు ద్వారా నెరవేర్చిన క్రమము, పవిత్రాత్మ ద్వారా శ్రీసభలో కొనసాగిస్తున్న విధానము అర్ధమవుతుంది. ఫలితముగా దేవుని బిడ్డలు

(People of God) రక్షణ చరిత్ర సత్యాలను క్షుణ్ణంగా, ఒక క్రమములో ప్రతిదినము తెలుసుకుంటూ విశ్వాసాన్ని పెంపొందించుకుంటూ, ఆత్మయందు ఎదుగుదలను, రక్షణయందు పరిపూర్ణతను పొందుతారు. దీని నిమిత్తమే మొత్తం పవిత్ర గ్రంథాన్ని పూజాపఠనముల గ్రంథము **సంపుటి 1.** (Volume-I), **సంపుటి 2**. (Volume-II) మరియు **సంపుటి 3** (Volume-III) గా విభజించడం జరిగింది. ఈ విభజన కోలిన్స్, లండన్ వారు ప్రచురించిన రోమను దైవార్చనా క్రమానికి అనుగుణంగా రూపొందించిన "దైవార్చనా గడియలు" (Divine office) నమూనా ప్రకారమే ప్రస్తుత ఈ "దైవార్చన పఠనాల గ్రంథ క్రమము" ఏర్పాటు చేయడం జరిగింది.

"కథోలిక దైవార్చన" (Catholic Liturgy) మొత్తం "దైవార్చనా సంవత్సరము" (Liturgical year) ను అనుసరించి జరుగుతుంది. మరి దైవార్చనా సంవత్సరము ఆగమాన కాలముతో ప్రారంభం అవుతుంది కాబట్టి **సంపుటి 1** లో ఆగమానకాల పఠనాలు, క్రీస్తు జయంతి కాల పఠనాలు, 1 నుండి 9వ సామాన్య కాలపు పఠనాలు, నవంబరు 25 నుండి మార్చి 9వ తేదీలకు మధ్య వచ్చే పునీతుల పఠనాలు, అలాగే - సమిష్టి పూజల పఠనాలు, వివిధ దివ్యసంస్కారాల (Sacraments)కు సంబంధించిన పఠనాలు, వివిధ అవసరాలు/ సందర్భాలలో సమర్పించే దివ్యపూజలకు తగిన పఠనాలు, భక్తియుత పూజలకు (Pious devotions) ఉపయోగించే పఠనాలు, అలాగే భారతదేశం కొరకు సమర్పించే పూజాపఠనాలు, మృతుల కొరకు చేసే పూజా పఠనాలు ఉంటాయి.

**సంపుటి 2** లో తపస్సుకాల పూజా పఠనాలు, పాస్కాకాల పూజా పఠనాలు (అనగా క్రీస్తు పునరుత్థాన మహోత్సవం నుండి పెంతెకోస్తు పండుగ వరకు), ఆ తరువాత ఫిబ్రవరి 10 నుండి జూన్ 10 వరకు వచ్చే పునీతుల పండుగల పూజా పఠనాలు, సమిష్టి పూజల పఠనాలు, వివిధ దివ్యసంస్కారాలకు సంబంధించి జరిపే పూజా పఠనాలు, అదే విధంగా వివిధ అవసరాలు/సందర్భాలలో సమర్పించే పూజల పఠనాలు, భక్తియుత పూజా పఠనాలు, అలాగే భారతదేశం కొరకు వివిధ సందర్భాలలో సమర్పించే పూజాపఠనాలు, మృతుల పూజా పఠనాలు ఉంటాయి.

**సంపుటి 3**లో 6వ సామాన్య ఆదివారం నుండి 34వ సామాన్య ఆదివారం వరకు అర్పించే పూజల పఠనాలు, జూన్ 1వ తేదీ నుండి నవంబరు 25వ తేదీ వరకు వచ్చే పునీతుల పండుగల పూజా పఠనాలు, సమిష్టి పూజల పఠనాలు, వివిధ దివ్యసంస్కారాలను ఆచరింపజేస్తూ సమర్పించే దివ్యపూజల్లో పఠించే పఠనాలు, అదేవిధంగా వివిధ అవసరాలు/సందర్భాలలో సమర్పించే పూజల పఠనాలు, భక్తియుతమైన పూజాపఠనాలు, అలాగే భారతదేశం కొరకు వివిధ సందర్భాలలో సమర్పించే ప్రత్యేక పూజల పఠనాలు, మృతుల కొరకు జరిపే పూజలకు చెందిన పఠనాలు ఉంటాయి.

## 5. ప్రాముఖ్యత

దివ్యబలి పూజలో "దైవవాక్యార్చన" (Liturgy of the Word)అని కృతజ్ఞతార్చన (Liturgy of the Eucharist) అని రెండు భాగాలు ఉన్నాయి. ఈ రెండింటి ద్వారా దైవకుమారుడైన యేసుక్రీస్తు తనలో ఉన్న రెండు స్వభావాలను (మానవ స్వభావము మరియు దైవస్వభావమును) మనకు ప్రసాదిస్తున్నారు. వాక్యార్చన ద్వారా దైవస్వభావాన్ని, కృతజ్ఞతార్చన ద్వారా మానవ స్వభావాన్ని అనుగ్రహిస్తూ మానవులైన మనకు దైవంతో సాన్నిహిత్యాన్ని, సహవాసాన్ని కల్పిస్తున్నారు. ఆ విధంగా రక్షణామృతాన్ని పూజాబలి జరిగినప్పుడెల్లా ఇస్తున్నారు. కనుక ఈ రెండు భాగాలను సక్రమంగా నిర్వహించడానికి రెండు అధికారిక గ్రంథాలు ఉన్నాయి. కృతజ్ఞతార్చనకు "దివ్యబలి పూజాగ్రంథము" ఉన్నట్లు వాక్యార్చనకు "దివ్యపూజాపఠనాల గ్రంథము" ఉన్నది. కనుక దివ్యబలిపూజ జరిగిన ఏ సందర్భములోనైన వాక్యార్చనకు ఉపయోగించవలసిన గ్రంథము "దివ్యపూజ పఠనాల గ్రంథము". అలా కాకుండా పవిత్ర గ్రంథము (Holy Bible) నుండి గాని, ముద్రింపబడిన కాగితప్రతులు (Leaflets) లేదా బైబిల్ డైయిరీ పుస్తకాల (Bible Diaries) నుండి పూజాపఠనాలు చదవడం అనునది దైవార్చనా స్వభావానికి (The nature of the Liturgy) విరుద్ధం. అలాగే వాక్యార్చన పవిత్ర గ్రంథములో ముద్రింపబడిన ప్రత్యుత్తర గీతము (Responsorial Psalm)ను తప్పించి, దాని స్థానములో వేరే భక్తిగీతములను ఆలపించుట దైవార్చనా సూత్రాల (Liturgical Norms) కు వ్యతిరేకం (GIRM 61). అలాగే సువిశేష పఠనానికి ముందు ఉన్న "అల్లెలూయ వచనాన్ని" (Gospel Acclamation) పూజా

పఠనముల గ్రంథములో ఉన్నది ఉన్నట్లు అనుమతి ఇవ్వబడిన దైవార్చనా కాలములలో (Except Lenten season)) తప్పకుండా చదవవలెను (GIRM 62-64). ఇందు నిమిత్తమే ఈ గ్రంథము (Lectionary) ముద్రింపబడింది. ముద్రింపబడిన గ్రంథములోని వరుస క్రమమును తప్పకుండా పాటించుట ద్వారా దైవార్చన (Liturgy) వ్యక్తిగత ఆరాధన కాదని ఇది సామూహిక, సంఘ ఆరాధన (Communitarian) అని, ఇది రహస్య ఆరాధనకాక, బహిరంగ ఆరాధన (Public Worship) అని వ్యక్తపరుస్తున్నాము. అప్పుడే దైవార్చనా ఫలాలను మనము పొందగలుగుతాము.

## 6. ముగింపు

దైవార్చనలో దైవవాక్కునకు ప్రముఖమైన స్థానం ఉంది (GIL 1). దైవార్చనా సంవత్సరములో జరిగే వివిధ మహోత్సవాలు, పండుగలు స్మరణ పూజల ద్వారా, అలాగే దైవార్చనా కాలాలు (Seasons) అయిన ఆగమాన, క్రిస్మస్, తపస్సు మరియు పునరుత్థాన కాలాలలో జరిగే వివిధ పూజలలో పఠించే పఠనాల ద్వారా "రక్షణ చరిత్ర" (Salvation history)ను మాత్రమే "క్రీస్తు జీవిత పరమ రహస్యాన్ని" (The Mystery of Christ)ను కూడా తల్లి తిరుసభ మనకు విశదపరుస్తుంది (GIL 3). యేసుప్రభువు నేర్పిన "ప్రభు ప్రార్ధన"లో "అనుదిన ఆహారం" కొరకు తండ్రిని వేడుకున్నట్లే ఆత్మ పోషణకై "అనుదిన వాక్కును" ప్రసాదించుమని ప్రార్థించాలి. తల్లియైన శ్రీసభ మనకు కావాల్సిన అనుదిన వాక్కును అందించుటకు ప్రచురించిన గ్రంథమే ఈ పూజ పఠనముల గ్రంథం. కాబట్టి దివ్యపూజలో దీనిని తప్పకుండా ఉపయోగించడం మాత్రమే గాక ఈ పఠనాలను సక్రమంగా చదువుటకు కావాల్సిన సేవకులను (Lectors) మంచి తర్ఫీదు ఇచ్చి, అధికారికంగా ప్రతి విచారణలో ఏర్పాటుచేసి (Instituted ministers) ఈ వాక్యార్చన సక్రమంగా సాగేటట్లు చూడాల్సిన బాధ్యత మొదటగా మేత్రాణులకు, ఆ తరువాత గురువులకు ముఖ్యముగా విచారణ గురువులపై ఉంది. ఈ వాక్యార్చణలో చదువబడే మొదటి పఠనం, రెండవ పఠనం, సువిశేషం ద్వారా అటు తరువాత గురువు వాక్‌ను వివరించే "ప్రసంగము" ద్వారా దేవుడు మనతో మాట్లాడుతారు, తన చిత్తాన్ని మనకు తెలుపుతారు. దానిని శ్రద్ధగా, భక్తిగా ఆలకించి ప్రత్యుత్తరగీతము, విశ్వాస సంగ్రహము (Creed) మరియు విశ్వాసుల ప్రార్థన ద్వారా సరైన విధముగా విశ్వాసులు స్పందించాలంటే "పూజా పఠనముల గ్రంథము" తప్పనిసరి.

# 5. దివ్యపూజ గ్రంథము (Missal) : అర్థము, చరిత్ర, అమర్చబడిన విధానము, వినియోగములో తీసుకోవలసిన జాగ్రత్తలు

– బ్రదర్ దారా షడ్రక్

## 1. ఉపోద్ఘాతము



పాస్క భోజన సమయమున మన ప్రభువైన క్రీస్తు తన శరీరరక్తముల బలిని స్థాపించెను. ఆ భోజనమును ఆరగించు నిమిత్తము **'విశాలమైన భోజనశాలను సిద్ధము చేయుమని'** తన శిష్యులకు ఆనతినిచ్చెను (లూకా 22:12). ఈ ఆజ్ఞను అపోస్తులులు ఆచరించారు. అపోస్తులుల వారసత్వముగా కొనసాగుతున్న క్యాథలిక్ సత్యసభ, క్రీస్తు ఆజ్ఞను కొనసాగించుట తన ప్రప్రథమ కర్తవ్యమని భావించింది. అందువలననే "క్రీస్తు రక్షణకార్యపు కొనసాగింపు" అయిన "పవిత్ర దైవార్చనం" అనునది శ్రీసభ యొక్క ప్రాణవాయువు అయ్యింది. ఈ పవిత్రకార్యము సక్రమమైన రీతిలో కొనియాడబడుటకై శ్రీసభ; అర్చనాక్రమము లను, ఆ క్రమములలో ఉన్న వివిధ రకాల ప్రార్థనలను, వాటిని వినియోగించు విధానములను కూడా క్రమబద్ధీకరించింది. శ్రీసభ అర్చనలో అతిప్రముఖమైనది పవిత్ర దివ్యబలిపూజ. ఈ దివ్యబలిపూజ జరుగునపుడెల్లా మన రక్షణకార్యము కొనసాగుతుంది. దాని ద్వారా మనందరకు రక్షణము లభిస్తుంది. అటువంటి జీవనబలిని ఎలా సమర్పించాలో మనకు తెలియజేసే గ్రంథమే దివ్యపూజ గ్రంథము.

ఈ దివ్యపూజ గ్రంథము, శ్రీసభ ప్రార్థనా విధానము, ఆ సభ నిత్యము విశ్వసించు విశ్వాస సూత్రముల ఆధారముగా రూపొందించబడినది. దీనిని

రోమీయ క్రమము అనుసరించి తయారుచేయడం జరిగింది. అనగా దివ్యబలిపూజ రోమీయ క్రమములో సమర్పించినా, గ్రీకు క్రమములో అర్పించినా సమర్పించు విధానములో (తీరు)లోనే బేధము ఉంది తప్ప దేవుని రక్షణ చరిత్రలో, క్రీస్తు సిలువ బలియాగములో, పవిత్రాత్మదేవుని పాత్రలో మరియు ఉపయోగించబడే వస్తువు (Matter), రూపము (Form) మరియు సేవకుని (Minister) మొ॥లగు విషయాలలో భేదము లేదు. అందువలననే దివ్యబలిపూజ రక్షణబలిగాను, కృతజ్ఞతా బలిగాను, క్రీస్తుబలిగాను, పాపపరిహార బలిగాను, సఖ్యతాబలిగాను ఉన్నది.

కనుక రోమీయ క్రమము ననుసరించి తయారుచేయబడిన దివ్యపూజ గ్రంథము గురించి తెలుసుకొను విధానము అనినా; రక్షణ చరిత్ర, క్రీస్తు బలియాగం, శ్రీసభలో దైవార్చన ద్వారా పవిత్రాత్మదేవుడు రక్షణను కొనసాగించు విధానమును తెలుసుకొనుట అనినా ఒక్కటే అని మనం గ్రహించాలి. మనం చదువబోయే ఈ పూజాగ్రంథము కేవలం లాటీను లేదా రోమీయ ఆరాధనా విధానాన్నే తెలుపుచున్నదని ఇక్కడ గుర్తించాలి.

## 2. అర్థము

"దివ్యపూజ గ్రంథము" అను తెలుగు పదము "మిస్సల్" అను ఆంగ్ల పదము నుండి వచ్చింది. "మిస్సల్" అను ఆంగ్లపదము "మిస్సలే" అను లాటీను భాషాపదము నుండి పుట్టింది. మిస్సలే అనగా "దైవార్చనా సంవత్సరంలో జరిగే దివ్యబలిపూజలకు అవసరమైన ప్రార్థనలను, శీర్షిక (Rubrics)లను కలిగి ఉన్న పుస్తకము" అని అర్ధము. దివ్యపూజ గ్రంథము యొక్క విధానము "శ్రీసభ పితృపాదుల పూర్వ నియమముల" (Rubrics from Fathers of the Churches) ను అనుసరించి రూపొందించడం జరిగింది. శ్రీసభ పితృపాదులు కూడా క్రీస్తు ఆజ్ఞానుసారము అపోస్తులులు ఏవిధముగా దైవార్చనను కొనసాగించింది (అపో.కా. 2:42) అన్న విషయాన్నే ఆధారంగా చేసుకొని అర్చనా నియమాలను రూపొందించారు. అనగా భోజనము ఆరగించు నిమిత్తము 'విశాలమైన భోజన శాలను సిద్ధము చేయుడి' (లూకా 22:12). అన్న క్రీస్తు ఆజ్ఞననుసరించి అపోస్తులులు అనుసరించిన విధానమునే శ్రీసభ పితృపాదులు కొనసాగించారని, దాని రూపమే ఈ దివ్యపూజ గ్రంథము అని అర్ధము. కనుక

దివ్యపూజకు మూలం క్రీస్తు అయితే దానిని కొనసాగించుటకు కారణం అపోస్తలులు. మరి ఆ పూజా విధాన నియమాల మార్గదర్శులు మాత్రం శ్రీసభ పితృపాదులు. ఆ విధంగా ఈ పూజ గ్రంధము క్రీస్తుపైన, అపోస్తులపైన వారి తరువాత వచ్చిన శ్రీసభ పితృపాదుల పైన ఆధారపడి రూపొందించబడింది అని అర్ధం.

## 3. చరిత్ర

తిరుసభ మొదటి శతాబ్ధంలో దివ్యపూజ గ్రంధం లేదు. క్రీస్తు మోక్షారోహణం తరువాత శిష్యులు "అపోస్తులుల భోదన యందును, సహవాసమునందును, రొట్టె విరుచుటయందును, మరియు ప్రార్ధనయందును నిమగ్నమైయున్నారు" (అపో.కా. 2:42). అనగా క్రీస్తుయొక్క అపోస్తులు మరియు పునీత పౌలుగారి సమక్షములో కూడా దైవార్చన మరిముఖ్యముగా దివ్యబలిపూజ జరిగిందన్నది వాస్తవం (1 కొరింతీ 11:17-34). అట్లు వారు పూజను నెరవేర్చుకోవడానికి ఎటువంటి గ్రంథమూ లేదు. కడరా రాత్రి భోజన సమయంలో క్రీస్తుప్రభువు పల్కిన పలుకులనే అపోస్తులులు కూడా పలికి అప్పమును క్రీస్తు శరీరముగాను, ద్రాక్షారసమును క్రీస్తురక్తముగా స్వీకరించేవారు. అపోస్తులులకాలం అయిన తరువాత అనగా క్రీ.శ. 2వ శతాబ్ధంలో అపోస్తులుల శిష్యులు పవిత్రగ్రంథ పఠనాలపై ప్రసంగము మరియు స్వంతగా కొన్ని ప్రార్ధనలు (Interssesory Prayers) చేసిన తరువాత క్రీస్తుప్రభువు పల్కులను (Words of Institution) పలికి ఆ తరువాత ప్రభుప్రార్ధన (Lords Prayer) చెప్పి దివ్యసత్ప్రసాదమును స్వీకరించేవారు. అటుతరువాత పెరుగుతున్న క్రైస్తవ విశ్వాసుల కోరిక మేరకు మరియు క్రైస్తవ సంఘాల అవసరాల మేరకు; ఆ సంఘాల కాపరులు అనగా మేత్రాణులు, వేదపండితులు మరియు శ్రీసభ పితృపాదులు పవిత్రగ్రంథాన్ని ఆధారంగా చేసుకొని "సంఘప్రార్ధన", "అర్పణలపై ప్రార్ధన" "స్తుతి ప్రార్ధన" (Preface) మరియు "సత్ప్రసాద స్వీకరణానంతర ప్రార్ధన" మొదలగు ప్రార్ధనలను తయారుచేసి ఉపయోగించడం జరిగింది. అలాగే తూర్పు, పశ్చిమ మఠాలలో (Monastries)లో ఉన్న మఠాధికారులు (Abbots) కూడాను వివిధ సందర్భాలలో (ఉదా: పోపుగారి కొరకు ప్రార్ధన, క్రొత్తగా జ్ఞానస్నానం తీసుకొనేవారి కొరకు ప్రార్ధన, వేదసాక్షుల కొరకు ప్రార్ధన, పాస్కా, పెంతెకోస్తు, దివ్యరూపధారణ ప్రార్ధనలు

మరియమాతకు ప్రార్థనలు, మరణించిన వారి కొరకు ప్రార్థనలు) కావలసిన వివిధ రకాల ప్రార్థనలను వాక్యానుసారం తయారు చేయడం జరిగింది. తరువాత కాలములో అనగా సుమారు క్రీ.శ. 3వ శతాబ్ధం చివరినాటికి ఈ ప్రార్థనలన్నింటిని సేకరించి ఒక కట్టగా ప్రోగుచేసి వాడటం జరిగింది. అట్లు ప్రోగు చేయబడి చిన్న చిన్న పుస్తకాలుగా చేసి దైవార్చనలో వాటిని వాడేవారు. అట్టివాటిని "లిబెల్లి" (Libelli) అని పిలిచేవారు.

క్రీస్తుశకం 4వ శతాబ్దంలో మరియు ఆ తరువాత కాలములో ఈ "లిబెల్లి॥ పుస్తకాలను దైవార్చనలో వివిధ సందర్భాలకు అనుగుణముగా విభజించి "సాక్రమెంటరీస్" (Sacramentaries or Liber Sacramentaries) గా పేరుపెట్టి వాడటం ప్రారంభించారు. ఉదాహరణకు "మొదటి లియో పోపుగారి సాక్రమెంటరీ, "పోప్ లియో ద గ్రేట్"గారి సాక్రమెంటరీ (క్రీ.శ. 492-496) మొదలగునవి. రోము నగరములో ఉన్న పోపుగారు దివ్యబలిపూజను చేయుటకు "ఆర్డెనెస్ రొమాని" (Ordines Romani) అనే పూజా పుస్తకం ఉండేది. తరువాత దివ్యబలిపూజ ఎలా చెయ్యాలి, ప్రార్థనలు చేయునప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి మొ॥ వాటి గురించి నియమాలు, సూచనలు, శీర్షికలు (Rules, Instructions, Rubrics) రచించబడ్డాయి. ఈ విధంగా తయారు చేయబడ్డ వాటిని ఒక విశ్వాసుల సంఘము నుండి మరొక సంఘానికి; ఒక మేత్రాసణం నుండి మరొక మేత్రాసణానికి పంపించడం లేదా ఇచ్చి పుచ్చుకోవడం జరిగేది. అట్లు చేయడం అలాగే వాటిని మొత్తంగా తిరిగి వ్రాయడం అనేది ఆనాడు చాలా ఇబ్బందులతోను, ఖర్చుతోను కూడి ఉండేది.

క్రీ.శ. 12 లేదా 13 శతాబ్ధాలలోనే పూర్తి "దివ్యబలిపూజ గ్రంధము" మఠవాసుల మఠాలలో (Monastries) దొరికినట్లు చరిత్రకారులు చెపుతారు. మొట్టమొదటిగా, సంపూర్ణ దివ్యపూజ గ్రంథము ఎప్పుడు తయారైంది ఖచ్చితంగా చెప్పడం ఖష్టం. క్రీ.శ. 1474వ సం॥లో అనగా జాన్ గుటెన్ బర్గ్ ముద్రణను కనుగొన్న తరువాత (1440), "మిసాలే రొమానుమ్" (Missale Romanum) అనే పేరుతో దివ్యపూజ గ్రంధము ముద్రించబడింది. ఆ తరువాత క్రీ.శ. 1570లో జరిగిన "ట్రెంట్ మహాసభ" ద్వారా పునీత అయిదవ భక్తినాధ పాపుగారు "మిసాలే రొమానుమ్" (Missale Romanum) ను ముద్రింపజేసి లతీను తిరుసభ మొత్తం

కూడా (Faithful who belong to Roman Rite)ఈ పూజాగ్రంథమునే ఖచ్చితంగా వాడాలి అను నిబంధనను జారీ చేశారు. ఈ విధముగా ప్రపంచము నలుమూలలా ఉన్న యావత్తు తిరుసభకు మొదటి దివ్యపూజ గ్రంథము అందుబాటులోకి వచ్చింది.

ఆ తరువాత నుండి మారుతున్న కాలాలు, పరిస్థితులకు అనుగుణముగా ఈ దివ్యపూజ గ్రంథమునకు మార్పులు, చేర్పులు, కూర్పులు జరిగాయి. వీటి ఫలితంగా చాలాసార్లు దివ్యపూజ గ్రంథం మరలా మరలా ప్రచురించడం జరిగింది. ఉదాహరణకు 1604 సం॥లో 8వ క్లెమెంత్ పోపుగారి సవరణ పూజాగ్రంథం 1634లో 8వ అర్బన్ పోపుగారి సవరణ పూజా గ్రంథం, 1884లో 8వ లియో పోపుగారి సవరణ పూజా గ్రంథం, 1920లో 15వ బెనెడిక్ట్ గారి సవరణ పూజా గ్రంథం, 1962లో 23వ జాన్ పోపుగారి సవరణ పూజాగ్రంథం, 1969లో 6వ పాల్ పోపుగారి మరొక సవరణ పూజాగ్రంథం, 2002లో 2వ జాన్‌పాల్ పోపుగారి సవరణ పూజాగ్రంథము మొదలగునవి ప్రచురించబడ్డాయి. ఈ విధముగా దివ్యపూజ గ్రంథము అనేకసార్లు మార్పులకు గురి అయినప్పటికినీ “శ్రీసభ పితృపాదుల” నియమములననుసరించి జగద్గురువు పునీత 5వ భక్తినాధ పోపుగారు ట్రెంట్ మహాసభ ద్వారా క్రీ.శ.1570లో ప్రచురించిన పూజాగ్రంథమే కీలక ఆధారంగా నిలిచిపోయింది.

ఈ విధముగా క్రీస్తు ఆజ్ఞకు విధేయతగా కొనసాగిన అపోస్తుల యొక్క దైవార్చన విధానమును శ్రీసభ పితృపాదులు ముఖ్యముగా పునీత ఇరేనియుస్, పునీత ఆంబ్రోసు, యెరూషలేము నివాసియగు పునీత సిరిలు, పునీత యోహాను క్రిసోస్తము మొదలగు వారి రచనల ఫలితముగా ఏర్పడిన ప్రార్థనలు, పూజా నియమావళి ఏర్పాటు చేయబడి; అటు తరువాత అనేకమంది పునీతులు, మఠాధ్యక్షుల రచనల కృషి ఫలితంగా; ఆ తరువాత వివిధ పోపుగార్ల ప్రత్యేక శ్రద్ధ వలన ప్రస్తుతం ఆచరణలో ఉన్న ఈ దివ్యపూజగ్రంథము మనకందుబాటులో కొచ్చింది. ఇప్పుడు తెలుగులో అనువాదం చేసి మనకు అందుబాటులో ఉంచబడిన పూజాగ్రంథము 1969 సం॥ల ఏప్రిల్ 3వ తేదీన 6వ పౌల్ పోపుగారు ప్రచురించిన “రోమీయ పూజాగ్రంథము” ప్రకారం ప్రచురించబడినది.

## 4. అమర్చబడినక్రమము

దివ్యపూజ గ్రంథము దైవార్చన సంవత్సరము (Liturgical Year) అనుసరించి అమర్చబడినది. దైవార్చనా సంవత్సరము ఆగమానకాలం మొదటి ఆదివారముతో ప్రారంభం అవుతుంది. అలాగే దివ్యపూజగ్రంథము కూడాను ఆగమానకాలము మొదటి ఆదివారముతో ప్రారంభం అవుతుంది. దీని ఉద్దేశమేమిటంటే రక్షణ చరిత్రలో క్రీస్తు జీవితం ముఖ్యమైనదైతే, క్రీస్తు జీవితంలోని శ్రమల, మరణ, పునరుత్థానాలు అతిముఖ్యమైనవి అని ఆ పాస్కా పరమ రహస్యమును కొనియాడుటకే దైవార్చన ఉంది అని దీనిని సంవత్సరము పొడవునా జరుపుకోవాలని అర్థం. అందువలననే దివ్యబలిపూజ జరుపుకొనునపుడు క్రీస్తు పాస్కా పరమరహస్యాన్ని దైవ వాక్యానుసారముగ, శ్రీసభ సాంప్రదాయమునకు, శ్రీసభ పితృమహాశయుల బోధనమునకు విశ్వాసపాత్రులమై జరుపుకోవాలి.

### 4.1. అర్చనకాలము

అర్చన కాలము క్రీస్తు జీవితములోని 3 ముఖ్యమైన ఘట్టాల ఆధారముగా రూపొందించబడింది. 1.జననం, 2.మరణ–పునరుత్థానం, 3.బహిరంగ సువార్తా జీవితం. క్రీస్తు జననం కొరకు ఉద్దేశించబడిన కాలాలు రెండు: 1.ఆగమన కాలము, 2.క్రీస్తు జననకాలము. క్రీస్తు మరణ–పునరుత్థానాల కొరకు ఉద్దేశించబడిన కాలాలు రెండు: 1.తప:కాలము, 2.పాస్కాకాలము. ఇంక చివరి ఘట్టమైన క్రీస్తు బహిరంగ సువార్తా జీవితమును తెలిపే కాలము ఒక్కటే. అది సామాన్యకాలము.

దివ్యపూజ గ్రంథము అర్చన కాలముతో ప్రారంభం అవుతుంది – అంటే అర్చన సంవత్సరములో మొదటిగా వచ్చే ఆగమన కాలము మొదటి ఆదివారముతో ప్రారంభం అవుతుంది. ఇక్కడ గమనించవలసిన విషయమేమిటంటే దివ్యబలిపూజకు అవసరమైన అధ్యక్ష యాజకుని ప్రార్థనలు పైన చెప్పబడిన కాలాలకనుగుణంగా అమర్చబడినవి అని అర్థం. అలాగే ఆ కాలములో వచ్చే భాగాలు (ఉదా: ఆగమనకాలములో రెండు భాగాలు – ఆగమనకాలము మొదటి నుండి నాల్గవ ఆదివారం వరకు ఒక భాగం, అలాగే డిసెంబరు 17వ తారీకు నుండి 24వ తారీకు వరకు ఒక భాగం) వచ్చే అతి ముఖ్యపండుగలు (ఉదా: క్రీస్తు జయంతి కాలములో వచ్చే పండుగలైన డిసెంబర్ 30 “తిరుకుటుంబ

ఉత్సవము, జనవరి 1 – మరియ దివ్యమాతృత్వ మహోత్సవము, జనవరి 6వ తారీకు ప్రభు సాక్షాత్కార మహోత్సవము, జనవరి 6 తరువాత ప్రభు బాప్తిస్మ ఉత్సవము) కూడా వరుస క్రమములో అనగా దైవార్చనా క్యాలెండర్‌కు అనుసరించి అమర్చబడ్డాయి. కనుక అర్చనా సంవత్సరములో యాజకులు పూజచేయునపుడు తికమక పడక అర్చనాకాలాన్ని మదిలో జ్ఞాపకముంచుకుంటే దివ్యపూజ ప్రార్థనలు వెంటనే దొరుకుతాయి.

కనుక దివ్యపూజగ్రంథ మొదటి భాగమలోని అర్చనాకాలము యొక్క క్రమము ఈ క్రింది విధముగా అమర్చబడినది.

- ఆగమనకాలము
- క్రీస్తు జనన కాలము
- తప:కాలము
- పవిత్ర వారము
- పవిత్ర పాస్కా త్రయాహము
- పాస్కాకాలము
- సామాన్య కాలము

## 4.2. దివ్యపూజ విధానము

దివ్యపూజ గ్రంథములో అమర్చబడిన రెండవభాగము "దివ్యపూజ విధానము" అనగా ఇందులో ముందుగా పూజకు అవసరమైన ప్రారంభ సాంగ్యాలు ఉంటాయి. అనంతరం పూజలోని మొదటి భాగమైన వాక్యార్చనకు చెందిన నియమాల సూచనలు అలాగే పూజలోని రెండవ భాగమైన కృతజ్ఞతార్చనకు చెందిన సూచనలు ఉంటాయి. తరువాత స్తుతి గీతాలు (Prefaces) ఉంటాయి. ఈ స్తుతి గీతాలు కూడా అర్చనా కాలమునసరించి ఉంటాయి. ఇక్కడ ఇంకొక్క ముఖ్య విషయమేమిటంటే దివ్యపూజగ్రంధము అర్చనాకాలాన్ని అనుసరిస్తుందంటే క్రీస్తు జీవిత ముఖ్యఘట్టాల తరువాత, క్రీస్తు జీవితానికి చెందిన ముఖ్యమైన వ్యక్తులను కూడా స్మరిస్తూ వారికి కూడాను వారివారి హోదా (ఈ హోదా ఆ వ్యక్తులు క్రీస్తు జీవితంలో నిర్వహించిన పాత్రను బట్టి వస్తుంది)ను బట్టి చేర్చడం జరిగింది. (ఉదా: స్తుతిగీతాలు అర్చనకాలం ప్రకారం అమర్చిన తరువాత

దివ్యసత్ప్రసాదమునకు చెందిన 2 స్తుతి గీతాలు, తరువాత పరిశుద్ధ కన్యమరియ చెందిన 3 స్తుతిగీతాలు; వేదసాక్షుల, సంఘకాపరుల, పవిత్ర కన్యల – మఠవాసుల స్తుతి గీతాలు, సామాన్య స్తుతిగీతాలు చివరిగా మృతుల కొరకు జరిగే పూజలకై 5 స్తుతిగీతాలు వరుసగా ఇవ్వబడ్డాయి). స్తుతిగీతాల తరువాత 4 కృతజ్ఞత ప్రార్ధనలు ఇవ్వడం జరిగింది. తదనానంతరం పూజాంతములో ప్రజలకు ఇచ్చే దీవెనలు, ప్రజలపై ప్రార్ధనలు ఇవ్వడం జరిగింది. అటుతరువాత దివ్యపూజ చేయునపుడు ప్రజలు లేకుండా కేవలం ఒక సహాయకుడు ఉంటే పూజ ఎలా చెయ్యాలో ఇవ్వబడింది. చివరగా ఈ రెండవ భాగములో పూజా విధానమునకు అనుబంధం అను పేరులో వివిధ అవసరాలలో, పరిస్థితులు అవసరాలకు తగినట్లు (ఉదా: సఖ్యత కొరకు, శ్రీసభ సమైఖ్యత కొరకు, మంచి పనుల కొరకు) పూజా విధానమును ఇవ్వడం జరిగింది.

కనుక దివ్యపూజ గ్రంథములో రెండవ భాగమైన "దివ్యపూజ విధానము" ఈ క్రింది విధముగా అమర్చబడినది.

- ప్రారంభ సాంగ్యములు
- స్తుతిగీతాలు
- కృతజ్ఞతా ప్రార్థనలు
- సత్ప్రసాద క్రమము
- ముగింపు క్రమము
- పూజానంతరము దీవెనలు, ప్రజలపై ప్రార్థనలు
- దివ్యపూజ విధానము – ఒక సహాయకుడు మాత్రమే ఉన్నపుడు
- పూజా విధానమునకు అనుబంధం

## 4.3 పునీతుల అనుక్రమము

దివ్యపూజ గ్రంథములోని 3వ భాగము పునీతుల అనుక్రమము. ఈ భాగములో దైవార్చనా సంవత్సరములో వచ్చే పునీతుల పండుగలు వాటికి కేటాయించబడిన తేదీల ప్రకారం (అనగా వారి వారి హోదా, ప్రాముఖ్యతను బట్టి కాకుండా) ఇవ్వడం జరిగింది. ఈ వరుసక్రమము అర్చనా సంవత్సరము ననుసరించి గాక రోమీయ లౌకిక క్యాలెండర్‌ను అనుసరించి అమర్చబడింది.

అంటే జనవరి 2వ తారీకున వచ్చే పునీతులు బాసిలు, గ్రెగోరి నజియాంజు గార్లతో ఈ పునీతుల అనుక్రమ భాగము ప్రారంభమై డిసెంబర్ 31వ తేదీన వచ్చే పునీత 1వ సిల్వెస్టరు (పోపుగారు) గారి స్మరణతో ముగుస్తుంది.

## 4.4 సమిష్టి పూజలు

దివ్యపూజ గ్రంథములో ఇది 4వ భాగము. దైవార్చన సంవత్సరములో ముఖ్యముగా పునీతుల స్మరణ పూజలు నిర్వహించునప్పుడు కొన్నిసార్లు ఒక పునీతుని కంటే ఎక్కువమందిని స్మరించుకోవలసిన సందర్భం వస్తుంది. ఆ సమయాలకు అనుగుణంగా ఇవ్వబడిన పూజలే సమిష్టి పూజలు (Masses of the Common) వీటిని పూజాగ్రంథములోని ఈ 4వ భాగములో ఈ క్రింది విధముగా అమర్చారు.

- దేవాలయ అంకిత సమిష్టి పూజలు
- పరిశుద్ధ కన్యయైన మరియమాత సమిష్టి పూజలు
- వేదసాక్షుల సమిష్టి పూజలు
- సంఘకాపరుల సమిష్టి పూజలు
- శ్రీసభ వేదపండితుల సమిష్టి పూజలు
- కన్యకల సమిష్టి పూజలు
- పునీత స్త్రీ పురుష సమిష్టి పూజలు

## 4.5 దివ్యసంస్కారాల పూజలు

దివ్యపూజ గ్రంథములోని ఈ 5వ భాగము 'దివ్యసంస్కారాల పూజలు' అను నామకరణం చేసినప్పటికీ ఇందు 7 దివ్యసంస్కారాలకు చెందిన పూజలు మాత్రమేగాక దైవాంకిత (Consecratory) జీవితానికి సంబంధించిన పూజలు (ఉదా: మఠాధిపతి దీవెన పూజ, కన్యకల స్థాపనపూజ, దైవాంకిత జీవిత ప్రమాణ పూజ మొ॥) ఇవ్వడం జరిగింది. అలాగే స్థాపిత సేవలు (Instituted ministries) అయిన పాఠకులు (Lectors) మరియు సహాయకుల (Acolytes) పూజలు చివరగా దివ్యసంస్కారాలకు ఉపయోగించే పవిత్ర స్థలాలకు (Sacramentals) చెందిన పూజలు (ఉదా: దేవాలయాంకిత పీఠము ప్రతిష్ట పూజ మొ॥) ఇవ్వడం జరిగింది. వీటి క్రమము ఈ క్రింది విధముగా అమర్చబడింది.

- క్రైస్తవ జీవతారంభపు దివ్యసంస్కార ప్రధానము
- వ్యాధిగ్రస్తుల అభ్యంగ ప్రధానము
- మరణావస్థలో నున్నవారి కొరకు దివ్యసత్ప్రసాదము
- పవిత్ర అభిషేక ప్రధానము
- జ్ఞాన వివాహ నిర్వహణము
- మతాధిపతిని లేదా మతాధికారిని దీవించుట
- కన్యకల ప్రతిష్టాపనము
- దైవాంకిత జీవిత ప్రమాణము
- పాఠకుల, సహాయకుల ఏర్పాటు
- దేవాలయాంకితము, పీఠము ప్రతిష్ట

## 4.6 వివిధ అవసరాలలో, సందర్భములలో పూజలు, ప్రార్ధనలు

ఇది దివ్యపూజ గ్రంథములో ఆరవ భాగం, ఇందులో పవిత్ర శ్రీసభ అవసరాలకు సంబంధించిన పూజలు, జగద్గురువు కొరకు జరిపే పూజలు, పీఠాధిపతులు, సమాఖ్య చర్చలకు సంబంధించిన యాజకులకు చెందిన పూజలు, శ్రీసభ పరిచాకుల కొరకు, యాజక జీవిత పిలుపు కొరకు, గృహస్త క్రైస్తవుల కొరకు, జ్ఞానవివాహ వార్షికోత్సవమునకు, కుటుంబమునకు చెందిన పూజలు, సన్యాసుల కొరకు, దైవాంకిత జీవిత ప్రమాణపు 25 లేక 50వ వార్షికోత్సవములకు చెందిన పూజలు, దైవాంకిత జీవిత పిలుపుకొరకు, సామరస్య సాధన కొరకు జరిపే పూజలు, దేవునితో సఖ్యత కొరకై జరిపే పూజలు, క్రైస్తవుల సమైఖ్యత కొరకు జరిగే పూజలు, సకల జనుల సువార్తీకరణ జరిపే పూజలు, హింసించబడే క్రైస్తవుల కొరకు జరిపే పూజలు, ఆధ్యాత్మిక లేక పారమార్ధిక సమావేశము కొరకు జరుపు పూజ మొ॥ ఉంటాయి. వీటితో పాటుగా సామాజిక అవసరాలు అయిన దేశము కొరకు, రాష్ట్రము కొరకు ప్రభుత్వ ఉద్యోగుల కొరకు, శాసనసభ కొరకు, దేశాధ్యక్షుని కొరకు, నూతన సంవత్సరము ఆరంభ సమయములో పూజ, మానవ శ్రమ పవిత్రీకరణ కొరకు జరిపే పూజలు, పైరువేయు కాలములో, పంటను సేకరించిన అనంతరం జరిపే పూజలు, సకల ప్రజల ప్రగతి కొరకు, శాంతి

న్యాయముల కొరకు పూజలు యుద్ధకాలము లేక సామాజిక సంక్షోభకాలములో జరిపే పూజలు, శరణాగతుల, బహిష్కృతుల కొరకు పూజ, కరువు కాలములో లేక అన్నార్తుల కొరకు పూజలు, భూకంపము సంభవించిన సందర్భములో పూజ, వర్షము కొరకు అలాగే వివిధ సందర్భాలు అయిన పాపక్షమాపణ కొరకు, ఆత్మనిగ్రహము కొరకు, ప్రేమ స్వభావము కొరకు, బంధుమిత్రుల కొరకు, మనలను పీడించే వారి మారుమనస్సు కొరకు, బంధీల కొరకు, ఖైదీల కొరకు, వ్యాధిగ్రస్తుల కొరకు, మరణావస్థలో ఉన్నవారి కొరకు, మంచి మరణము కొరకు, దేవునికి కృతజ్ఞత చెల్లించుట కొరకు జరిపే పూజలు చేర్చబడ్డాయి. వీటన్నింటిని కూడాను ఈ క్రింది విధముగా విభజించారు.

- పవిత్ర శ్రీసభ అవసరాల కొరకు
- సామాజిక అవసరాల కొరకు
- వివిధ సందర్భాలలో చేయదగు పూజలు మొ॥

## 4.7 భక్తియుక్తమైన పూజలు

దివ్యపూజ గ్రంథములో ఇది 7వ భాగము. ఇందు 19 భక్తియుక్తమైన పూజలు అమర్చబడ్డాయి. అవి – పరమపవిత్ర త్రిత్వైక దేవుని కొరకు, దైవకృప కొరకు, యేసుక్రీస్తు శాశ్విత ప్రధానయాజకుడు అనే పూజ, పరిశుద్ధ సిలువ పరమ రహస్య పూజ, పరమ పవిత్ర దివ్యసత్ప్రసాద పూజ, పరమ పవిత్ర యేసునామ పూజ, యేసుక్రీస్తు పరమ రక్తమునకు చెందిన పూజ, యేసు తిరుహృదయ పూజ, పవిత్రాత్మ దేవునికి చెందిన పూజలు, పరిశుద్ధ కన్యమరియ యెడల భక్తిపూజలు, పవిత్ర దూతలకు చెందిన పూజ, స్నాపకుడగు పునీత యోహానుగారి యెడల భక్తి పూజ, పునీత యోసేపు గారి పూజ, సకల పవిత్ర అపోస్తలుల పూజ, అపోస్తులైన పేతురు పౌలుగార్ల యెడల, పునీత పేతురు, పునీత పౌలుగారి యెడల భక్తిపూజలు, ఒక పవిత్ర అపోస్తులయందు అలాగే సకల పునీతుల యెడల భక్తియుక్తముగా పూజ వరుసగా చేర్చబడ్డాయి.

## 4.8 మృతుల కొరకు పూజలు

దివ్యపూజ గ్రంథములో 8వ భాగమైన "మృతుల కొరకు పూజలు" అనే విభాగము 4 రకాలుగా విభజింపబడింది. అవి:

- భూస్థాపన పూజలు
- మరణ వార్షిక పూజలు
- వివిధ సంస్మరణ పూజలు
- మృతుల కొరకు వివిధ పూజలు మొ॥

## 4.9 అనుబంధములు

ఇది పూజగ్రంథములో 9వ భాగము. ఇందు 6 రకాల విభాగములు ఉన్నాయి. అవి

- జలమును ఆశీర్వదించి తీర్థమును ప్రోక్షించు క్రమము
- దివ్యసత్ప్రసాదము పంచుటకు పరిచారకుని ఆశీర్వదించు క్రమము
- పాన పాత్రమును, పళ్లెరమును పూజలో ఆశీర్వదించుట
- విశ్వాసుల విజ్ఞాపన ప్రార్థనకు సూత్రప్రాయమైన ఉదాహరణలు
- బాలలతో నిర్వహించు పూజలు
- భారతదేశమునకు చెందిన ప్రత్యేక పూజలు

## 4.10 విషయసూచికలు

చివరగా దివ్యపూజ గ్రంథములో 10వ భాగము విషయ సూచిక. ఈ భాగాన్ని తిరిగి 3 విధాలుగా విభజించారు.

- అక్షరక్రమ విషయసూచిక
- స్తుతిగీతముల విషయసూచిక
- సాధారణ విషయసూచిక

ఈ విధముగా పవిత్ర పూజబలిని నిర్వహించుటకు ఉపయోగించు దివ్యపూజ గ్రంథమును 10 భాగాలుగా విభజించి, వాటిని దైవార్చన సం॥రం ప్రకారము వరుసగా క్రమపరచి, దివ్యపూజాబలిని సమర్పించుటలో పునీతులకు సరైన స్థానం కల్పించి, అలాగే దివ్యసంస్కారాలకూ మరియు భక్తియుత పూజలకు, మృతుల కొరకు అలాగే వివిధ అవసరాలలో, వివిధ సందర్భాలకు చెందిన పూజలు చక్కగా పొందుపరిచారు.

## 5. వినియోగములో తీసుకోవలసిన లేదా పాటించవలసిన నియమాలు

దివ్యపూజ గ్రంథమును ఉపయోగించునపుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి, శ్రీసభ నియమించిన నియమాలను తప్పకుండా పాటించాలి. ఎందుకంటే దైవార్చన లేదా దివ్యబలి పూజ అనునది వ్యక్తిగతంగా జరుపుకునే ఆరాధన కాదు. శ్రీసభలో జ్ఞానస్నానం పొందిన విశ్వాసులందరూ అభిషేకించబడిన యాజకుని అధ్యక్షతన సమిష్టిగా జరుపుకునే సంఘప్రార్థన. కనుక పూజలో పాల్గొను విశ్వాసులు, వివిధ రకాల బాధ్యతలను (ఉదా: గాయకబృందం, పాటకులు, సహాయకులు మొ॥) అలాగే దివ్యబలి పూజను నిర్వహించు యాజకులు (అధ్యక్ష యాజకుడు మరియు ఇతర యాజకులు) తప్పకుండా నిర్దేశించిన నియమాలను పాటించాలి. అప్పుడే అది ఏక, కతోలిక, అపోస్థలిక తిరుసభ ఆరాధన అవుతుంది.

### 5.1 అర్చన కాలములో జరిగే దివ్యపూజల యెడల తీసుకొనవలసిన జాగ్రత్తలు

క్రీస్తు మనుష్యావతారుడైనది మొదలుకొని పెంతెకోస్తు మహోత్సవము వరకును; అప్పటి నుండి ప్రభుని రెండవ రాకడ నిరీక్షణ (అనగా క్రీస్తు రాజమహోత్సవము) వరకును గల యేసుక్రీస్తు పరమ రహస్యమును శ్రీసభ ఒక సంవత్సర కాలవ్యవధిలో స్మరించుకొని, కొనియాడుతుంది. దీనినే దైవార్చన సంవత్సరము అని అర్చన కాలము అని మనము పిలుచుకుంటున్నాము. దీనిని ప్రత్యేక కాలము అని సాధారణకాలము అని రెండు రకాలుగా విభజించారు. ప్రత్యేక కాలమును ఆగమన కాలము, క్రీస్తు జనన కాలము, తప:కాలము, పాస్కా కాలము అని 4 రకాలుగా విభజించడం జరిగింది. దైవార్చనా సంవత్సరములో ఇవి క్రీస్తుప్రభు యొక్క రక్షణ పరమరహస్యములను విశదీకరించి ఆరాధించు కాలములు. కాబట్టి ఈ కాలాలలో ఇవ్వబడిన అధ్యక్ష ప్రార్థనలు (Presidential Prayers) గాని, స్తుతి ప్రార్థనలు (Prefaces) గాని మార్చడంగాని, వదిలివేయడంగాని, వీటి స్థానములో భక్తియుత పూజలు (Pious Masses) చేయడంగాని జరుగకూడదు. క్రీస్తు రక్షణ పరమరహస్యమునకు స్వభావ సిద్ధముగాను, అనుమతించబడిన విధానమునకు చెందిన పండుగలనే కొనియాడాలి. ఇవి కాకుండా మరే ఇతర పునీత పండుగలైన వాటిని ఐచ్చిక స్మరణలు (Optional Memorials) గానే భావించాలి. అలాగే ఈ ప్రత్యేక కాలములో నిర్ణయించబడిన విధముగ మహిమ గీతమును అల్లెలూయ గీతమును విశ్వాస సంగ్రహమును వినియోగించాలి.

## 5.2 పూజా విధానమును అనుసరించుటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

దివ్యబలిపూజ జరిపే విధానము రోమీయ క్రమము అనుసరించి పూజా గ్రంథములో అమర్చబడి ఉంది. ఈ పూజను ఏ ప్రాంతములో చేసిన, ఏ యే భాషలలో చేసినా ఏర్పాటు చేసిన క్రమమునకుగాని, ఇవ్వబడిన ప్రార్ధనలకు మార్పులు చేయడంగాని, క్రొత్త అంశాలను చేర్చి పూజను కొనసాగించడం చేయకూడదు. దివ్యపూజ గ్రంథములో ఎరుపు రంగులో ఇవ్వబడిన సూచనలను (Rubrics) ఖచ్చితంగా పాటించాలి. కృతజ్ఞతా ప్రార్ధనలు ఉపయోగించునపుడు 1వ కృతజ్ఞతా ప్రార్ధనను అపోస్తులుల పండుగల పూజలకు, సువార్తలలో పేర్కొన్న వ్యక్తుల పేర్ల పండుగలలోనూ అలాగే రోమీయ మొదటి వేదసాక్షుల స్మరణ పూజలకు వాడాలి.

2వ కృతజ్ఞతా ప్రార్ధనను సామాన్య వారదినములలోను, నిర్బంధ (Obligatory) మరియు ఐచ్చిక (Optional) స్మరణ (Memorial) లలోను వినియోగించాలి. 3వ కృతజ్ఞతా ప్రార్ధనను ఆదివార పూజలకును, పండుగ (Feast), మహోత్సవ (Solemnity) పూజలకును, దివ్యసంస్కారాల పూజలకును అలాగే ఇద్దరికంటే ఎక్కువ యాజకులు కలిసి పూజను సమర్పించు సందర్భాలలోను వాడవలెను. చివరగా 4వ కృతజ్ఞత ప్రార్ధనను ఏ పూజకైతే స్తుతి ప్రార్ధన నిర్భంధంగా కేటాయించబడకుండా ఉంటుందో ఆ సందర్భంలో వాడాలి. అనగా 4వ కృతజ్ఞతా ప్రార్ధనను వినియోగించునప్పుడు దానితోపాటుగా ఇవ్వబడిన స్తుతి ప్రార్ధనను (Preface) తప్పకుండా వినియోగించాలి.

## 5.3 పునీతుల అనుక్రమమును వినియోగించుటకు పాటించవలసిన జాగ్రత్తలు

పునీతుల స్థాయిని నిర్భందములేని ఐచ్చిక స్మరణగాను, నిర్బంధ స్మరణగాను, ఉత్సవముగాను, మహోత్సవముగాను నిర్ధారించడం జరిగింది. కనుక దివ్యపూజ గ్రంథములో వారికివ్వబడిన స్థాయిని మార్చకుండా పూజలను, ప్రార్ధనలను యధాతధంగా వినియోగించవలెను.

ప్రతి మహోత్సవమునకును, ఉత్సవమునకు సంబంధించిన పూర్తి ప్రార్ధనలు పూజా గ్రంథములో పొందుపరచబడి ఉన్నాయి. వాటిని ఖచ్చితంగా వినియోగించవలెను. సంస్కరణల విషయములో దివ్యపూజ గ్రంథపు నియమావళి ప్రకారం ఎరుపు రంగులో ఇవ్వబడిన సూచనలను (Rubrics) పాటించాలి.

ప్రభుజీవిత పరమ రహస్యమునుగాని, కన్యమరియమాత జీవిత పరమరహస్యములను వెల్లడించు పూజలను భక్తియుక్తమైన పూజలుగా వినియోగించరాదు. భక్తియుక్తమైన పునీతుల పూజలను చేయునపుడు ప్రార్థనలలో "మహోత్సవము", "ఉత్సవము" మొ॥లగు పదాలకు బదులు "సంస్మరణ" లేక "కొనియాడుట" మొ॥లగు పదములను వాడవలెను.

## 5.4 సమిష్టి పూజల నిర్వహణలో పాటించవలసిన నియమములు

ఒక్కొక్క రకమైన సమిష్టి పూజలో ఎన్నుకొనుటకు వీలుగా అనేక పూజలు ప్రార్థనలు, వచనములు దివ్యపూజ గ్రంథములో ఇవ్వబడినవి. యాజకుడు ఆయా అవసరములకు తగినట్లు ప్రార్థనలు వాడవచ్చును. సంస్మరణ పూజలు చేయునపుడు అర్పణలపై ప్రార్థన, సత్ప్రసాద స్వీకరణానంతర ప్రార్థనలను సమిష్టి పూజల నుండిగాని, ప్రస్తుత దైవార్చన కాలపు వారదినములలోని పూజల నుండి గాని ఎన్నుకొనవచ్చు. వేదసాక్షుల, పునీతుల సమిష్టి పూజలలోని ప్రార్థనలను స్త్రీ పురుష బేధమును బట్టి మార్చుచూ స్త్రీలకు, పురుషులకు వినియోగించాలి. ఒక్కొక్క రకమైన సమిష్టి పూజలలో అవసరమునకు తగినట్లు ఏకవచనమును బహు వచనముగాను, బహు వచనమును ఏక వచనముగాను మార్చి వాడవచ్చు. ఒక ప్రత్యేక కాలమునకు లేక ప్రత్యేక పరిస్థితులకు నియమితమైయున్న పూజలను అందు భిన్నముగా మార్చి ఉపయోగించకూడదు.

## 5.5 దివ్యసంస్కారాల పూజల నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలు

దివ్యసంస్కారముల పూజలు ఆగమనకాలము, తప:కాలము, పాస్కాకాలపు ఆదివారములందును, మహోత్సవములందును, పాస్కా అష్టకము నందును, సకల విశ్వాసుల సంస్మరణ దినమందును, విభూది బుధవారమందును, పవిత్రవారపు దినములందు జరుపుట నిషేధించబడినది.

## 5.6 వివిధ అవసరాలలో, సందర్భాలలో జరిపే పూజలు, చేసే ప్రార్థనల విషయములో తీసుకోవలసిన జాగ్రత్తలు

ఈ భాగము 3 విధాలుగా విభజింపబడి ఉంది. ఇందలి మొదటి రెండు భాగముల పూజలను విశ్వాసులు ఉన్నను లేకపోయినను వాడవచ్చును. మూడవ భాగమును విశ్వాసులు పాల్గొనని పూజలో వాడవచ్చును. అత్యవసర పరిస్థితిలో

అవసరమైన ప్రాంతీయ పీఠాధిపతుల అనుమతితో ఆగమన కాలము, తప:కాలము, పాస్కాకాలపు ఆదివారములు, పాస్క మహోత్సవము తరువాత మొదటి వారపు దినములు, సకల మృతుల సంస్మరణ దినము, విభూది బుధవారము మరియు పవిత్రవారము మొ॥ ఈ దినములను వదిలివేసి మిగిలిన దినములలో ఈ పూజలు జరుపుకోవచ్చును. అలాగే డిసెంబరు 16 వరకు వచ్చు ఆగమన కాలపు వారదినములు, జనవరి 2 వరకు వచ్చు ప్రభుజనకాలము లోని వారపు దినములు మినహాయించి పాస్క కాలపు దినములలో, ఇతర దినములలో ఈ పూజలు జరుపుకోవచ్చు. సామాన్య కాలములో వచ్చు వారపు దినముల పూజయందు కూడా ఈ పూజలు చేయవచ్చు. కొన్ని పూజలలోని ప్రార్థనలో స్త్రీ పురుష బేధమును మార్పు చేసి వినియోగించాలి; అవసరమును బట్టి ఏకవచనమునుగాని, బహువచనమునుగాని మార్చి ఉపయోగించాలి. ఈ పూజలు జరుపుకొనునపుడు దైవారాధన కాలము మరియు ఆ దిన దైవార్చన ప్రాముఖ్యతను బట్టి పూజా వస్త్రము యొక్క రంగు మారుచుండును. కాని పశ్చాత్తాప భావమును వ్యక్తపరచే పూజ అయితే తప్పనిసరిగా ఊదా వర్ణపు వస్త్రమును వాడాలి.

## 5.7 భక్తియుక్తమైన పూజలు చేయునపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు

భక్తియుక్తమైన పూజలను మహోత్సవములు యందుగాని, ఆగమన కాలము, తప:కాలము పాస్కాకాలము యొక్క ఆదివారములు, పాస్క మహోత్సవము తరువాత మొదటి వారపు దినములందుగాని, సకల మృతుల సంస్మరణ రోజు, విభూది బుధవారము, పవిత్రవారము నందుగాని చేయకూడదు. అలాగే నిర్భంద స్మరణల దినములయందుగాని, డిసెంబరు 16 వరకు వచ్చు ఆగమన కాలపు వారపు దినముల యందుగాని, జనవరి 2వ తారీకు వరకు వచ్చు ప్రభు జనన కాలములోని వారపు దినములందుగాని, ఈ పూజలు చేయకూడదు. సామాన్య కాలములోని వారపు దినములందు వచ్చు ఐచ్ఛిక స్మరణ పూజలలో ఇంకా మిగిలిన ఇతర దినములందు ఈ పూజలు చేయవచ్చు. ఈ పూజల ఉద్దేశం కేవలం విశ్వాసుల భక్తిని ప్రోత్సహించి పెంపొందించడమే.

## 5.8 మృతుల కొరకు చేసే పూజల, ప్రార్థనల విషయంలో పాటించవలసిన నియమాలు

– భూస్థాపన పూజలను అప్పు పండుగ దినములందుగాని, పవిత్ర గురువారము పాస్క త్రయాహము నందుగాని, ఆగమాన కాలము, తప:కాల, పాస్కా కాలపు ఆదివారములలో చేయకూడదు.

– సామాన్య కాలములోని ఏ వారపు దినమందైనను, అది నిర్భంద స్మరణ దినము అయినను మృతుల పూజ జరుపుకొనవచ్చును.

– జ్ఞానస్నానము పొందకముందే పసిబిడ్డలు మరణిస్తే, వారి తల్లిదండ్రులకు బిడ్డకు జ్ఞానస్నానం ఇప్పించాలి అన్న ఆశ ఉండి ఉన్నయెడల ఈ పూజను మరణించి వారి కొరకు చేయవచ్చు.

– మరణ వార్షిక పూజను క్రీస్తు జనన అష్టకమందును, సంస్మరణ దినములందును విభూది బుధవారమందుగాని, పవిత్రవారమందుగాని చేయరాదు.

## 6. ముగింపు

శ్రీసభలో దివ్యపూజాబలి అత్యంత ప్రధానమైనది. కనుక దాని నిర్వహణకు ఒక క్రమము ఏర్పాటు చేయబడింది. ఆ క్రమమునకు అవసరమైన ప్రార్థనలు సమకూర్చబడ్డాయి. వీటిని ఎప్పుడు, ఎలా ఉపయోగించాలో నియమాలు (Norms) మరియు సూచనలు (Rubrics) ఇవ్వబడ్డాయి. వీటన్నింటి సమూహామే దివ్యపూజ గ్రంథము. కనుక రక్షణ కార్య కొనసాగింపు, రక్షణ ఫలసిద్ధికి మూలమైన దివ్యపూజను సక్రమమైన రీతిలో నెరవేర్చుటకు ఈ పూజాగ్రంథం ఎంతగానో ఉపయోగపడుతుంది. కాబట్టి కేవలం మేత్రాణులు, గురువులు, మఠవాసులు మాత్రమేగాక ఉపదేశులు, కన్యాస్త్రీలు, గురువిద్యార్థులు, యువతీయువకులు మరియు సామాన్య విశ్వాసులు కూడా ఈ పూజగ్రంథం యెడల సంపూర్ణ అవగాహణను, భక్తిని కలిగి ఉండాలి.

❊ ❊ ❊ ❊

# 6. దివ్యపూజలో చేయవలసినవి - చేయకూడనివి

- బ్రదర్ అల్లం సాగర్, బ్రదర్ షడ్రక్
- బ్రదర్ మానూరి మార్క్

## 1. ఉపోద్ఘాతము

దివ్యపూజాబలి క్రైస్తవ జీవితానికి ఆధారం, మూలము మరియు శ్రీసభ సేవక లక్ష్యం. అయితే ఈ భక్తి కృత్యాలను జరుపుకోనే, సమయాలు, విధానాలు, కాలాలు, అనూకూలంగా ఉండాలి, కనుక క్రైస్తవ విశ్వాసులకు దివ్యపూజా విధనాలను బోధించే భాధ్యతలను ఆయా విచారణ గురువులు, సంఘకాపరులే స్వీకరించాలి మరియు దివ్యపూజ సాంగ్యాలలోని మర్మాలను విడమరచి చెప్పాలి. సమకాలీన పరిస్థితులకు, సమకాలీన అవసరాలకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేసి దైవార్చనను బలోపేతం చేయడానికి, మన భారతదేశ శ్రీసభ మేత్రాణులంతా కలిసి ఫిబ్రవరి 3 నుండి 8 తేది వరకు 2015న సెయింట్ జాన్స్ నేషనల్ అకాడమి ఆఫ్ హెల్త్ సైన్స్ బెంగూళురు లో 27వ సంపూర్ణ సభ ఏర్పాటు చేసి “జీవితంలో దైవార్చన” అను అంశంపై చర్చించిన ఫలితాలే ఈ దివ్యపూజ నియమాలు.

## 1.1 దివ్యబలిపూజ నియమాల ముఖ్య ఉద్దేశం

దివ్యపూజను భక్తిగా మరియు మన భారతీయ సాంప్రదాయానికి తగినట్లుగా భక్తి, విశ్వాసాలతో గౌరవప్రదమైన విధంగా జరుపుకొనుటకు నియమాలు అవసరము. ఈ యొక్క నియమాలు మనలను కష్టపెట్టుటకు కాదు కాని దైవార్చన పట్ల ఆసక్తి పెరిగి విశ్వాసులను మరియు గురువులను దైవభక్తిలో పెంపొందిచుటకు రూపొందించబడ్డాయి. ఈ విధంగా ప్రజలు భక్తిగా ఆధ్యాత్మికతలో ఎదగాలంటే, దివ్యపూజను భక్తిగా, ఆసక్తిగా, ఉత్సాహంగా, సంపూర్ణంగా జరుపుటకు ఈ నియమాలు చాలా దోహదపడతాయి.

## 1.2 దివ్యపూజ నియమాలు అవసరమా ?

దివ్యపూజను సమగ్రంగా, సరియైన విధంగా జరుపుటకు నియమాలు చాలా అవసరము. పునీత రెండవ జాన్ పాల్ పాపుగారు చేసిన మనవి మనము గుర్తు చేసుకోవాలి "నేను దీనిని నా భాధ్యతగ భావించి మనవి చేస్తున్నాను. దివ్యపూజ నియమాలను గొప్ప శ్రద్ధతో భక్తిగా పాటించాలి". సంపూర్ణమైన దివ్యపూజను మంచిగా, శ్రీసభ ఆచారాలనుసారంగా జరుపుటకు ఈ నియమాలు చాలా అవసరము. ఇందు నిమిత్తమే భారత మేత్రాణులంతా చర్చించి, ఆమోదించబడిన నియమాలను "భారత కథోలిక మేత్రాసణ దైవార్చన విభాగం" సమీకరించింది. అట్లు సమీకరించి, ముద్రించబడిన దానిని 2016 సంవత్సరం సెప్టెంబర్ 8వ తేదిన భారత కథోలిక మేత్రాసణాల అధ్యక్షుడైన "ఓస్వాల్డ్ కార్డినల్ గ్రాసియస్" గారు విడుదల చేశారు. ఆ అధికార పత్రము పేరు "దైవార్చన జరుపుకొనుటకు సూచనలు" (Directives for the celebration of the Liturgy). అందు నుండి స్వీకరించి, తర్జుమా చేయబడినవే "దివ్యబలిపూజలో చేయవలసినవి మరియు చేయకూడనివి".

ఈ వ్యాసములో దివ్యబలిపూజను చేసే ప్రధాన యాజకుడు, ఇతర యాజకులు మరియు విశ్వాసులు దివ్యబలిపూజలో ఏమి చేయాలి ఏమి చేయకూడదు అను విషయాలను తెలుసుకోబోతున్నాము.

## 2. దివ్యపూజాబలిలో చేయవలసినవి – చేయకూడనివి

| చేయవలసినవి | చేయకూడనివి |
|---|---|
| 1. ప్రధానయాజకుడు దైవార్చనలో చేసే ప్రతి సాంగ్యములో ఉత్సాహంగా ఉండాలి. ఇతర గురువులకు, సహాయకులకు ఎవరి పని వారికి అప్పగించి కార్యక్రమ మంతా సరియైన విధంగా నడిపించాలి. ఒకే యాజకుడు అధ్యక్ష | 1. యాజకుడు ఉన్నది కేవలం దివ్యపూజ జరుపుటకు మాత్రమే కాదు.<br>ప్రధాన యాజకుడు ఎటువంటి సమయంలోనైన వేరే గురువుకి ప్రధాన ఆసనం ఇవ్వకూడదు (GIRM 108, 250). |

| | |
|---|---|
| స్థానములో ఉండి సముచితమైన ప్రార్థన భాగములను, ఇతర క్రియలను నిర్వహించవలెను (GIRM 108). | |
| 2. అన్ని సాంగ్యాలలో ఒకే ఒక గురువు ప్రధాన యాజకునిగా వ్యవహరించాలి (GIRM 108, 250). | 2. "మమ్ము దీవించండి" అని కాక "మిమ్ము దీవించును గాక" అని ప్రధాన యాజకుడు పలుకవలెను. |
| 3. దివ్యబలిపూజకు ఉపయోగించు పవిత్ర వస్తువులను (ఉదా - పఠనముల గ్రంథము, పూజా పుస్తకము, పూజా వస్త్రములు, పూజా పాత్రలు మొదలయినవి) అన్నిటిని ఒక పట్టికగా తయారుచేసి ఉపదేశి భాధ్యతకి అప్పగించాలి. | 3. దివ్యపూజకి తయారు కాకుండా వెళ్ళకూడదు. |
| 4. పూజావస్త్రాలు గుడి సమగ్రానము లో (sacristy) మాత్రమే సిద్ధము చేయాలి.<br><br>a) యాజకులకు: పెద్ద అంగీ, మెడపట్టి మరియు పూజా వస్త్రం.<br><br>b) డీకనుకి: పెద్ద అంగీ, మెడపట్టి మరియు డీకనుపూజా వస్త్రం. బహుశ చివరిది వదిలేయవచ్చు (GIRM 119). | 4. దేనిని ధరించడం మరచి పోకూడదు. |

| | |
|---|---|
| 5. పూజ వస్త్రం మరియు పొడవాటి అంగీలను శుభ్రంగా ఉంచాలి, మంచిగా పూజావస్త్రాలు ధరించాలి. ప్రధాన గురువు అందమైన పూజా వస్త్రము ధరించాలి కాని అది సాధరణమైన వస్త్రాలవలె ఉండి పవిత్రతను మాత్రమే హెచ్చించు భావన చూపించాలి. | 5. అశుభ్రముగా మరియు అంద విహీరముగా వస్త్రాలు ధరించరాదు. |
| 6. దివ్య పూజ ప్రారంభంముందే పూజగ్రంథంలో మరియు పఠనాల గ్రంథములోని దారాలను గుర్తుగా ఉంచుకోవాలి, ఆ గుర్తులను పూజా గ్రంథానికి, పఠనాల గ్రంథానికి ఒక వైపు పెట్టుకోవాలి, ధారాలను మధ్యలో పెట్టడం వలన గ్రంథాలు చినిగిపోయే అవకాశం వుంది. | 6. ప్రజలు పాటలు పాడుతున్నప్పుడు, లేక గురువు చెప్పిన వాటికి సమాధానం చెప్తున్నప్పుడు పూజగ్రంథ పేజీలు అటు ఇటు త్రిప్పకూడదు. |
| **7. పవిత్ర స్థలమును సిద్ధముచేయు విధానాలు:**<br>ఒక శిలువే పీఠముపై కాని లేక ప్రజలకు కనిపించే విధముగా పీఠమునకు దగ్గరలో ఉంచాలి. ఒక స్థాపించబడిన బలిపీఠము, ఒక దైవవాక్యర్చన పీఠము, ఒక ప్రధాన ఆసనం మరియు ఇతర యాజకులు ఉంటే వారికి ఆసనాలు ఉంచాలి (GIRM 307, 299). | 7. దివ్యబలి పీఠమును, క్రీస్తు స్వరూపమును, పూజా గ్రంథమును, దివ్యసప్రసాద పాత్రను, దివ్యరక్త పాత్రను, కొవ్వొత్తులను, మైకులను అమర్యదగా చూడకూడదు మరియు అనవసరమైన శబ్దములను చేయ కూడదు (GIRM 306).<br>దివ్యపూజ ప్రార్థన సమయంలో పూజ గ్రంథమును పీఠముపై మధ్యలో కాక |

| | |
|---|---|
| దివ్యబలి పూజ జరుపుటకు అవసరమైన దానిని మాత్రమే పీఠముపై ఉంచాలి: పూజ ప్రారంభం నుండి సువార్త పఠనం చదివే వరకు సువార్తగ్రంథం మాత్రమే పీఠముపై ఉంచాలి (GIRM 305, 306).<br><br>కొవ్వొత్తులను దివ్య పీఠము మీద లేక ఒక ప్రక్క పవిత్రస్థలములో అనుగుణంగా అమర్చాలి (GIRM 307). | పవిత్ర రొట్టె రసాలు మాత్రం ప్రజలకు కనిపించేలా మధ్యలో ఉంచాలి. పీఠముపై పూజాగ్రంథం ఎప్పుడు ప్రధాన యాజకునుకి ఎడమవైపున మాత్రమే ఉండాలి.<br><br>తెలియకుండానే ప్రధాన యాజకుని కన్నా ఎక్కువగా చేసి ఇతర యాజకులు ముఖ్యమైన వారిగా ఉండక ప్రజలు ప్రార్థనలో మంచిగా పాల్గొనేటట్లు ప్రయత్నించాలి.<br><br>పూల కుండీలను మరియు వేరే అలంకరణ వస్తువులను దివ్య పీఠముపై ఉంచరాదు(GIRM 305).<br><br>దివ్యపూజబలి ప్రారంభంలోనే పూజ గ్రంథం, పూజగ్రంథం ఉంచుస్టాండు, మైకు పెట్టే స్టాండు పీఠముపై ఉంచరాదు.<br><br>అదేవిధంగా ముగింపు ప్రార్థన క్రమానికి పీఠము ఖాళీగ ఉంచాలి, మైకు స్టాండు మరియు మిగిలినవి అర్పణల సమయంలో సిద్ధము చేయవచ్చు. |

| | |
|---|---|
| 8. ప్రధాన యాజకుని ఆసనం సంఘుకూడికకు ప్రధానమైనదిగా ఉండి ప్రార్థనను ముందుకు నడిపిస్తున్న పాత్రను సూచించేదిగా ఉండ వలయును (GIRM 310). | 8. ప్రధాన యాజకుడి ఆసనాన్ని సాధరణ కార్యక్రమలను జరిపే ఆసనంగా ఏర్పరచకూడదు.<br>దివ్యపూజను పీఠము నుండి ప్రారంభించడం గాని ముగించడం గాని చేయకూడదు, అవి ప్రధాన ఆసనం నుంచే జరిపించాలి. |
| **9. దైవవాక్యర్చన పీఠం:**<br>పూజాపఠనాల గ్రంథము వాక్యర్చన పీఠం పైన ఉంచాలి. దైవవాక్యర్చన పీఠం యొక్క పవిత్రతను తెలుపుటకు గాను దానికి ఇరువైపులా వెలిగించబడిన కొవ్వొత్తిలను ఉంచవచ్చు. | |
| 10. సాధరణ నియమావళి ప్రకారం వాక్య పఠనాలకు దైవవాక్యర్చన పీఠమును మాత్రమే ఉపయోగించాలి (ఉదా: పఠనములు, కీర్తనలు, సువార్తపఠనానికి, ప్రసంగాలు మరియు విశ్వాసుల ప్రార్థనలకి (GIRM 55, 71).<br>సువార్త పఠనాల గ్రంథం మరియు పఠనాల గ్రంథం ఆచారికంగా ముద్రింపబడినవి కనుక పఠనాలు వాటినుండే చదవాలి. దీని వలన | 10. పవిత్ర గ్రంథం నుండి గాని, పుస్తకాల నుండిగాని, డైరీల నుండి గాని, కాగితాల నుండి గాని లేక క్యాతలిక్ పుస్తకాల దుకాణంలో దొరికే వేరే ఎటువంటి వాని నుండి చదవకూడదు.<br>బలిపీఠము లేక ప్రభువు బల్ల నుండి ప్రసంగించ కూడదు.<br>ప్రసంగం కూడ దివ్యపూజలో ఒక భాగం కనుక స్లీవగుర్తుతో గాని ఆమెన్ తో గాని ప్రారంభించడం లేదా ముగించడం చేయకూడదు. |

| | |
|---|---|
| దైవవాక్కుకి సరియైన గౌరవం చేకూర్చిన వారిమౌతాం. | వ్యాఖ్యానం చేయువారిని గాని, గాయకబృంద నాయకుడినిగాని, దైవవాక్యర్చన పీఠమును ఉపయోగించుటకు అనుమతించ కూడదు (GIRM 105). |
| 11. దైవార్చనలో మైక్ ఉన్నట్లయితే నీ స్వరానికి సరిపోయేటట్లు అర్చనకు ముందే సరిచేసుకోవాలి. దైవార్చనా సమయాన్ని ప్రణాళికా ప్రకారం ఏర్పరచుకోవాలి. | 11. మైక్‌ని సరిచేసుకోకుండా దైవార్చానకు వెళ్ళకూడదు. కొన్ని మైకులు వేరు వేరుగా ఉంటాయి. |
| 12. క్రీస్తు యొక్క ఉనికి అక్కడ చేరిన విశ్వాసులలో, దైవవాక్కులో, దివ్య సంస్కారాలలో మరియు నీలో ఉన్నట్లు ప్రజలందరికి అర్థమయ్యేల చేయాలి. | 12. నీవు దివ్యపూజ చేయునప్పుడు హడవుడిగా ప్రవర్తించకు.<br><br>ప్రధాన ఆసనం లేదా పీఠము దగ్గర నుండి, ఉపదేశిని పిలవటం గాని, పూజ సహాయకులను పిలవటం మొదలయినవి చేసి ప్రజలను ప్రక్క త్రోవపడేట్లు చెయ్యకూడదు. |
| 13. ప్రధానయాజకునికి చెందిన ప్రార్థనలను అన్నింటిని గట్టిగ, స్పష్టముగా చెప్పవలెను. (ఉదా: సంఘప్రార్థన, స్తుతిప్రార్థన, కృతజ్ఞతా ప్రార్థన, త్రిత్వేకస్తుతి ప్రార్థన మరియు ముగింపు ప్రార్థన) (GIRM 32).<br><br>ప్రార్థనలంన్నిటిని ప్రార్థించాలి, కనుక ముఖ్యమైన ప్రార్థనలను వీడదీసి స్పష్టముగా, ప్రార్థనపూర్వకముగా చదవడం చాలా అవసరం. | 13. ప్రార్థనలను హడావిడిగా చెప్పరాదు. |

| | |
|---|---|
| **14. మౌనము వహించుట:** నిర్ణయించబడిన సమయాలలో పవిత్రమౌనం వహించుట దివ్యపూజా బలిలో ఒక భాగం.<br>(ఉదా: 'ప్రార్థించుదాం' అని చెప్పిన తరువాత, అదేవిధంగా పఠనాలు చదివిన తరువాత, ప్రసంగం తరువాత, దివ్యసత్ప్రసాదం స్వీకరించిన తరువాత పవిత్ర మౌనాన్ని పాటించాలి (GIRM 45). | 14. హడావుడిగా ఉంటూ పవిత్ర ప్రదేశము యొక్క గౌరవ మర్యాదలను తగ్గించరాదు. |
| **15. పూజా వస్త్రాలు:** యాజకులు పూజావస్త్రాలను వాటిని ధరించే గదిలోనే ధరించాలి, సాధారణంగా ఒక్కరు పూజా చేసుకు నేప్పుడు ఎలా ధరిస్తారో అదేవిధంగా. కొన్నికారణాల వలన (ఉదా: సహాయక గురువులు ఎక్కువగా ఉండి పూజా వస్త్రాలు తక్కువగా ఉంటే) పూజావస్త్రం ధరించడం వదిలేయవచ్చు (GIRM 209; Redemptionis Sacramentum 124). | 15. ఒక్కసారి దివ్యబలిపూజ ప్రారంభం అయిన తరువాత ఇతర ఏ యాజకుడును ఆ పూజలో పాల్గొనుటకు ప్రయత్నింపకూడదు. ఆలస్యంగా వచ్చిన యాజకులను పూజలోనికి అనుమతించకూడదు (GIRM 206).<br><br>మెడపట్టిని మఠసన్యాసుల ధరించు వస్త్రం మీద గాని, సాధారణ అంగీ మీదగాని, మాములు బట్టల మీద గాని, మఠవాసుల వస్త్రాల మీదగాని, వేసుకోవటం వలన దానిని దుర్వినియోగపరచినట్లే (RS126); Liturgicae instaurationes, No 8c: AAS 62 (1970), P.701. |

| | |
|---|---|
| **16. సంజ్ఞలు:** రెండు రకాల నమస్కారములు ఉన్నాయి.<br>1. మెడ మాత్రమే వంచి నమస్కారము చేయడం.<br>2. నడుము వరకు వంగి ప్రణామం చేయటం.<br><br>a) ఎప్పుడయితే త్రిత్వేక దేవుడు, క్రీస్తు, పరిశుద్ధ మరియమ్మ మరియు ఆ రోజు ఏ పునీతుని నామమున పూజా అర్పించబడుతుందో వారి పేర్లు ఉచ్చరించినప్పుడు మెడవంచి నమస్కారం చేయాలి.<br><br>b) నడుము వరకు లేదా శరీరమంతా వంచి వందనం చేస్తే దానిని లోతైన ప్రణామం అంటారు. దీనిని దివ్యపీఠమునకు మరియు కొన్ని ప్రార్థన సమయలలో<br><br>(ఉదా: "సర్వశక్తిగల సర్వేశ్వరా నేను నీ సువిశేషమును......." అను ప్రార్థన సమయమున మరియు "ప్రభువా, దీన భావముతోను, మనఃస్థాపము తోను.....'' అను ప్రార్థనా సమయమున) మరియు విశ్వాస సంగ్రహములోని కొన్ని సమయాలలో (ఉదా: ఇతడు పవిత్రాత్మచే గర్భమై మానవునిగా పుట్టెను) అను వాక్యములు పలుకునప్పుడు, 1వ కృతజ్ఞతా | 16. అనవసరమైన సమయాలలో వంగి నమస్కారం చేయకూడదు.<br><br>దివ్యపూజ జరుగుతున్న సమయంలో మందసానికి, వంగి లేదా మోకరించి ప్రణామము చేయకూడదు (GIRM 274). |

| | |
|---|---|
| ప్రార్థనలో, "సర్వశక్తిగల సర్వేశ్వరా, ఈ కానుకలను నీ పవిత్రదూత....." అను మాటలతో కూడిన ప్రార్థనను చదివినప్పుడు, అదేవిధముగా సువిశేషమును ప్రకటించుటకు ముందు, డీకను ప్రధాన యాజకుని నుండి ఆశీర్వాదమును పొందునప్పుడు ఇలాంటి ప్రణామమే చేస్తారు (GIRM 275).<br><br>వంగి నమస్కారము చేయడం నిజమైన విశ్వాసానికి మరియు గౌరవానికి గుర్తు. | |
| **17. సంగీతం:**<br>a) మైకుల శబ్దం తగ్గించి పాడేవారి స్వరం మాత్రమే ముఖ్యమైనది అన్నట్లుగా పాడాలి. దీని వలన దైవార్చనలో విద్యుత్ పరికరాల ప్రాముఖ్యత తగ్గుతుంది కనుక ప్రభువు ఇచ్చిన స్వరాన్ని ఆయనను స్తుతించుటకు ఉపయోగించ వలయును.<br><br>b) దైవార్చన ప్రారంభంలో సంగీతమును ఆరంభిచేటప్పుడు మృదువైన శబ్దముతో భక్తి పాటలు పాడాలి, దీని వలన ప్రజలు దేవాలయంలో ప్రవేశించినప్పుడు వారు పవిత్ర స్థలంలో ఉన్నట్లు గుర్తిస్తారు. | 17. విద్యుత్ పరికరాలు లేదా సంగీత వాయిధ్యాలు పాడే స్వరములపై ఆధిక్యం చూపకూడదు.<br><br>క్లిష్టమైన లేదా నిష్ఠూరమైన శబ్దాలను ఉపయోగించకూడదు. |

| | |
|---|---|
| 18. ఊరేగింపులకు, స్పష్టమైన, సాంప్రదాయకమైన భక్తి గీతాలను ఎన్నుకోవాలి:<br>అందరు పాడగలిగే పాటలు, సరియగు తాళాలతో మరియు ఆవరోహణలు కలిగి ఉండే వాటిని ఆరాధనలలో మరియు ప్రార్థనలో పాడాలి. | 18. సంఘానికి కష్టమైన పాటలు ఎన్నుకోకూడదు. బహుశ దీని వలన ప్రజలు పూజలో పాల్గొనటం కష్టమవుతుంది.<br>దైవార్చన సంగీతం ఒకవేళ లౌకిక పాటల శబ్దాలను కలిగి ఉంటే దానిని దేవాలయము బయటే వదిలివేయాలి. |
| 19. దివ్యపూజలో గాయకబృందం పాత్ర మరియు వారి స్థానము రెండవ వాటికన్ మహసభ తరువాత మారింది అది ఏమనగ గాయక బృందం ప్రజల మధ్య నుండే పాటలు పాడాలి (GIRM 312, 313). | 19. గాయక బృందాన్ని ప్రత్యేక స్థానములో గాని లేదా ఎత్తైన ప్రదేశాలలో ఉంచకూడదు (GIRM 312). |
| **20. గాయక బృందం పాత్ర:**<br>a) సంఘంచే ఉత్సాహంగా పాటలు పాడించుటకు.<br>b) ఒక దాని తరువాత మరొకని క్రమంగా ప్రజలతో కలిసి పాడించుటకు (ఉదా: పల్లవిని మరియు చరణాలు)<br>c) దివ్యసత్ప్రసాద స్వీకరణ జరుగుతున్న ఈ ఒక్క సమయంలో మాత్రమే ప్రజలకు తెలియని పాటను గాయక బృందం పాడవచ్చు, మిగిలిన అన్ని సాంగ్యలలో ప్రజలకు తెలిసిన పాటలు మాత్రమే పాడాలి. | 20. గాయకబృందం పాడే పాటలు అక్కడ సంఘముగా కూడిన ప్రజల కోసం పాడినట్లు ఉండకూడదు.<br>దైవార్చనలో పాటలు పాడుటకు విద్యుత్ పరికరాలు లేదా చరవాణీలను ఉపయోగించరాదు.<br>దివ్యసత్ప్రసాద స్వీకరణ తరువాత కొంత సమయం పవిత్ర నిషబ్ధాన్ని పాటించవలెను, లేదా ఈ సమయంలో ఒక కీర్తనగాని, స్తుతిగీతంగాని లేక ఎదయిన ఒక భక్తిగీతం పాడవచ్చు (GIRM 88, 164). |

| | |
|---|---|
| **21. దైవార్చననుకొనియాడుట: ప్రారంభ సాంగ్యములు**<br><br>పవిత్ర పూజాబలి స్థలమును చేరిన తరువాత యాజకుడు పీఠమునకు గౌరవ వందనం చేయాలి.<br><br>ప్రవేశ ఊరేగింపు లోతైన వందనం మరియు ముద్దుతో ప్రారంభించాలి (GIRM 49).<br><br>ఒకవేళ ధూపం ఉంటే, యాజకుడు సాంబ్రాణి వేసి నిశ్శబ్దంగా ఆశీర్వదిస్తారు, పీఠమునకు దూపం వేయునప్పుడు యాజకుడు మాత్రమే వెళ్ళాలి. ఒకవేళ డీకను లేదా అర్చనక్రమ దర్శకుడు (MC) అక్కడ ఉంటే వెళ్ళవచ్చు.<br><br>దాని తరువాత ప్రధాన యాజకుడు తన ఆసనము దగ్గరకు వెళ్తాడు. | 21. పీఠమునకు దూరము నుండి వంగివందనం చేయకూడదు ముఖ్యముగా సమిష్టిపూజల సమయంలో.<br><br>దివ్యసత్ప్రసాద మందసం పవిత్ర స్థలములో లేకపోతే దానికి మోకరించి వందనం చేయటం గాని లేదా వంగివందనం చేయటంగాని చేయ కూడదు (GIRM 274).<br><br>ప్రతీ దైవార్చనకి ఒక ధ్యానంశాన్ని తయారు చేసుకోవాలి - ప్రతీ దైవార్చనకి ఒకే ప్రధాన ఆశ ఉంటుంది అదే పాస్కా పరమ రహస్యం.<br><br>పీఠమునకు దూపం వేయునప్పుడు ఇతర గురువులు ప్రధాన యాజకునితో వెళ్ళకూడదు. |
| 22. దైవార్చన ప్రారంభములోనే సిలువగుర్తు వేయాలి, వేసిన ప్రతిసారి భక్తిగా వేయాలి.<br><br>దైవసానిధ్యమును సూచించు వాక్యా ధార శుభవచనములు పలుకవలెను. | 22. శుభవచనములను, లౌకిక పరమైన, (ఉదా. గుడ్ మార్నింగ్, శుభోదయము) విధముగా చెప్పి "ప్రభువు మీతో ఉండునుగాక" అను అసలు దానిని భర్తీచేసి చెప్పకూడదు (GIRM 50). |

| | |
|---|---|
| దీని వలన అక్కడ చేరిన శ్రీసభ యొక్క నిజమైన స్వభావం విధితమగును. | |
| 23. పూజగ్రంథములో ఇచ్చిన విధముగా పశ్చాత్తాప క్రియను వేరు వేరు విధాలుగా నిర్వహించుము, ఇవి క్రీస్తుప్రభుని దయ మరియు రక్షణ మును విశదం చేస్తున్నాయి.<br><br>ఒకవేళ వేరే ఏదయిన అనుమతింప బడిన కార్యక్రమము పూజలో జరుగుతుంటే "పశ్చాత్తాప క్రియ" మరియు "ప్రభువా దయచూపుము" క్రమములను వదిలవేయవచ్చు: ఉదా: తీర్దాలు ఆశీర్వదించు సాంగ్యము, ఆదివారములలోను ముఖ్యముగా పాస్కాకాలములలోని ఆదివారాలలో మన జ్ఞానస్నానమును గుర్తు చేసుకొనుటకు తీర్థ జలమును ఆశీర్వదించి చిలకరించు సాంగ్యము జరుగును (GIRM 50). | 23. ఎక్కువ ప్రార్థనలు చేర్చి నీ సొంత భక్తిని ప్రజలపై రుద్దకూడదు.<br><br>పశ్చాత్తాప సాంగ్యములో పాప మన్నింపు ఇస్తున్నట్లు ప్రజలపై చేతులు చాచకూడదు, ఇది పాప సంకీర్తనం కాదు, దీని ముఖ్య ఉద్దేశం పవిత్ర పరమ రహస్యాన్ని జరుపుకొనుటకై ప్రజలను సిద్ధపరచడమే (GIRM 51, 80).<br><br>శ్రీసభ ఆచారాలకు కేంద్రబిందువుగా ఉండే సంజ్ఞలను అర్చనలో వాడకూడదు.<br><br>బిరుసు లేదా సగం మాత్రమే చేయు సంజ్ఞలు వదిలివేయాలి, అట్లు చేయరాదు.<br><br>(ఉదా: ఒక్క చేతితో ఆశీర్వదించటం లేదా వందనం తెలపటం వంటివి) |

| | |
|---|---|
| 24. పూజాగ్రంథములో ఉన్నట్లుగానే మహిమ గీతం పాడాలి లేదా చెప్పాలి. | 24. మహిమ గీతమునకు బదులుగా వేరే ఏ ఇతర గీతములను గాని వచనాలను వాడకూడదు (GIRM 53). |
| 25. సంఘముతో కలిసి పాటలు పాడాలి, నీవు సాంగ్యములో చేయుచున్న ప్రతి సంజ్ఞ మరియు పలుకుతున్న ప్రతి వాక్యమును భక్తిపూర్వకముగా చేయాలి. | 25. సంఘం భక్తిగీతాలు పాడుతున్నప్పుడు నిశ్శబ్దంగా అక్కడ ఏమి జరుగుతుందో తెలియనట్లు ఉండకూడదు. |
| **26. దైవవాక్యార్చన:** వాక్యపఠనాల గ్రంథం మరిముఖ్యముగా సువార్తా పఠన గ్రంథం పవిత్రమైనవి కనుక గౌరవ మర్యాదలలో ఉపయోగించాలి. పఠనాలు చదివేవారిని ముందే పిలిచి మంచిగా చదవటం నేర్పించాలి.<br><br>ఒకవేళ కుదిరితే మేత్రాసణాలలో మరియు విచారణలలో తర్ఫీదు పొందిన పఠనాలు చదివేవారిని నియమించాలి. | 26. దైవార్చనలో వాక్యర్చనకు 'టాబ్లెట్స్' 'ఐపాడ్స్' ఉపయోగించకూడదు. సాధారణంగా దైవార్చనలో ఉపయోగించు పుస్తకాలు ఆశీర్వదీంపబడి పవిత్ర సాంగ్యముల కొరకు ఉద్ధేశించబడినవి.<br><br>వాటిని పవిత్ర ఉద్దేశం కోసమే ముద్రించారు.<br><br>ఏది ఏమైన టాబ్లెట్లను వేరే అవసరాలకు కూడ ఉపయోగిస్తారు కనుక వాటిని పూజా గ్రంథంగా లేదా పఠనాల గ్రంథముగా ఉపయోగించరాదు. ఎందుకంటే ఇలా వాడిన తరువాత మరల మీరు వాటితో 'వెబ్', |

| | |
|---|---|
| | 'ఇ మెయిల్' మరియు 'సినిమాలు' చూస్తుంటారు కనుక వాటిని ఉపయోగించకూడదు. |
| 27. దైవార్చన నియమావళి ప్రకారం దైవవాక్యర్చనకు వాక్యార్చన పీఠమునే ఉపయోగించాలి (ఉదా: పఠనాలు, భక్తికీర్తనలు, సువార్త పఠనానికి, ప్రసంగాలకు మరియు విశ్వాసుల ప్రార్థనల కోసం) (GIRM 55,71).<br>ఆచారప్రకారం పఠనాలను, పఠనాల గ్రంథము నుంచి మరియు సువార్తను సువార్తా గ్రంథపఠనం నుంచి మాత్రమే చదవాలి - ఏ విచారణ అయిన దేవునికి చేయగలిగిన మంచి ఏమిటంటే ఆయన వాక్యానికి సరియైన గౌరవం చూపించటమే. | 27. పవిత్ర గ్రంథం నుండి గాని, పుస్తకాల నుండిగాని, డైరీల నుండి గాని, కాగితాల నుండి గాని లేక క్యాతలిక్ పుస్తకాల దుకాణంలో దొరికే వేరే ఎటువంటి వాని నుండి పఠనాలు చదవకూడదు.<br>బలిపీఠము లేక ప్రభువు బల్ల నుండి ప్రసంగించకూడదు.<br>ప్రసంగం కూడ దైవార్చనలో భాగం కనుక స్లీవగుర్తుతో లేదా ఆమెన్‌తో గాని ప్రారంభించడం ముగించడం చేయకూడదు. వ్యాఖ్యానం చేయు వారిని గాని, గాయకబృంద నాయకుడినిగాని దైవవాక్యర్చన పీఠమును ఉపయోగించుటకు అనుమతించకూడదు (GIRM 105). |

| | |
|---|---|
| 28. మొదటి పఠనానికి తయారయిన ప్రత్యుత్తరగీతం కీర్తనలలోనిదా లేక దైవార్చనకు సరియైనదా కాదా అని ముందే చూసుకోవాలి.<br><br>భక్తి కీర్తన, వాక్యర్చనలో భాగం, కనుక దీనిని పఠనాల గ్రంథం నుండి తీసుకోవాలి, దానికి బదులుగా వేరే సామాన్య గీతమును ఆలపించ కూడదు, ఒకవేళ తీసుకొని ఉంటే అది పఠనానికి సరిపోయేలా జాగ్రత్త తీసుకోవాలి (GIRM 61). | 28. భక్తికీర్తనకు బదులు వేరే పాటపాడటం గాని వచనాలు చదవటంగాని చేయకూడదు. |
| 29. అల్లేలూయ లేక సువార్త పఠనమునకు ముందు వచనములు పాడకపోతే వదిలేయవచ్చు (GIRM 63).<br><br>అనుక్రమ గీతం, పాస్క ఆదివారం మరియు పెంతెకోస్తు ఆదివారం దీనిని పాడవచ్చు లేదంటే వదిలేయ వచ్చు, దీనిని అల్లెలూయకు ముందు పాడాలి (GIRM 64). | 29. అల్లెలూయను ఒకవేళ పాడకపోయిన చదవకుండ ఉంటే మంచిది ఎందుకంటే అది స్తుతి గీతము కనుక. |

| | |
|---|---|
| **30. సువార్త చదువుటకు:** దైవవాక్యర్చన పీఠం దగ్గర గురువు సువార్త గ్రంథం తెరిచి "ప్రభువు మీతో ఉందురుగాక.." అని పలుకుతాడు లేదా పాటరూపంలో పాడుతాడు, అదే విధంగా డీకను కూడ (GIRM 175).<br>డీకను మేత్రానులకు సహాయం చేస్తున్నప్పుడు, మేత్రానులచే ముద్దుపెట్టించుటకు సువార్త గ్రంథాన్ని తీసుకువెళ్తాడు లేదంటే అతనే ముద్దు పెట్టి క్రమాన్ని నిశ్శబ్దంగా ముగిస్తాడు (GIRM 175). | 30. సువార్తపఠనం చదివే ముందు 'ప్రభువు మీతో........' అన్నప్పుడు గురువు చేతులుపైకి ఎత్తకూడదు.<br>చదవటం ముగిసిన తరువాత 'ఇది క్రీస్తుని సువిశేషము......' అన్నప్పుడు గ్రంథాన్ని పైకి లేపకూడదు. ఎందుకంటే అక్కడ చదవబడింది సువార్త కాని, పుస్తకం కాదు.<br>"ప్రభువు మీతో ఉండును గాక" బదులు 'ప్రభువు నీతో ఉన్నారు' అని చెప్పకూడదు. ఇక్కడ మొదటిది ప్రభువు నిత్యం సంఘములో ఉన్నారు అని సూచిస్తుంది.<br>"ప్రభు నీతో ఉన్నాడు" అనునది గురువుకు కూడ తెలియని నిజం, ఇది ఒక ఆశ అయినప్పటికి చెప్పలేని నిజం. |
| 31. దివ్యపూజకి పీఠాధిపతులు ప్రధాన యాకునిగ ఉంటే ఇతర గురువు ఎవరైతే సువార్త పఠనం చదవబోతున్నారో వారు పీఠాధిపతుల నుండి ఆశీర్వాదం తీసుకోవాలి (GIRM 212). | 31. సువార్తా పఠనం చదివిన గురువు సువార్తగ్రంథాన్ని పీఠాధిపతిచే ముద్దుకొరకు తీసుకురావలసిన అవసరం లేదు. డీకను అలా చేయలా లేదా అనేది క్రింది దానిలో ఉంది (GIRM 212). |

| | |
|---|---|
| 32. ప్రసంగాలు స్పష్టంగా చెప్పాలి, వినే వారికి దైవవాక్యం వారి జీవితాలకు అనుసంధానం చేసుకోనేలా ఉండాలి మరియు విశ్వాసుల జీవితాలను మార్చి ప్రపంచంలో క్రీస్తుకు సాక్షులుగా మారేట్లు నీవు ప్రసంగాన్ని తయారు చేసుకోవాలి. కొన్ని ప్రసంగాలలో కొన్నిసార్లు సూత్రాల వివరణ గురించి కూడ చెప్పవచ్చు (GIRM 65,66).<br><br>LED ప్రొజెక్టర్ ఉపయోగం ఒక అటంకం కాకూడదు. | 32. ప్రసంగం కూడ దైవార్చనలో ఒక భాగం కనుక సిలువ గుర్తుతో ప్రారంభించటం గాని ముగించటం గాని చేయరాదు.<br><br>మేంత్రాణులు ఏదైన ఆధ్యాత్మిక విషయాల గురించి పత్రాలు పంపితే దానిని ప్రసంగంలో చెప్పరాదు దివ్యసత్ప్రసాద ప్రార్ధన ముగిసిన తరువాత ప్రజలకు అర్ధమయిన రీతిలో దానిని తెలియచేయవచ్చు.<br><br>మేత్రాణులు ఏవైన సామాజిక లేక ఆధ్యాత్మిక విషయం చాలా ముఖ్యమైనది అయితే దానిని ప్రసంగంలో చదువుటకు ఆజ్ఞ జారీ చేయవచ్చు.<br><br>క్రైస్తవుల భుస్థాపనం ప్రకారం భూస్థాపనం పూజకి స్తుతులు పాడరాదు. యాజకుడు గాని లేదా ఎవరైన బంధువు గాని లేదా స్నేహితులు గాని ఎవరైన ఒకరు వచ్చి మరణించిన వ్యక్తి గురించి ముగింపు సాగ్యములో కొన్నిమంచి మాటలు చెప్పవచ్చు, అది కూడ చనిపోయిన వ్యక్తి అప్పటికే పరలోకంలో ఉన్నట్లు |

| | |
|---|---|
| | చెప్పరాదు. ఎందుకంటె ఒక్క క్రీసభకు మాత్రమే అట్లు చెప్పు అధికారం ఉంది.<br>మరణించిన వారి కొరకు పూజ ఎందుకు జరుపుకుంటాము అంటే మరణించిన వ్యక్తి మంచి జీవితం జీవించాడని కాదు కాని, తండ్రి దేవుడు క్రీస్తుకి మృత్యువుపై విజయాన్ని చేకూర్చినందుకు తండ్రి దేవునికి స్తుతులు చెల్లించుటకు మరియు దు:ఖములో వున్నవారిని ఓదార్చుటకు, మరియు మరణించిన వ్యక్తి ఆత్మ కొరకు ప్రార్థించుట కొరకు. ఎవరైన బంధువులు మరణించిన వ్యక్తి గూర్చి కొన్ని మంచి మాటలు మాట్లడాలి అనుకుంటే ఇంటి దగ్గర జరిగే ప్రార్థనలో గాని, భూస్థాపన దగ్గరగాని లేదా సమాధుల స్థలములో గాని మట్లాడవచ్చు. |
| 33. నైసీయా విశ్వాస సంగ్రహమును ఆదివారాలలో మరియు కేటాయించ బడిన రోజులలో చెప్పాలి. | 33. అనుమతించబడిన (ప్రమాణాలకు) విశ్వాస సంగ్రహాల లోని వాక్యాలకు బదులుగ మనము వేరే వాక్యాలను ఉపయోగించ కూడదు. |

| | |
|---|---|
| తప:కాలం మరియు పాస్కాకాలము లలో రోమను శ్రీసభ జ్ఞానస్నాన గుర్తు గల అపోస్తులుల విశ్వాస సంగ్రహంను చెప్పవలెను. (పూజా క్రమములో 19వ సూచన) | |
| 34. విశ్వాసుల ప్రార్థన లేదా సాధారణ ప్రార్థనలు దైవవాక్యర్చనలో ఒక భాగం (GIRM 69, 70).<br><br>యాజకుడు ప్రధాన ఆసనం నుండి అందరిని ప్రార్థించుటకు ఆహ్వాని స్తాడు, అప్పుడు ప్రజలంతా నిలబడి ప్రార్థనలకు పాట ద్వారా గాని, ఏదైన వాక్యం చెప్పటం ద్వారా లేక మౌనంగా ఉండి సమాధానం తెలుపుతారు (GIRM 71).<br><br>విన్నపములు దైవవాక్యార్చన పీఠం నుండి లేదా ఏదైన సరైన స్థలం నుండి డీకను గాని, గాయకబృంద నాయకుడు గాని, లేదా ఎవరైన విశ్వాసులు చెప్తారు.<br><br>ఈ విన్నపములు గాయకులు పాడవచ్చు (GIRM 71, 38). | 34. దైవవాక్యర్చనలో భాగమైన విన్నపములను మరియు కృతజ్ఞతార్చన లో భాగమైన అర్పణలతో కలిపి చెప్పకూడదు, ఇవి ఒకే రకంగా కనిపించే సాంగ్యములయిన కాని ఒకటి కాదు (GIRM 138, 139, 177, 178). |

| | |
|---|---|
| **35. కృతజ్ఞతార్చన**<br>ఎప్పుడైతే పీఠముపై దైవసత్ప్రసాదం ఉంచు వస్త్రం (corporal) మరియు గురువు చేతులు తుడుచుకొను వస్త్రం (purificator), పూజగ్రంథం మరియు ద్రాక్షరస పాత్రను ఉంచుతారో అప్పుడే బలిపీఠమును సిద్ధము చేసినట్లు (GIRM73; RS 70).<br><br>పూజా పీఠమును కేవలం దైవ ఆరాధనకు మాత్రమే ఉపయోగించాలి.<br><br>చందాపట్టుట అర్పణక్రమములో భాగమై ఉండాలి. చందాపట్టుటకు ఎక్కువమందిని నియమించాలి (GIRM 73).<br><br>చందాపట్టుట అయిపోయేవరకు గురువు ప్రధాన ఆసనంలో ఓర్పుగ కూర్చోవాలి. ఎందుకంటే ఆ చందాపట్టుట ఈ సాంగ్యములో భాగం. | 35. చందాపట్టుట బలిపీఠము సిద్ధము పూర్తి అగువరకు సాగనివ్వాలి. |

| | |
|---|---|
| 36. దైవప్రసాదం ఉంచు వస్త్రం (corporal) పూర్తిగ తెరచి పీఠము మధ్యలో పరచాలి.<br><br>ప్రతి దివ్యబలిపూజకి సరిపోయినంత అప్పములు మరియు ద్రాక్షరసము సిద్ధము చేసుకోవాలి, వీటిని అర్పణక్రమంలోని ఊరేగింపులో ముందుకు తీసుకురావాలి.<br><br>దివ్యమందసంలోని సత్ప్రసాదం కూడా ప్రజలకు పంచుటకు ఉపయోగించవచ్చు, | 36. పూజలో ప్రతీసారి సత్ప్రసాదం మందసం నుంచి సత్ప్రసాదంను తీసి ఉపయోగించకూడదు. |
| **37. అర్పణల సమర్పణ:**<br>అప్పములు, ద్రాక్షరసము విశ్వాసులచే ఊరేగింపుగా పీఠము వద్దకు తీసికు వచ్చి సమర్పించాలి. ఇవికాక వేరే అర్పణలు డబ్బుతో సహా వేరే వాటిని సరైన స్థలములో లేదా పీఠమునకు ప్రక్కన ఉంచాలి, పీఠమునకు ముందు కాదు.<br><br>అర్పణలు సిద్ధము చేసిన తరువాత చివరిలో గురువు ''సహోదరీ సహోదరులారా నేనును మీరును....” అన్నప్పుడు అందరు నిలబడాలి. అన్ని | 37. దేవునికి అర్పించకూడనటు వంటివి అర్పణలకు తీసుకు రాకూడదు. పరిశుద్ధగ్రంథాన్ని అర్పణకు తీసుకు రాకూడదు, ఏమి అర్పించాలి అనేది ఈ క్రింద వివరంగా ఇవ్వబడింది (GIRM 73; RS 140).<br><br>అర్పణల సమయంలో ద్రాక్షరస పాత్రను ఖాళీగ తీసుకురాకూడదు కాని అప్పం మరియు ద్రాక్షరసము వేరే సరైన పాత్రలలో తీసుకు రావచ్చు |

| | |
|---|---|
| అధ్యక్షప్రార్థనల సమయంలో ప్రజలు నిలబడే ఉండాలి. | అర్పణల సమర్పణ పూజకి ముందు జరపకూడదు.<br>ఐక్యముగా మరియు ఏకత్వముగా ఉన్నదని కూర్చొనే పూజ జరప కూడదు (GIRM 73; RS 140). |
| 38. పీఠము మీద నుండి అప్పమును మరియు ద్రాక్షరస పాత్రను కొంచెం పైకి లేపి అర్పణలను సిద్ధము చేయాలి, వాటిని అలా పైకిలేపక పోతే ఒక సంజ్ఞ దాచిపెట్టినట్లె. స్తుతి ఆరాధన మరియు గొప్ప ఆమెన్ సమయంలో కూడ ఇలాగే చేయాలి (GIRM 141,142).<br>"సర్వమును సృష్టించి పరిపాలిస్తున్న సర్వేశ్వరా" అను ప్రార్థన పాడితే చిన్నగా పాడాలి, పాటపాడక పోతే అందరికి వినిపించేలా చెప్పాలి. | 38. ద్రాక్షరసములో నీటిని కలుపునప్పుడు ఆ నీటిని ఆశీర్వదించ కూడదు (GIRM 142). |
| 39. ఎక్కువ మంది యాజకులు ఉన్నప్పుడు వేరు వేరు ద్రాక్షరస పాత్రలు ఉపయోగించవచ్చు కాని ప్రధానమైనది పెద్దదిగా ఉండాలి మిగిలినవి చిన్నవిగా ఉండవచ్చు, దీని వలన ప్రధానపాత్ర ప్రముఖ్యమైనదిగ, స్తుతులకు అనుగుణంగా ఉంటుంది (RS 105). | 39. ద్రాక్షరసమును పవిత్ర క్రీస్తుని శరీర రక్తలుగా మారిన తరువాత దానిని ఒక పాత్ర నుంచి మరియొక పాత్రలోనికి పోయరాదు, అలా చేయడం పవిత్రపరమ రహస్యమునకే వ్యతిరేకం (RS 105). |

| | |
|---|---|
| 40. దివ్యపూజలో ప్రధాన యాజకుడు కాని ఇతర గురువులు పవిత్ర గర్భాలయంలోనే ఉండాలి లేదా వారికి కేటాయించిన స్థానములో ఉండాలి.<br><br>ఇతర గురువులు అర్పణలపై ప్రార్థన ముగిసిన తరువాత ప్రధాన యాజకునితో పీఠము దగ్గర ఉండాలి. | 40. పీఠముపై జరుగుతున్న పవిత్ర సాంగ్యము ప్రజలకు కనిపించకుండా ఉండేట్లు ఇతర యాజకులు అడ్డుగా నిలబడకూడదు.<br><br>ఒకవేళ ఇతర యాజకులు గాయక బృందములో గాని లేదా ఫొటోగ్రాఫర్ గా ఉంటే పూజాలో పాల్గొనకూడదు. రెండు విధులు ఒకేసారి చేయకూడదు. |
| 41. ఇతర యాజకులు కొన్ని కృతజ్ఞత ప్రార్థనలు ప్రధానయాజకునితో కలిసి చెప్పవచ్చు కాని చిన్నగ చెప్పాలి, దాని వలన ప్రధానయాజకుని మాటలు స్పష్టంగ వినిపిస్తాయి (GIRM 218). | 42. యాజకుడు దివ్యసత్ప్రసాదంగా మారిన అప్పంను వెంటనే విరువకూడదు, ఎందుకంటే పూజ ఒక ఉత్సవం, నాటకం కాదు.<br><br>అప్పం తుంచటం అనేది సత్ప్రసాద క్రమములో భాగం. |
| 42. "విశ్వాస రహస్యము" అని ప్రధాన యాజకుడు చెప్పాలి (GIRM 151). | 42. "అప్పమును దాని తరువాత ద్రాక్షరస పాత్రను పైకి ఎత్తినప్పుడు ఏమి చెప్పకూడదు.<br>(ఉదా: నా ప్రభువా నాదేవా.... మొ॥).<br><br>ఇలా ప్రజలు చెప్పాలనుకుంటే పూజాగ్రంథములో ఉన్న మూడు వచనాలు తప్ప వేరేవి చెప్పకూడదు.<br>(ఉదా: "ఆయన ప్రభువు...). |

| | |
|---|---|
| 43. కృతజ్ఞతార్చనలో ఇతర అర్చకులు చేయు ప్రార్థన సమయంలో స్థానిక మేత్రాణుల పేరు తరువాత Coadjutor బిషప్ మరియు Auxiliary బిషప్ పేర్లు చెప్పవచ్చు (GIRM 149). | 43. కృతజ్ఞత ప్రార్థనలకు వేరే ఎటువంటి పదాలు జతపరచకూడదు, లేదా వేరే అనుమతించబడిన ఎటువంటి ప్రార్థనలకయిన, (ఉదా – పాపు గారి గురించి లేదా మేత్రాణుల గురించి ప్రార్థించినప్పుడు).<br><br>పూజాగ్రంథములో ఉన్నది ఉన్నట్లుగా పాపుగారి కోసం మరియు స్థానిక పీఠధిపతుల కోసం ప్రార్థించాలి. పూజలో వేరే మేత్రాణులు ఉన్నా వారి పేరు చెప్పాల్సిన అవసరం లేదు.<br><br>అగ్రపీఠాధిపతియైన కూడ పీఠాధిపతి అని మాత్రమే ఉపయోగించాలి (GIRM 149). |
| 44. త్రిత్వేక దేవుని స్తుతిప్రార్థన (Doxology) సమయంలో ఒక ద్రాక్షరస పాత్రను మరియు<br><br>పెద్ద అప్పపాత్రను మాత్రమే పైకి ఎత్తాలి ఇక వేరేది ఏదీ కాదు.<br><br>"క్రీస్తు ద్వారా క్రీస్తుతో క్రీస్తునందు" అను త్రిత్వేక ప్రార్థన యాజకులు మాత్రమే చెప్పాలి, సంఘం కాదు. | 44. ఇతర అర్చకులు పూజలో ఉన్నా కూడ త్రిత్వేక స్తుతి ప్రార్థనకి (అప్పరస) శరీర రక్త పాత్రలు వారికి ఇచ్చి పైకి లేపకూడదు (GIRM 180). |

| | |
|---|---|
| **45. దివ్యసత్ప్రసాద సాంగ్యము:** ఈ సాంగ్యము పరలోక ప్రార్థనతో ప్రారంభమయి, దివ్యసత్ప్రసాద స్వీకరణ తరువాత చెప్పు ప్రార్థనతో ముగుస్తుంది.<br>దివ్యసత్ప్రసాద క్రమానికి సిద్ధపడుతూ శాంతి కొరకు ప్రార్థన ఒకరికి ఒకరు సమాధాన సంజ్ఞ చెప్పుకొనక ముందే చెప్పాలి. | 45. వేరే క్రమాలను ఈ సాంగ్యములో చేర్చరాదు, (ఉదా: ప్రకటనలు చదవటం, వేరే భక్తిప్రార్థనలు). పూజలోని వేరే క్రమాలలో ఈ యొక్క సమాధాన సంజ్ఞను వాడుకోవడం చేయకూడదు. సమాధాన క్రమములో "ప్రభుని శాంతి మీతో ఉండునుగాక" అని ప్రజలకు చెప్పు సందర్భములో క్రీస్తు శరీర రక్తాలను తాకి చెప్పకూడదు. |
| 46. ప్రజలు 'సర్వేశ్వరుని గొర్రెపిల్ల' అను ప్రార్థన చెప్పు సమయంలో యాజకుడు పవిత్ర అప్పమును విరిచే క్రమము జరుగుతుంది (GIRM 83, 155). | 46. పవిత్ర అప్పమును "క్రీస్తు దివ్యసత్ప్రసాదమును స్థాపించిన సమయంలో పలికిన మాటలు పలుకు సందర్భములో విరచకూడదు".<br>'సర్వేశ్వరుని గొర్రెపిల్ల లోక పాపములను పరిహరించు ప్రభువా' అను సరియైన వచనాలను వేరే పాటలతో మార్చకూడదు. |
| 47. దివ్యసత్ప్రసాదం పంచుటకు సరిపోయే గురువులు, డీకనులు లేదా అర్చనా సహాయకుడు లేనప్పుడు సత్ప్రసాదం పంచుటకు నియమించిన అసాధారణ సేవకులను పిలువవచ్చు. | 47. ఈ అసాధారణ సేవకులు వారు ధరించిన మఠవాసుల వస్త్రాలతో గాని సాధారణ, మాములు వస్త్రాలతో సత్ప్రసాదం పంచుటకు వెళ్ళకూడదు. వారు మేత్రాణులచే లేదా గురువులచే |

| | |
|---|---|
| వారిని దివ్య పూజా సేవకులని పిలవ కూడదు (GIRM 156,158).<br><br>వీరు యాజకులు సత్ప్రసాదం స్వీకరించిన తరువాత పీఠం దగ్గరకు రావాలి.<br><br>సత్ప్రసాదం పంచిన తరువాత మిగిలినవి వీరు పక్కన ఉన్న పీఠము దగ్గరకు తీసుకు వెళ్తారు లేదా అర్చకులకు ఇచ్చేస్తారు. | సూచించబడిన వస్త్రాలు ధరించాలి.<br><br>ఈ అసాధారణ సేవకులు వారంతట వారు పీఠము నుండి పవిత్ర (అప్పరస) క్రీస్తు శరీర రక్తల పాత్రలు తీసుకోకూడదు. యాజకులే వీరికి ఇవ్వాలి. అసాధారణ సేవకులు వారి స్థానంలో తమ విధులకు వేరే వారిని నియమించరాదు. వీరు దివ్యపూజలో తప్ప వేరే ఇతర అర్చనా కార్యక్రమము లో సేవ చేయరాదు (GIRM 155). |
| 48. అర్చకులందరూ ఎప్పుడు ఆనాటి పూజలో పవిత్రపరచిన అప్పమునే స్వీకరించాలి, దివ్యసత్ప్రసాద మందసము నుండి కాదు.<br><br>దివ్యసత్ప్రసాదం పంచిన తరువాత కొద్దిక్షణాలు మౌనముగ ప్రార్థన చేసుకొను సమయం ఉండాలి. | 48. దివ్యసత్ప్రసాద స్వీకరణ తరువాత చేయు ప్రార్థనకి ముందు ఎటువంటి ప్రకటనలు గాని లేదా ప్రార్థనలు గాని ఉండకూడదు), ఇవి దివ్యసత్ప్రసాద సాంగ్యమును భంగం చేస్తాయి. దివ్యసత్ప్రసాద స్వీకరణ తరువాత కృతజ్ఞతస్తుతి ప్రార్థనలను చెప్పకూడదు ఎందుకంటే అవి ఆచారికంగా ఆ సాంగ్యములో లేవు కనుక. |

| | |
|---|---|
| **49. ముగింపు సాంగ్యము:** (GIRM 90, 167, 251)<br>a) సంక్లుప్త ప్రకటనలు<br>b) యాజకుడు చివరి శుభవచనములు మరియు ఆశీర్వాదములు ఇస్తారు.<br>c) "సమాధానముగా వెళ్ళి క్రీస్తు ప్రేమలో జీవించండి" అను వచనములు యాజకుడు లేదా డీకను చెప్పవచ్చు.<br>d) యాజకుడు మరియు డీకను పీఠమును ముద్దు పెట్టుకొని లోతైన వందనం తెలుపుతారు. | 49. ఇతర యాజకులు పీఠమునకు ముద్దు పెట్టవలసిన అవసరంలేదు వారు గౌరవ వందనం మాత్రము చేస్తే చాలు (GIRM 251). |
| **50. విద్యుత్ పరికరాలు:**<br>దైవార్చనలో పాటలు నిజంగా మనుషుల స్వరముతోనే పాడాలి. దీని కోసం విద్యుత్ పరికరాలను ఉపయోగించుకోవచ్చు. | 50. దైవార్చనకు సంగీతంను చరవాణీల ద్వారా, సీడిల ద్వారా మరియు పెన్ డ్రైవ్ ద్వారా ఇవ్వకూడదు. ఇది దైవార్చన సంగీతం ఎలా ఉండాలి అన్నదానికి వ్యతిరేకం. పవిత్రదైవార్చన నియమావళి ప్రకారం పూజకి పాటలు సాంగ్యములో పాల్గొనినవారు స్వంతస్వరాలతో పాడాలి. |

| | |
|---|---|
| **51. ఆదివారం:**<br>ఆదివారానికి ఉన్న ప్రత్యేకత వలన ప్రభుని పండగలు మరియు మహోత్సవాలు జరుపుకొనుటకు మాత్రమే అవకాశం ఇస్తుంది.<br><br>ప్రభుని పండగలు లేదా మహోత్సవాలు, ఆగమనకాల, తపఃకాలం మరియు పాస్కాకాలలో ఆదివారాలలో వస్తే వాటిని మరుసటి సోమవారం జరుపుకోవాలి. ఎందుకంటే అవి ఈ పండుగల కన్నా ముఖ్యమైనవి (GIRM 5). | 51. గురుపట్టాభిషేకానికి, గురుపట్టాభిషేక రోజులకు మరియు పెళ్ళి రోజుల కోసం ఆదివార దివ్యపూజను మార్చకూడదు. ఆదివార పూజ యధావిదిగా జరగాలి.<br><br>వివాహపూజ సంవత్సరంలో ఏ రోజయిన పెట్టుకోవచ్చు, ఏదిఏమైన పశ్చాత్తాప కాలములైన, ఆగమన కాలములో, తపఃకాలములో పెట్టుకోక పోవడం మంచిదని శ్రీసభ పెళ్ళి జంటకు బోధిస్తుంది ఒకవేళ పెట్టుకుంటే మాములుగా ఎటువంటి హంగామ లేకుండా ఆగమన కాల ఆదివారాలలో పెట్టుకోవచ్చు.<br><br>తపఃకాలం మరియు పాస్కాకాలలో, ఆదివార దైవార్చనకి వివాహ సాంగ్యములు జతపరచినవి ఉపయోగించవచ్చు. వేరే ఏ ఆదివారాలలోనైన విచారణలలో వివాహ పూజ జరిగినప్పుడు ఈవిధంగా చేస్తారు. వివాహసాంగ్య పూజలకి తెల్లని పూజావస్త్రం ధరించాలి.<br><br>పాస్కాత్రయాగం, క్రిస్మస్, క్రీస్తు సాక్షత్కారం, మోక్షరోహణ ఆదివారం, |

| | |
|---|---|
| | పెంతెకోస్తు, క్రీస్తు శరీర రక్తాల పండుగ ఇలాంటి మహోత్సవాలలో ఏదిఏమైన వివాహ పూజ జరపవలసిన అనవసరం లేదు (GIRM 332, 333).<br><br>పవిత్రముగ ఉంచవలసిన రోజులలో ముఖ్యముగా పవిత్ర గురువారం, పాస్కాత్రయాగం, ఆగమన కాలములోని ఆదివారాలు, తపఃకాలము మరియు పాస్కా కాలములలోని ఆదివారాలలో మృతుల కొరకు దివ్యపూజ చేయరాదు (GIRM 380). |
| **52. నాట్యం:**<br>సంస్కృతి మరియు పవిత్ర స్వభావంగల నాట్యాలను మాత్రమే అనుమతించాలి.<br>1. ప్రవేశ క్రమములో<br>2. అర్పణక్రమములో<br>కాని అది ప్రవేశసాంగ్యములో యాజకులకు స్వాగతం పలుకుతున్నట్లు మరియు అర్పణ క్రమములో అర్పణలను సమర్పించుటకు నడిపిస్తున్నట్లుగా ఉండాలి. | 52. నాట్యం ఒక ప్రదర్శనగా చేయకూడదు ముఖ్యముగా పవిత్ర గర్భగుడిలో. |

| | |
|---|---|
| **53. ప్రొజెక్టర్ల ఉపయోగం:** LCD ప్రొజెక్టర్ ఉపయోగం ప్రజలను దివ్యపూజ సాంగ్యముల నుండి దాని వైపుకు మరలకుండా ఉండేట్లు అమర్చాలి. ప్రొజెక్టర్ తెర ప్రజలను పవిత్ర స్థలము నుండి వారు ప్రక్కకు తిరగకుండా ఉండేట్లు అమర్చాలి, అవసరమైనంత వరకే వాడాలి, దానికి మంచి పరికరాలను వాడాలి. అప్పుడు అది సున్నితంగా ఎటువంటి శబ్దాలు చేయకుండా పనిచేస్తుంది. | 53. దైవార్చన పఠనాలు మరియు సంఘప్రార్థనలు ప్రొజెక్టర్ తెరపై చూపించరాదు, ప్రజలు వీటిని శ్రద్ధగా వినాలి, వారి శ్రద్ధంతా దైవవాక్యార్చన పీఠం దగ్గరే ఉండాలి. అదేవిధంగా కృతజ్ఞతార్చన సమయంలో ఎక్కువ పవిత్ర సంజ్ఞలు ఉంటాయి కనుక ప్రొజెక్టర్ అవసరం లేదు, ఒకవేల ప్రజలు సమాధానాలు చెప్పాలి అన్నప్పుడు ఒక్క నిమిషం అలా చూపించవచ్చు, సమాధానాలు మాత్రమే చూపించాలి. కృతజ్ఞతార్చన క్రమములో కదులుతున్న లేదా నిలబడి ఉన్న బొమ్మలను చూపించరాదు ఇలా చేస్తే ప్రజలు జరుగుతున్న పవిత్ర సాంగ్యమును మరచి వీటినే చూస్తారు. |

### 3. ముగింపు

ద్వితీయ వాటికన్ తరువాత వచ్చిన దైవార్చన నియమాలు ప్రజలను మరియు వివిద దేశాలలో శ్రీసభను చాలా ప్రభావితం చేశాయి. విశ్వాసులు, గురువులు భక్తిగా దైవార్చనను సాగించారు. కాని కొన్ని సంవత్సరాల తరువాత దైవార్చనపై ప్రజల విశ్వాసం సన్నగిల్లుతూ వచ్చింది. కొందరు తెలియక చేస్తుంటే కొందరు పవిత్ర దైవార్చన చట్టానికి అధిపతులుగా వ్యవహరించారు. ఇటువంటి సమయంలో మన భారతదేశ శ్రీసభ మేత్రాణులు ఒక కూటమి ఏర్పాటు చేసి "దివ్యపూజ సరియైన పద్ధతిలో జరుపుటకు నియమాలు" అను ఈ పుస్తకం తయారుచేశారు.

దైవార్చన ద్వారానే ముఖ్యముగా దివ్యపూజ సమర్పణం ద్వారానే దేవుని కృపావర వాహిని మనలను ఆర్ద్రం చేస్తుంది, క్రీస్తుప్రభువు ద్వారా మనం శుద్ధికరణం పొందుతాం, తండ్రి దేవుని మనసార స్తుతించి మహిమ పరచగలుగుతాం, ఇవన్ని దివ్యపూజ ద్వారానే పరిపూర్ణమవుతాయి, పరిపూర్ణ ఫలాలను అందచేస్తాయి. ఈ పరిపూర్ణ ఫలాలను మనము పోదాలంటే ఈ దివ్యపూజ నియమాలను భక్తిశ్రద్ధలతో పాటించాలి.

❊ ❊ ❊ ❊





“కనుక ఈ రొట్టెను భుజించునప్పుడెల్ల, ఈ పాత్రము నుండి
పానము చేయునప్పుడెల్ల ప్రభువు వచ్చు వరకు మీరు ఆయన
మరణమును ప్రకటింతురు” - 1 కొరింతీ 11:26


**భక్త యోహాను ప్రచురణలు**

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ : 040-27201427, 27200370
e-mail : stjohnshyd2@gmail.com
www.stjohnseminaryhyd.org

*Holycrossprinters 9848145417*